# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

శుక్రవారం, మే 29, 2026 | సంపుటి - 20 | సంచిక 250 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### చివరి ధాన్యం గింజవరకు కొంటాం

### మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడి



మంచిర్యాల : తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంత గానో కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. చివరి ధాన్యం గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు చేస్తామని పేర్కొన్నారు. గురువారం చెన్నూరు మండలం బావు రావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి పంట దిగుబడి ఎక్కువగా వచ్చిందని తెలిపారు. తరువాయి 2లో

## దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

### నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు

### భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగర నిర్మాణం

### మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబుల వెల్లడి



హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక తరువాయి 2లో



### ఉనికి కోసమే బీజేపీ నాయకుల

## రైతు భరోసా

### ఎఫ్‌సిఐ ద్వారా ఎందుకు కొనరో చెప్పాలి

### బిజెపి నేతలపై మండిపడ్డ మంత్రి అడ్లూరి

జగిత్యాల : ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర చేస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గురువారం జగిత్యాల జిల్లాలో మంత్రి అడ్లూరి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాలు పేరుతో దోచుకుంటున్నామని బీజేపీ నాయకులు ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే భద్రాద్రి రాముడి ఆలయం ముందు మాట్లాడాలని మంత్రి అడ్లూరి సవాల్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ నాయకత్వం సరిగా లేకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. తరువాయి 2లో



2

## ఎట్టకేలకు సిద్దరామయ్య రాజీనామా

### గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ అందచేత

### అధిష్టానం ఆదేశాల మేరకు వైదొలుగుతున్నట్లు ప్రకటన

### జాతీయ రాజకీయాలకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి

బెంగళూరు : కర్నాటకానికి తెరపడింది. గతకొంతకాలంగా ఊహాగానాలతో సాగిన రాజకీయాలు మలుపు తిరిగాయి. కర్నాటకలో సిద్దరామయ్య జమానా ముగిసింది. ఎట్టకేలకు కర్ణాటకలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు.

### ధాన్యం కొనుగోళ్లపై

## విపక్షాల రాద్ధాంతం

### కావాలనే యాగీచేస్తున్న పలువురు నేతలు

### ధాన్యం కొరుగోళ్లు సజావుగా సాగుతున్నాయన్న ఉత్తమ్



తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో 75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. అయినప్పటికీ ప్రతిపక్షాలు రాజకీయ లబ్ది కోసం ధాన్యం కొనుగోళ్లపై రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు.

హైదరాబాద్ : కొనుగోలు పక్రియను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇకపోతే అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని కొని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు.అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడిన పరిస్థితులపై మంత్రి అత్యవసర సమీక్ష నిర్వహించామని అన్నారు. అకాల వర్షాలకు తడిసిన 9,214 టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు నష్టం కలిగించే ఎటువంటి చర్యలనూ ప్రభుత్వం తరువాయి 2లో



## పరస్పర సహకారంతో జలవివాదాల పరిష్కారం

### కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుపై మోడీ సమీక్ష

న్యూఢిల్లీ : అంతర్రాష్ట్ర జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలన్నారు. ఈ విషయంలో కెన్-బెట్వా ప్రాజెక్టు ఓ నమూనాగా నిలవాలని చెప్పారు. కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై ప్రధాని సమీక్ష నిర్వహించారు. తరువాయి 2లో

### ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు

## కట్టుబడండి

### డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ ఇళ్లు కట్టిన ఘనత మాది

### పొంగులేటి సవావల్‌పై కెటిఆర్ ప్రతిసవాల్



హైదరాబాద్ : సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. తరువాయి 2లో



### ఎన్టీఆర్ అంటే పేదలకు భరోసా..

## రైతుకు నేస్తం

### ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలి

### యువతను రాజకీయాల్లో ప్రోత్సహించిన మహోన్నతుడు

### మహానాడు తీర్మానంలో చంద్రబాబు డిమాండ్

అమరావతి : మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు తెలుగుజాతి సెంటిమెంట్ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద ప్రభుత్వాన్ని అడుగుతానని పేర్కొన్నారు. గురువారం రెండోరోజు మంగళగిరిలో జరుగుతున్న మహానాడు వేడుకలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, టీడీపీ సీనియర్ నేతలు, మంత్రులు నివాళులు అర్పించారు. 1,875 క్లస్టర్ల నుంచి మహానాడుకు టీడీపీ నేతలు, శ్రేణులు భారీగా హాజరయ్యారు. తరువాయి 2లో

### పార్టీలో మహిళా నాయకత్వానికి

## ప్రోత్సాహం

### పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలకు శ్రీకారం

### 11లక్షల మంది మహానాడు కోసం రిజిస్టర్ చేశారు

### మహానాడులో ఇష్టాగోష్టిగా మాట్లాడిన లోకేశ్



అమరావతి : 11 లక్షల మంది పార్టీ క్యాడర్ హాజరై.. మహానాడు మరో సంచలన రికార్డు నమోదు చేసుకుందని టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ అటెండెన్స్‌లో వారంతా నమోదు చేయించుకున్నారని వివరించారు. గురువారం మహానాడులో మంత్రి లోకేశ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామన్నారు. పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకురావాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ కాలం నుంచి పార్టీలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. పదవీకాల పరిమితిని తీసుకు వచ్చింది తామేనని ఈ సందర్భంగా నారా లోకేశ్ గుర్తు చేశారు. ఎన్నికల గురించి కాదు.. సిద్ధాంత పరంగా తాము సంస్కరణలు తీసుకు వస్తున్నామని చెప్పారు. గత మహానాడులో తాను ఆరు శాసనాలు గురించి చెప్పానని ఈ సందర్భంగా నారా లోకేశ్ గుర్తు చేశారు. ఇప్పుడు 'నా తెలుగుదేశం.. నా బాధ్యత' అని నిర్ణయం తీసుకు న్నామన్నారు. ఎవరైనా తన ప్రసంగం ముందు నా తెలుగుదేశం.. నా బాధ్యత అని చెప్పాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. తరువాయి 2లో

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జూన్ 6వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. పెద్దపల్లిలో మూడు గోడౌన్స్ అలాట్‌మెంట్ చేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. హమాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. సింగరేణి నుంచి 40 లారీలు, మైనింగ్ శాఖ నుంచి 40 లారీలను కేటాయించామని అన్నారు. మొత్తం 80 లారీలతో త్వరలోనే రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొని మిల్లులకు తరలిస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల రాద్ధాంతం

ఉపేక్షించబోదని అన్నారు. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలకు 66.75 లక్షల టన్నుల ధాన్యం చేరగా, అందులో 57 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతులకు ఇప్పటివరకు రూ.10,097 కోట్ల చెల్లింపులు జరిగాయని, దీని ద్వారా 8.15 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని వివరించారు. కొనుగోలు చేసిన 57 లక్షల టన్నుల ధాన్యంలో 44.67 లక్షల టన్నులు దొడ్డు రకాల ధాన్యం కాగా, 12.33 లక్షల టన్నులు సన్న రకాల ధాన్యం అని మంత్రి పేర్కొన్నారు. ధాన్యాన్ని మిల్లులకు వేగంగా తరలించేందుకు ఇసుక సరఫరా చేసే లారీలను కొనుగోలు కేంద్రాలకు మళ్లించినట్లు తెలిపారు.

# పార్టీలో మహిళా నాయకత్వానికి ప్రోత్సాహం

ఆలోచించి అందుకు అనుగుణంగా తాము ముందుకు వెళ్లాల్సిఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌లాగా తాము ఏకపక్షంగా ఏకగ్రీవాలు చేసుకోమని చెప్పారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తామన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికలలో నామినేషన్ల పేపర్లు లాక్కుని ఎలా వ్యవహరించారనేది అందరం చూశామన్నారు. అందుకనే ఆయన ఏకగ్రీవాలు చేస్తే ఊరుకోమన్నారని చెబుతున్నారని తెలిపారు. నాడు ఆయన చేశాడు కాబట్టే నేడు భయపడుతున్నారంటూ జగన్ వైఖరిని ఈ సందర్భంగా లోకేశ్ ఎండగట్టారు. డీఎస్సీ పరీక్షలు, నియామకాలు పూర్తయిన ఆరు నెలలు తర్వాత అందులో అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించడం ఏమిటని నారా లోకేశ్ సందేహం వ్యక్తం చేశారు. ఆయనకు ఇప్పుడు ట్యూబ్ లైట్ వెలిగినట్లుందంటూ వ్యంగ్యంగా అన్నారు. అప్పట్లోనే కోర్టులో డీఎస్సీపై జగన్ ఎన్నో కేసులు వేయించారని గుర్తు చేశారు. అన్ని పిటిషన్లను కోర్టు కొట్టివేసిందని.. కానీ మమ్మల్ని ఎక్కడా తప్పు పట్టలేదని నారా లోకేశ్ వివరించారు. ఈ అంశంపై దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు తాను సవాల్ విసిరానని లోకేశ్ గుర్తు చేశారు. దీనిపై జగన్ స్పందిస్తే బాగుంటుందన్నారు. ఒక్క టీచర్ కానీ.. అధికారి కానీ డీఎస్సీపై ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. డీఎస్సీపై నాకు కానీ, ఏ అధికారికి గానీ ఒక్క రూపాయి అయినా ఇచ్చినట్లు నిరూపించాలని జగన్ పార్టీలోని నేతలను ఈ సందర్భంగా లోకేశ్ డిమాండ్ చేశారు. లెవన్ టీమ్ కెప్టెన్‌కు దమ్ముంటే నిరూపించాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు లోకేశ్ సూటిగా సవాల్ విసిరారు. జగన్.. ఆయన కుటుంబ చరిత్రను తవ్వి తీయించారన్నారు. రాజారెడ్డి చేసిన అరాచకాలు, బైరైటీస్ గనుల కోసం వాళ్లు ఎంతమందిని హత్య చేశారనేది జనానికి తెలియచేసిన ఘనత వైఎస్ జగన్‌దేనని ఈ సందర్భంగా నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. తాను వైఎస్ జగన్ కాదని.. ఆయన లాగా తన వద్ద గొడ్డలి లేదంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎంను ఉద్దేశించి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# కర్నాటకలో సిఎం పదవి మూనాళ్ల ముచ్చటే

### ఐదేళ్లు నికరంగా పనిచేసిన వారు ముగ్గురే

### ఒడిదుడుకుల రాజకీయంలో ఐదేళ్లు నిలబడని నేతలు

బెంగళూరు,మే28 : కర్ణాటకలో సీఎం మార్పుపై కొన్ని నెలలుగా సాగుతున్న ప్రచారానికి తెరపడింది. 2023లో ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన సిద్ధరామయ్య.. ఇప్పుడు ఆ కుర్చీని వదులుకోవడం ఖాయమయ్యింది. తన రాజీనామాను ఆయన గవర్నర్ కార్యదర్శికి అందచేశారు. దీంతో డికె శివకుఆర్‌కు లైన్ క్లీయర్ అయ్యింది. ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ ఇచ్చిన మాట ప్రకారం.. డీకే కొత్త సీఎంగా బాధ్యతలు స్వీకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయనే ఖరారయితే ఆయన పదవిలో రెండేళ్లు మాత్రమే ఉంటారు. అసలు కర్ణాటకలో పూర్తి పదవీకాలం సీఎం సీటులో కొనసాగడం ఒక ఘనత అనే చెప్పవచ్చు. 1956 నుంచి కేవలం ముగ్గురు నేతలు మాత్రమే పూర్తికాలం పదవిలో కొనసాగారు. కాంగ్రెస్ నేత ఎస్. నిజలింగప్ప రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1956లో ఏడాదికిపైగా ఆ పదవిలో ఉన్న ఆయన.. 1962లో మరోసారి ఆ బాధ్యతలు స్వీకరించారు. 1968 వరకు అంటే ఐదేళ్ల 345 రోజులు అధికారంలో కొనసాగారు. అదేపార్టీకి చెందిన డి. దేవరాజ్ అర్స్ 1972 నుంచి 1977వరకు, తర్వాత సిద్ధరామయ్య 2013 నుంచి 2018 వరకు పూర్తికాలం ముఖ్యమంత్రులుగా కొనసాగారు. అయితే 1973 వరకు మైసూరు రాష్ట్రంగానే ఉండేది. అనంతరం కర్ణాటకగా పేరు మార్చారు. ఇదిలాఉంటే.. కర్ణాటకలో అతి తక్కువ కాలం పనిచేసిన ముఖ్యమంత్రులూ ఉన్నారు. ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాని సందర్భాల్లో ఎన్నికల అనంతరం పొత్తులు కుదిరినా.. అవి నిలబడలేదు. దాంతో ప్రభుత్వాలు కూలిన సందర్భాలున్నాయి. 2007లో యడియూరప్ప కేవలం వారం రోజులే సీఎం పదవిలో ఉన్నారు. భాజపా-జేడీఎస్ కూటమిలో సయోధ్య లేక ప్రభుత్వం కూలిపోయింది. వీరేంద్రపాటిల్ రాజీనామా చేయడంతో 1971లో కొన్నివారాల పాటు ఎస్ఆర్ కాంతి ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహించారు. కాంగ్రెస్-జేడీఎస్ నేతృత్వం కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో ధరమ్ సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఏడాదిపైగా ఆ కుర్చీలో కొనసాగినా.. కూటమిలోని వైరుధ్యాలతో ఆ ప్రయాణం సవ్యంగా సాగలేదు. దాంతో ఆయన 2006లో పదవిని కోల్పోయారు. పార్టీలో అంతర్గత రాజకీయాల కారణంగా భాజపా సదానందగౌడను పక్కనపెట్టడంతో 2012లో జగదీశ్ శెట్టర్ ముఖ్యమంత్రి అయ్యారు. తర్వాత అసెంబ్లీ గడువు ముగిసింది.

# బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న కోమటిరెడ్డి

నల్గొండ : బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా పట్ల ఉన్న అపారమైన విశ్వాసాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదని వ్యాఖ్యానించారు. నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ఈద్గాలో ముస్లిం సోదరులను కలిసి మాట్లాడారు. బక్రీద్ కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదని... ఇది మానవాళికి ఒక గొప్ప జీవన సందేశమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయాలకు అతీతంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 'భారత్ జోడో' యాత్ర చేపట్టారని ప్రస్తావించారు. అన్నివర్గాలు, అన్నిమతాల ప్రజలు సమానమేనని, అందరు కలిసి మెలిసి ఉండాలనే గొప్ప సందేశంతో 'భారత్ జోడో' యాత్ర చేశారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అనడానికి ఇది ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. నల్గొండలో మతసామరస్యానికి, గంగా - జమునా - తెహజీబ్‌కు నిలువెత్తు సాక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

# దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతోందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ పనులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్‌సీడీఏ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ పనులపై మార్గనిర్దేశర చేశారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆధునిక మౌలిక వసతులతో ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ దేశానికి తలమానికంగా నిలవడం ఖాయమని మంత్రులు స్పష్టం చేశారు.

# ఎన్టీఆర్ అంటే పేదలకు భరోసా.. రైతుకు నేస్తం

ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మహానాడులో ఆయనకు నివాళి అర్పించే తీర్మానంపై సీఎం ప్రసంగించారు.ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మహానాడులో ప్రతిపాదించారు. దేశ అత్యున్నత పౌర పురస్కారంతో ఎన్టీఆర్‌ను సత్కరించాలని సీఎం చంద్రబాబు కోరారు. ని చెప్పుకొచ్చారు. ఎన్టీఆర్ పాలన రైతులకు అండ, మహిళలకు భరోసా, కార్మికులకు అభయం.. యువతకు దిక్సూచి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 1983లో రాజకీయాల్లో యువతకు ఎన్టీఆర్ అవకాశాలు కల్పించారని ప్రస్తావించారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించారని.. భవిష్యత్తులో సమర్థ నాయకత్వం ఉండేలా భవిష్యత్తు కార్యాచరణ చేపడుతున్నామని అన్నారు. నిన్నటి మహానాడులో జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు లోకేశ్ ప్రతిపాదించిన 33 శాతం రిజర్వేషన్‌ను మనమే ప్రారంభిద్దామని తెలిపారు. 33 శాతం రిజర్వేషన్లను మహిళలకు కల్పించాలని కేంద్రాన్ని మరోమారు కోరదామని అన్నారు. తెలుగు వెలుగుగా నిలిచిన స్వర్గీయ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనేది మన అందరి డిమాండ్ అని చెప్పారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోయారని ఉద్ఘాటించారు. సామాన్యుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించారన్నారు. తెలుగు ప్రజల ఐక్యత కోసం పనిచేసిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని ఉద్ఘాటించారు. భారత రాజకీయ చరిత్రలో ఆయన సేవలు విశిష్టం, అపూర్వమని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజల మనోభావాలను గుర్తించి ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని మహానాడు ఏకగ్రీవంగా తీర్మానిస్తోందని తెలిపారు. ఇది మనందరి ఆకాంక్ష, ప్రతీ తెలుగువారి కోరిక అని చెప్పారు. దేశరాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికిన మహోన్నత నాయకుడికి భారతరత్న ఇవ్వాలని కేందప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు కోరారు.ఎన్టీఆర్ అంటే అన్నివర్గాలు ప్రేమించే నాయకుడని ప్రశంసించారు. సాధారణ ఉద్యోగిగా మొదలై, సినిమా స్టార్‌గా ఎదిగి, ప్రజల కోసం పార్టీ పెట్టి సీఎంగా ఎదగడం ఎన్టీఆర్‌కే సాధ్యమని కీర్తించారు. ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని ఎన్టీఆర్ ఎప్పుడూ వీడలేదని తెలిపారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అనేదే ఎన్టీఆర్ సిద్ధాంతమని పేర్కొన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోతారని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ జయంతి తెలుగువారందరికీ పండుగ రోజు అని తెలిపారు. సాధారణ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి సినీ జీవితంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఎదిగారని ప్రశంసించారు. ఎన్టీఆర్ మళ్లీ పుడితే తప్ప ఆయన క్రమశిక్షణ, ఆయన ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదని అన్నారు. ఆయన ఎక్కడ ఉన్నా తెలుగువారి ఆత్మగౌరవం కోసమే జీవించారని తెలిపారు. రైతుబిడ్డ నుంచి సినిమాల్లో శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రల వరకూ, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారని ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ పేరు తలుచుకుంటేనే పట్టుదల, ఆత్మవిశ్వాసం వస్తుందని చెప్పారు. ఆయన పేరు తలచుకుని సంకల్పం చేస్తే చాలు దానికి తిరుగు ఉండదన్నారు. దేశ రాజకీయాల్లో ఆయన లాంటి నాయకుడు మరొకరు లేరని.. ఆయన మొదట సబ్‌రిజిస్ట్రార్‌గా ఉద్యోగంలో చేరారని ప్రస్తావించారు. నీతి నిజాయితీతో ఆయన సినిమాల్లోకి వచ్చారని.. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే ముఖ్యమంత్రి అయ్యారని వ్యాఖ్యానించారు. ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిందని.. కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించిందని సీఎం చంద్రబాబు తెలిపారు.

# ఎట్టకేలకు సిద్ధరామయ్య రాజీనామా

గురువారం మధ్యాహ్నం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లారు. అయితే, ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యదర్శికి సిద్ధరామయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం ధ్రువీకరించారు. సీఎం రాజీనామా లేఖను తీసుకున్నామని, గవర్నర్ తిరిగొచ్చాక దీనిపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. గహ్లోత్ ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్నారు. అనంతరం మంత్రులు డీకే శివకుమార్, పరమేశ్వరతో కలిసి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం సూచనలతో సీఎం పదవికి రాజీనామా చేశా. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైదొలిగా. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశా. దాన్ని గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇప్పటివరకు ప్రభుత్వ నిర్వహణలో నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. రాజ్యాంగమే మా ధర్మం. ప్రజలే మాకు దేవుళ్లు అని సిద్ధరామయ్య తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను 5 ఏళ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ సిద్ధరామయ్య ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించాను. మ్యానిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చా. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీలు అమలు చేశాం. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. కానీ, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవి కోసం, డబ్బు కోసం ఏనాడూ పాకులాడలేదని సిద్ధరామయ్య వివరించారు. ఈ క్రమంలో అధిష్టానంతో భేటీకి సిద్ధరామయ్య ఢిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య స్థానంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో కొత్త శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రమాణస్వీకార కార్యక్రమంపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

# జూన్ 2ను ఆర్టీసీ విలీనం డేగా ప్రకటించాలి

### ఎంపిలను కలిసి విన్నవించిన జెఎసి నేతలు

### ఆర్టీసీ విలీనంపై స్పష్టత కోరుతూ 1న ఇందిరాపార్క్ వద్ద దీక్ష

### తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రకటన

హైదరాబాద్,మే28 : ఆర్టీసీ ఎన్నికల కంటే ముందుగానే జూన్ 2న విలీనం అపాయింటెడ్ డేట్ ను ప్రభుత్వం ప్రకటించాలని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ముఖ్యమంత్రి రాజకీయ ప్రధాన సలహాదారులు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి కి, ఎంపీ రఘురామ్‌రెడ్డిని జేఏసీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ రవాణా శాఖ మంత్రి ఇటీవల ఆర్టీసీలో గుర్తింపు ఎన్నికలు జరిగిన తరువాతనే విలీనం ప్రక్రియను ప్రారంభిస్తామని వెల్లడించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం తగిన నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, కో కన్వీనర్లు సుద్దాల సురేష్, యాదగిరి, బాబు, బుద్ధ విశాల్, రవికిరణ్ పాల్గొన్నారు.ఇదిలావుంటే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లుగా అపాయింటెడ్ డే ప్రకటించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ 1వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సామూహిక దీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిపారు. యూనియన్ ఎన్నికలకు ముందుగా ఉద్యోగుల పక్రియ పూర్తి చేయాలని.. 2026 మే 1 నుంచి అపాయింటెడ్ డే ప్రకటించాలని టీజేఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. అపాయింటెడ్ డే కంటే ముందుగా యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రకటించడంతో ఉద్యోగుల్లో అయోమయం నెలకొందని వారు అభిప్రాయపడ్డారు. జూన్ 1వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇందిరాపార్క్ వద్ద దీక్ష నిర్వహించనున్నట్లు టీజేఎంయూ వ్యవస్థాపక రాష్ట్రకార్యదర్శి హనుమంతు ముదిరాజ్ తెలిపారు. ప్రభుత్వంలో విలీనం కోరుకునే ఉద్యోగులంతా యూనియన్లకు అతీతంగా ఈ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షకు తెలంగాణ ఆర్టీసీ కార్మిక సమాఖ్య కూడా మద్దతు ప్రకటించింది. యాజమాన్యం వద్ద పరిష్కారం కావాల్సిన 29 సమస్యలపై చర్చలు కొనసాగుతున్న సమయంలో ఎన్నికలకు వెళ్లడం వల్ల కార్మికులు నష్టపోతారని కార్మిక సమాఖ్య నాయకులు కె.రాజిరెడ్డి తెలిపారు. విలీనం అనంతరం యూనియన్లు కొనసాగితే ఎన్నికల అంశాన్ని పరిశీలించాలని పేర్కొన్నారు. విలీనానికి సంబంధించిన విధివిధానాలు రూపొందించే కమిటీలో ప్రతి యూనియన్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అపాయింటెడ్ డే ప్రకటించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు.

# కేరళంలో ఇడి అధికారులపై దాడి

### 8మందిని అరెస్ట్ చేసినట్లు రాష్ట్ర డిజిపి వెల్లడి

తిరువనంతపురం,మే28 : కేరళం మాజీ సీఎం పినరయి విజయన్ నివాసంలో ఈడీ రెయిడ్స్ సందర్భంగా అధికారులపై దాడికి యత్నించిన 8 మందిని అరెస్టు చేశామని రాష్ట్ర పోలీస్ చీఫ్ ఎ. చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇతర నిందితులను ఇప్పటికే గుర్తించామని కూడా తెలిపారు. హోం మంత్రి రమేశ్ చెన్నితాలతో సమావేశం అనంతరం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని హోం మంత్రి ఆదేశించారని అన్నారు. బుధవారం ఈడీ రెయిడ్స్ గురించి తెలియగానే భారీ స్థాయిలో పోలీసులను పంపించామని కూడా పోలీస్ చీఫ్ తెలిపారు. 'తాము వస్తున్నట్టు ఈడీ అధికారులు ముందుగా మాకు చెప్పలేదు. కానీ ఆపరేషన్ మొదలవగానే మేము భద్రత కోసం సెక్యూరిటీని పంపించాము' అని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకూ కేరళ పోలీసులు దాదాపు 300 మందిపై కేసులు పెట్టారు. అనుమతిలేకుండా గుమిగూడటం, ప్రభుత్వ అధికారులపై దాడి, అక్రమ నిర్బంధం, హత్యాయత్నం తదితర అభియోగాలతో కేసులు నమోదు చేశారు. మ్యూజియమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం, ఈడీ అధికారులపై నిందితులు కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో ఒక అధికారి చేయికి గాయమైంది. ఈడీ వాహనం అద్దాలు పగిలిపోయాయి. ఈ దాడిలో కారు డ్రైవర్ కూడా గాయపడ్డారు. పరిస్థితి అదుపు చేసేందుకు ప్రయత్నించిన కేరళ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులను కూడా నిరసనకారులు టా÷-గ్గ÷ట్ చేశారు. నిరసన కారుల వల్ల దాదాపు రూ.3 లక్షల మేర నష్టం జరిగినట్టు తెలుస్తోంది. సీఎంఆర్ఎల్ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి మాజీ సీఎం పినరయి విజయన్, ఆయన కుటుంబసభ్యుల ఇళ్లల్లో ఈడీ బుధవారం ఈ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే.

# ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా

సీఎం రేవంత్‌రెడ్డితో కలసి పనిచేద్దామని అన్నారని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్టానికి రావాల్సిన నిధులను తీసుకురావడంలో కేంద్ర మంత్రులు విఫలమయ్యారని విమర్శించారు. గోదావరి పుష్కరాలకు కేంద్రం నుంచి బీజేపీ ఎంపీలు నిధులను తీసుకురావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ చేశారు. ఇదిలావుంటే ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బక్రీద్ సందర్భంగా ధర్మపురిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ.7 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అదేవిధంగా ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా నిరుద్యోగ యువతీయువకులు స్వయం ఉపాధి పొందడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో పదో తరగతి, ఇంటర్ పూర్తయిన యువతీయువకులకు స్వయం ఉపాధి కోసం రూ.2 లక్షల రుణాలు బ్యాంకు ద్వారా ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆసక్తి కలిగిన యువత రుణాల ద్వారా స్వయం ఉపాధి పొందాలని మంత్రి కోరారు. మంత్రి వెంట ధర్మపురి మున్సిపల్ ఛైర్మన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సంగనభట్ల దినేష్ తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు కట్టుబడండి

ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది. స్వరాష్ట్రాన్ని సాధించాం.. స్వగృహ స్వప్నాలను సాకారం చేశాం. డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాం. 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా? శపథం చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించాలి. 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే.. ఓట్లు అడుగుతాం అనే సవాల్‌కు కట్టుబడి ఉండాలి. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించిన ఘనత మాది. రూ.70 వేలతో మేం అగ్గిపెట్టె ఇళ్లు కట్టలేదు. మేం కట్టిన ఒక్కో ఇల్లు.. 7 ఇందిరమ్మ ఇళ్లతో సమానం. వీకెండ్‌లో ప్రజలు ఇళ్లు కూల్చి వికృతానందం పొందుతున్నారు. రెండున్నరేళ్లలో నగరంలో కట్టిన ఇళ్లు ఎన్ని?పడగొట్టిన ఇళ్లు ఎన్ని?.. దీనిపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఉందా? మీరెన్ని ప్రగల్భాలు పలికినా, డైవర్షన్ డ్రామాలు ఆడినా 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# పరస్పర సహకారంతో జలవివాదాల పరిష్కారం

ప్రాజెక్టుల అమలులో జాప్యం.. ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని రాష్ట్రాలకు మోదీ సూచించారు. 'స్వచ్ఛభారత్ మిషన్- అర్బన్ 2.0'ను కూడా సమీక్షించారు. నగరాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల వినియోగాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. కాల్వల వెంబడి, కాల్వలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలనూ అన్వేషించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.

# అర్థరాత్రి పోలీస్ కార్యాలయం ముందే దారుణం

### ఒంటరిగా వెళుతున్న యువతిపై ఐదుగురు నేపాలీల దాడి

### కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఐదుగురికి దేహశుద్ధి

హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ బషీర్ బాగ్‌లో ఒంటరిగా వెళ్తున్న ఓ యువతి పట్ల కొందరు దుండగులుఅసభ్యంగా ప్రవర్తించారు. బుధవారం రాత్రి బషీర్ బాగ్ సీసీఎస్ కార్యాలయం ఎదురుగా ఈ దారుణం చోటుచేసుకుంది. రోడ్డుపై ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న యువతిని చూసి... ఐదుగురు నేపాలీ యువకులు రెచ్చిపోయారు. నడిరోడ్డుపైనే ఆమె చేయి పట్టి లాగుతూ అసభ్యంగా ప్రవర్తించారు. ఈ ఊహించని పరిణామంతో తీవ్ర భయాందోళనకు గురైన ఆ యువతి.. ధైర్యం చేసి గట్టిగా కేకలు వేసింది. యువతి అరుపులు విన్న చుట్టుపక్కల ప్రజలు, స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. పారిపోవడానికి ప్రయత్నించిన ఆ ఐదుగురు నేపాలీలను చుట్టుముట్టి నిర్బంధించారు. నడిరోడ్డుపైనే వారికి స్థానికులు దేహశుద్ధి చేశారు. అనంతరం నిందితులను అబిడ్స్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో వీరంతా స్థానికంగా ఉండే ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్నట్లు తేలింది. నిందితులను సునీల్, ఉమేష్, లక్ష్మణ్, పురుషోత్తం, రామ్ గా గుర్తించారు. ఈ ఐదుగురిపై కేసు నమోదు చేసిన అబిడ్స్ పోలీసులు... దర్యాప్తును వేగవంతం చేశారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

న్యూఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్‌లో బులియన్ ధరలు పడిపోవడం, డాలర్ బలపడటం వంటి కారణాలతో భారత మార్కెట్‌లో పసిడి ధరలు దిగివచ్చాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లు పుంజుకుంటున్నాయి. దీంతో బంగారం, వెండి ధరలు దిగి వచ్చాయి. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,060గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.2230 మేర తగ్గింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,43,050గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.2050 మేర తగ్గింది. రోవైపు వెండి ధరలు కూడా భారీ తగ్గుదల నమోదు చేశాయి. వెండి కిలోకు పదివేల రూపాయల మేర తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,85,000గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,75,000గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,85, 000గా, బెంగళూరులో రూ.2,75,000గా ఉంది.

# బలమైన ఈదురుగాలులు

### గంగా నదిలో పడవబోల్తా పడి ఇద్దరు మృతి

పాట్నా,మే28 : పాట్నా జిల్లా బర్హ్ సబ్-డివిజన్‌లోని ఉమానాథ్ గంగా ఘాట్ వద్ద ఘోర ప్రమాదం జరిగింది. గంగా నదిలో ప్రమాదవశాత్తూ పడవ బోల్తాపడి ఇద్దరు మృతిచెందగా.. ఐదుగురు గల్లంతయ్యారు. బలమైన గాలుల కారణంగా పడవ బోల్తా పడినట్లు తెలుస్తోంది. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం.. గంగా ఘాట్ వద్దకు వచ్చిన సుమారు 14 నుంచి 15 మంది నది అందాలను చూసేందుకు పడవ ఎక్కారు. గంగా నది మధ్యలోకి వెళ్లగానే ఒక్కసారిగా బలమైన గాలులు వీచాయి. దీంతో ఒక్కసారిగా పడవ బోల్తా పడింది. కాపాడాలంటూ బాధితులు కేకలు వేశారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు బోట్ల సహాయంతో ఐదుగురిని రక్షించగా.. మిగతా వారంతా గల్లంతయ్యారు. బోట్ల యజమానుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలనూ రంగంలోకి దింపారు. గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే, ఇద్దరి మృతదేహాలు లభించాయని, మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని బర్హ్ ఎస్‌డీపీవో రామకృష్ణ తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# సిద్ధరామయ్యకు డికె పాదాభివందనం

### బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో ఘటన



బెంగళూరు,మే28 : కర్నాటక కాంగ్రెస్‌లో మార్పు అనివార్యమయ్యింది. సిద్ధరామయ్య తన సీఎం పదవి నుంచి తప్పుకునేందుకు సిద్దమయ్యారు. ఈ క్రమంలో బెంగుళూరులో ఆసక్తికర ఘటన చోటుచేసుకున్నది. సీఎం సిద్ధరామయ్యను ఆలింగనం చేసుకున్న డిప్యూటీ సీఎం శివకుమార్ ఆ తర్వాత పాదాభివందనం చేశారు. సిద్ధరామయ్య కాళ్లను మొక్కి డీకే శివ.. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ సమయంలో ఈ ఘటన జరిగింది. గురువారం రాష్ట్ర గవర్నర్ థావర్‌చాంద్ గెహ్లాట్ అపాయింట్‌మెంట్ సిద్ధరామయ్య తీసుకున్నారు. ఉదయం తన క్యాబినెట్ మిత్రులకు సీఎం సిద్ధరామయ్య అల్పాహార విందు ఏర్పాటు చేశారు. తన అధికార నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో పాటు ఆయన క్యాబినెట్ మిత్రులు కూడా బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌కు హాజరయ్యారు. శివకుమార్‌ను సీఎం సిద్ధరామయ్య హత్తుకున్న ఫోటోను సీఎంవో ఆఫీసు రిలీజ్ చేసింది. ఇక తర్వాత సిద్ధరామయ్య పాదాలను శివకుమార్ తాకారు. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఆదేశాల ప్రకారమే సీఎం సిద్ధరామయ్య తన పదవి నుంచి తప్పుకున్నారు.

# ఎన్టీఆర్‌కు ప్రధాని మోడీ నివాళి

న్యూఢిల్లీ : మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని ఓ పోస్టు పెట్టారు. 'మహనీయులు ఎన్టీఆర్ గారి జయంతి సందర్భంగా వారికి ఘన నివాళు లు. పేదలకు, అణగారిన వర్గాలకు గౌరవాన్ని కల్పించే దిశగా ప్రజా సంక్షేమం, సుపరిపాలన పట్ల ఆయనకున్న అంకితభావం నేటికీ ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచి ఉంది. చలనచిత్ర రంగానికి ఆయన అందించిన సేవలు తరతరాలను అలరిస్తూనే ఉన్నాయి. ఆయన జీవితం, ఆశయాలు ఎంతోమందికి అపారమైన స్ఫూర్తిని అందిస్తూనే ఉంటాయి. నా మిత్రుడు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రజల కోసం ఆయన కలలుగన్న ఆశయాలను సాకారం చేయడానికి కట్టుబడి ఉంది' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

# పేరు వేతనాల పెంపు.. జరిగింది తగ్గింపు



రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల కనీస వేతనాలను భారీస్థాయిలో పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 21న ప్రకటించారు. పెరిగిన కనీస వేతనాలను జూన్ 1 నుంచి అన్ని సంస్థలకు అమలు చేస్తామని, ఇది అమలు జరిగేలా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చామని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంటులో గల కోటి 11 లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, వారి కుటుంబాలకు మేలు జరుగనున్నది. అయితే, ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల పెంపు అసంబద్ధంగా, అన్యాయంగా ఉందనేది అర్థమవుతున్నది. 1948 నాటి కనీస వేతనాల చట్టం, కార్మిక సంఘాల డిమాండ్లు, 1991 నాటి సుప్రీంకోర్టు ఆదేశాలు, డాక్టర్ ఆంగ్రాయిడ్ ఫార్ములా, రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. సర్కార్ నిర్ణయంతో కనీస వేతనాల పెంపు వల్ల రాష్ట్రంలోని అన్నిరంగాల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు లాభం చేకూరకపోగా తీరం నష్టం చేస్తుందనేది వాస్తవం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటింది. ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి తమ ఎన్నికల ప్రణాళికలో కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు ఎంతమాత్రం సిద్ధం కాలేదని విశదమవుతున్నది. కార్మికుల కనీస వేతనాలను భారీగా పెంచుతున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రకటనలు కూడా ప్రచారం ఘనం.. ఫలితం శూన్యం కానున్నది. కార్మికుల కరువుభత్యం కనీస వేతనాల్లో కలిపే ఆలోచన సైతం చేయలేదు. బీఆర్ఎస్ హయాంలో అన్‌స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనం రూ.1,809గా నిర్ణయించి కరువుభత్యం (డీఏ) పాయింట్ ఒక్కింటికి రూ.12గా నిర్ణయించింది. కనీస వేతన సలహా బోర్డు సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్నది. దీని ప్రకారం 2021 జూన్ 25న కేసీఆర్ సర్కార్ ఐదు జీవోలను జారీ చేసింది. కానీ ప్రస్తుత పాలకులు రెండున్నరేండ్ల కాలంలో గెజిట్ కూడా విడుదల చేయకుండా వదిలివేశారు. కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు కనీస వేతనాన్ని రూ.14 వేలకు కుదించటమే కాకుండా, డీఏ పాయింట్లను పరిగణనలోకి తీసుకోలేదు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోటి పది లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు అన్యాయం చేయటమే అవుతుంది. ప్రభుత్వ వైఖరి పెట్టుబడిదారులు, యాజమాన్యాలకు మేలు చేసేదిగా ఉన్నదని స్పష్టమవుతున్నది. పెంచిన వేతనాల్లో పెరుగుదల లేకుండా ఉండటమే కాకుండా ప్రస్తుతం పొందుతున్న కనీస వేతనాలపై రూ.8,444 వరకు కార్మికుడు నష్టపోతున్న పరిస్థితి నెలకొననున్నది. కార్మికులను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ సర్కార్ పూనుకుంటున్నది. నిజంగా కార్మికుల వేతనాల పెంపునకు చిత్తశుద్ధితో కృషిచేయాలని భావిస్తే కార్మిక సంఘాలు, సంబంధిత అధికారులతో చర్చించాలి. ప్రస్తుతం అమలు జరుగుతున్న వేతనాలు, పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, కార్మికుల జీవన ప్రమాణాలను గుర్తించటం ద్వారా సరైన నిర్ణయం తీసుకొని ఉండాల్సి ఉన్నది. కానీ ఈ దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేయకపోవటంతో కనీస వేతనాలను పెంచాలనే నిజాయితీతో కూడిన ఆలోచన ఎంతమాత్రం లేదని స్పష్టమవుతున్నది. వాస్తవానికి నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల, కార్మికుల జీవన ప్రమాణాలు, సుప్రీంకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు కార్మికుల కనీస వేతనం రూ.32 వేలుగా నిర్ణయించాల్సి ఉంటుంది. కార్మిక సంఘాలన్నీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనే డిమాండ్‌ను న్యాయబద్ధమైనదిగా తీసుకొని ప్రభుత్వం అంగీకరించాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఇప్పటికే అమలు జరుగుతున్న వేతనాల్లో కనీస వేతనంగా రూ.28,444 చెల్లిస్తున్నారు. కనీసం దీనినైనా పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీసవేతనాలు అసంబద్ధంగా ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటకలో కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనం 60 శాతం అంటే రూ.19,300 నుంచి రూ.31,100 వరకు పెంచారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కనీస వేతనాల పెంపులో పక్క రాష్ట్రంలోని తమ స్వపక్షం తీసుకున్న నిర్ణయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం విచిత్రం. ప్రభుత్వం పెంచిన కనీస వేతనాలను ఆయా యాజమాన్యాలు అమలు చేసేలా కార్మిక శాఖ అధికారులకు ఆదేశాలిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. వాస్తవానికి కనీస వేతనాలు అమలు చేయించటానికి కార్మికశాఖ అధికారులకు సంపూర్ణ అధికారాలు అప్పగించాలంటే ముందుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లపై స్పష్టమైన ప్రకటన చేయాలి. మోదీ సర్కార్ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తెలంగాణలో అమలు చేసేది లేదని ముందుగా ప్రకటించాలి. రాష్ట్ర క్యాబినెట్ ఈ మేరకు తీర్మానం చేయాల్సిన అవసరం ఎంతో ఉన్నది. కానీ ఈ కోడ్‌లను వ్యతిరేకించకుండా రాష్ట్రంలో కనీస వేతనాల అమలుకు అంగీకారం తెలుపుతూ కార్మిక అధికారులకు అధికారాలు ఇస్తామని ప్రకటించటం మరో మోసపూరితమైన ఆలోచన తప్ప ఆచరణకు తోడ్పడేది ఎంతమాత్రం కానేకాదు.

# కాజీపేటలో త్వరలో ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభం : రైల్వే మంత్రి

కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తికావచ్చిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని చెప్పారు. రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్ 200 ఇంటర్ సిటీ రైళ్లను తయారు చేస్తుందని తెలిపారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై ఆయన ఇవాళ కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ తయారయ్యే రైళ్లను దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇంటర్ సిటీ రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్‌తో రూపొందుతాయని అన్నారు. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఉంటాయని అన్నారు. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రైళ్లను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ రైళ్లలో రీజనరేటివ్ బ్రేకింగ్ ఉంటుందని అన్నారు. రైలు బ్రేకులు వేసినప్పుడు ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే ఆధునాతన పరిజ్ఞానంతో తయారు చేస్తున్నామని చెప్పారు.

# రూబియో పర్యటనలో ఆంతర్యం

భారత్ అమెరికా మధ్య గత ఏడాది కాలంగా ద్వైపాక్షిక సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత్‌లో నాలుగు రోజుల పాటు పర్యటించడంలో విశేష ప్రాముఖ్యత ఉంది. అమెరికా విదేశాంగ మంత్రిగా 2025 జనవరిలో మార్కొ రూబియో బాధ్యతలు చేపట్టిన తరువాత భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటన ఉద్దేశం ద్వైపాక్షిక సంబంధాలను సజావుగా మార్చడానికే అన్న భావం కలుగుతోంది. భారత్ అమెరికా మధ్య సమస్యలు బహుముఖంగా ఉన్నాయి. అమెరికా భారీ టారిఫ్‌లు, వీసాల్లో పెద్ద ఎత్తున కోతలు, ఇమ్మిగ్రేషన్, అవుట్ సోర్సింగ్‌లతోపాటు భారత దేశ ఇంధన కొనుగోలుపైన, పెట్టుబడులపైన ఆంక్షల విధింపు, చైనా, పాకిస్థాన్ దేశాలతో కలిసి భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్, అతని కేబినెట్ సహచరుల అవమానకర వ్యాఖ్యలు చేయడం ఇలా ఎన్నో సమస్యలు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా భీకర దాడులు ప్రారంభించడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు వ్యాపించి, హర్మూజ్ జలసంధి ముట్టడికి గురైంది. ఫలితంగా భారత్‌కు తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎదురైంది. ఇన్ని జరిగినా సరే అమెరికాకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం ఎలాంటి విమర్శలు చేయలేదు. ఈ పరిస్థితుల్లో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో భారత్ పర్యటనలో దైపాక్షిక సంబంధాల అజెండాతోపాటు క్వాడ్ విదేశాంగ మంత్రుల సదస్సు కలిసి వచ్చింది. అమెరికా ఏకపక్ష చర్యలతో దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాలు రూబియో పర్యటనతో మెరుగుపడతాయన్న ఆశలు కలిగించింది. భారత్ ఒక నరకం వంటిదని ఇటీవల ట్రంప్ పదేపదే చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలు అసంబద్ధమైనవని, అనుచితమైనవని, ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను ఇవి దెబ్బతీస్తాయని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. ఇవన్నీ ఏమీ కానట్టు రూబియో తన పర్యటనలో భారత్‌అమెరికా సంబంధాలు అత్యంత కీలకమైనవని, భవిష్యత్తులో ఈ ద్వైపాక్షిక సంబంధం మరింత బలపడుతుందని అభిప్రాయం వెలిబుచ్చారు. అంతేకాదు భారత్‌ను ట్రంప్ ఒక గొప్ప దేశంగా అభివర్ణిస్తుంటారని సర్ది చెప్పుకున్నారు. ఏదైతేనేం మార్కో రూబియోకు భారత్ ఎర్ర తివాసీ పరిచి ఘనస్వాగతం పలికింది. ప్రధాని నరేంద్ర మోడీ కూడా తన ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి స్వయంగా రూబియోకు స్వాగతం పలికారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్ రూబియోతో కలిసి అమెరికా దౌత్య కార్యాలయ ఆహ్వాన వేడుకలతోపాటు వారాంతపు సమావేశాల్లో ఎక్కువ సేపు గడిపారు. గ్రామీణ ప్రజల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తి ఆదివారం అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవంతోపాటు రూబియో పుట్టిన రోజు వేడుకల్లో జైశంకర్ పాల్గొన్నారు. ఆ తరువాత కోల్‌కతా లోని మిషనరీస్ ఆఫ్ ఛారిటీని అక్కడ నుంచి ఆగ్రా, జైపూర్‌లను రూబియో సందర్శించారు. ద్వైపాక్షిక చర్చల్లో విదేశాంగ మంత్రులు వాణిజ్యం, ఇంధనం, పౌర అణు సాంకేతికత, రక్షణ రంగ సహకారం, ప్రాంతీయ, భౌగోళిక రాజకీయ సంఘర్షణలతోసహా ద్వైపాక్షిక సంబంధాలపై సమగ్రస్థాయిలో చర్చించారు. కీలకమైన ఖనిజాలపై వేరుగా ఒప్పందం జరగడమే కాక, క్వాడ్, 15 దేశాల సిలికా కూటమిలో ఉభయ దేశాల భాగస్వామ్యం ప్రతిబింబించింది. అమెరికా నేతృత్వంలో ఏర్పాటైన అంతర్జాతీయ వ్యూహాత్మక సాంకేతిక కూటమే 'పాక్స్ సిలికా'. ఇందులో భారత్ సహా 15ం దేశాలు భాగస్వామ్యంగా ఉన్నాయి. కృత్రిమ మేధస్సు (ఎఐ), సెమీ కండక్టర్లు (చిప్స్), కీలక ఖనిజాల సరఫరా గొలుసులను పటిష్టం చేయడం దీని ముఖ్య ఉద్దేశం. అయితే భారత్ అత్యంత విశ్వసనీయమైన భాగస్వామిగా అమెరికా ఇదివరకు గుర్తించేది. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించకపోవడం ద్వైపాక్షిక సంబంధాల్లో ప్రధాన సమస్యగా తయారైంది. ఈ విషయంలో భారత్ ఆందోళనను గుర్తించడంలో అమెరికా విఫలమైంది. అయితే రూబియో ఈ సందర్భంగా ఫ్రాన్స్ లోని ఎవియన్ లెస్ బెయిన్స్‌లో జూన్ మధ్యలో జరగనున్న జి7 శిఖరాగ్ర సదస్సు ప్రస్తావన తీసుకొచ్చారు. సదస్సులో అమెరికా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, బ్రిటన్ తదితర ఏడు సభ్యదేశాలతోపాటు యూరోపియన్ యూనియన్ ప్రతినిధులు కూడా పాల్గొంటారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ప్రపంచ వాణిజ్య సమస్యలపై అగ్రదేశాల అధినేతలతోపాటు ప్రత్యేక ఆహ్వానితునిగా భారత దేశ ప్రధాని మోడీ కూడా పాల్గొనున్నారు. ఈ శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముఖాముఖీ భేటీ కానున్నారని మార్కొ రూబియో వెల్లడించడం ముఖ్య విశేషం. ఈమేరకు రెండు వైపులా సన్నాహాలు జరుగుతున్నాయని రూబియో ప్రకటించారు. 2025 ఫిబ్రవరిలో ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించిన తరువాత ఇప్పటివరకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోడీ ముఖాముఖిగా భేటీ కాలేదు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగిన తరువాత ఉభయ దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో ఏయే ఆర్థిక, ఇంధన, ప్రాంతీయ భద్రత రంగాలు దెబ్బతిన్నాయో ఆయా రంగాలను మెరుగుపర్చుకోవడానికి జి7 శిఖరాగ్ర సదస్సు చక్కని అవకాశం కలిగిస్తుందన్న నమ్మకం కలుగుతోంది. ఒక విధంగా చెప్పాలంటే అమెరికా భారత్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చుకోవాలన్న ప్రయత్నంలో భాగంగానే రూబియో పర్యటన జరిగింది. ఇదిలా ఉండగా ప్రధాని మోడీ అంటే తనకెంతో ఇష్టమని, తాను మోడీకి పెద్ద అభిమానినని ట్రంప్ తనకు ఫోన్ చేసి చెప్పారని భారత్ లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించడం ఆసక్తిని కలిగిస్తోంది. భారత్ తనను 100 శాతం నమ్మొచ్చని ట్రంప్ పేర్కొన్నారని గోర్ తన పోస్టులో వివరించారు.

# తెలంగాణకు చల్లని కబురు

### రెండురోజుల్లో రుతుపవనాల ఆగమనం

హైదరాబాద్,మే28 : తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వెల్లడించింది. ఈ రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా, రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విస్తరించడానికి ముందు రాబోయే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. అందువల్ల రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం వేళల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# ప్రజాపక్షం వహించిన నేత ఎన్టీఆర్

### ఎక్స్ వేదికగా పవన్ నివాళి

అమరావతి,మే28 : మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం ఓ పోస్టు పెట్టారు. 'కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుని రాజకీయ జీవితంలోకి వచ్చి- ప్రజాపక్షం వహించిన దివంగత నేత ఎన్టీరామారావు గారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా అందించిన సేవలు మరువలేనివి. ఎన్టీ రామారావు గారు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాను. రూ.2లకే కిలోబియ్యం పథకం ద్వారా పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో పని చేశారు. ఆ స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను నిర్వహిస్తోంది' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

### ప్రధాని కార్యాలయ

# పర్యవేక్షణలో నీట్ టెస్ట్

### పకడ్బందీ చర్యలకు దిగిన కేంద్రం

న్యూఢిల్లీ,మే28 : నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాంతో మే 3న జరిగిన ప్రవేశపరీక్ష రద్దు కావడంతో.. జూన్ 21 రీటెస్ట్ నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి ఎలాంటి లోపాలు తలెత్తకుండా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఈసారి రీటెస్ట్ పక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దిల్లీలోని తన నివాసంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ రీటెస్ట్ (ఔఇఇ÷-జఉ స।బి।బబి)లో ఎలాంటి అవకతవకలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తాజాగా జరిగిన సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, పీఎంఓ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పేపర్ తయారు చేయడం, ప్రింటింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, పరీక్షా కేంద్రాలకు చేర్చడం వంటి ప్రతి పక్రియను ప్రధాన మంత్రి కార్యాలయం పర్యవేక్షించనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ పరీక్షకు సంబంధించి ప్రతి అప్‌డేట్‌ను మోదీ తెలుసుకుంటున్నారని పేర్కొన్నాయి. ఈ రీటెస్ట్‌కు దేశవ్యాప్తంగా 23 లక్షల మంది హాజరుకానున్నారు.

# బొద్దింకలూ భయపెడతాయ్!

వంట ఇంటి మూలల్లో, మురికి ప్రదేశాల్లో కనిపించే బొద్దింక నేడు మీడియాకు ఎక్కింది. కేవలం ఇంట్లోని వారిని భయపెట్టే ఈ చిన్నజీవి ఇవాళ జాతీయ పార్టీని ముఖ్యంగా అధికార భారతీయ జనతా పార్టీని గడగడలాడిస్తున్నది. కాక్రోచ్ జనతా పార్టీ ఒక పది రోజుల క్రితమే 16న ప్రకటించబడింది. రెండు రోజుల్లోనే ఆ పార్టీకి 50,000 మంది ఫాలోవర్లు ఏర్పడ్డారు. చాలా అనూహ్యమైన పరిస్థితులలో తెరమీదకి వచ్చిన ఈ పార్టీకి నాలుగు ఐదు రోజుల్లోనే విపరీతమైన అభిమాన సంఘం ఏర్పడింది. దీని లక్ష్యాలు, లక్షణాలు ఏమైనా కావచ్చు కానీ వరుసగా మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకున్నామని విర్రవీగుతున్న కేంద్రంలోని బిజెపికు ముచ్చెమటలు పట్టిస్తున్నది. పర్యవసానంగా దీని వెబ్‌సైట్‌ను తొలగించడం, ఎక్స్ లాంటి సోషల్ మీడియాను నిషేధించడం లాంటి కార్యక్రమాలు చకచగా జరిగిపోయాయి. కాక్రోచ్ జనతా పార్టీ ఇంకా ఒక రాజకీయ పార్టీగా అవతరించలేదు. ఎలక్షన్ కమిషన్ వద్ద రిజిస్టర్ కాలేదు. దీనిని సీరియస్‌గా తీసుకోవాలా వద్దా అనేది మరొక చర్చ. కానీ అది మాత్రం అధికార పార్టీలో చలనం, ప్రజలలో సంచలనం కలిగించింది. మొత్తంగా ఒక గుబులు పుట్టించింది. ఒక చర్చ రేకెత్తించింది అభిజిత్ దీప్కే అనే ఒక 30 ఏళ్ల మహారాష్ట్ర యువకుడు అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నాడు. గతంలో అతడు కొంతకాలం ఆమ్‌ఆద్మీ పార్టీ కమ్యూనికేషన్స్ విభాగంలో పనిచేశాడు. కాక్రోచ్ జనతా పార్టీ స్థాపించడంలో ఆయనకు ఒక బలమైన కారణం ఉంది. భారత సర్వోన్నత న్యాయస్థానం 53వ ప్రధాన న్యాయమూర్తి మే 15వ తేదీన ఒక కేసు విషయమై దేశంలోని నిరుద్యోగ యువతను బొద్దింకలతోనూ, పరాన్నజీవులతోనూ పోల్చడం జరిగింది. యువకులు బొద్దింకల లాంటి వారని, ఏ పని లేక కొందరు మీడియా, సోషల్ మీడియాలలో చాలా చురుకుగా పాల్గొంటారని, ఆర్‌టిఐ కార్యకర్తల తయారై సమాజంలో ప్రతి ఒక్కరిపై దాడి చేస్తుంటారని ఆయన కోర్టులో వ్యాఖ్యానించడం జరిగింది. ఈ వ్యాఖ్యలు సహజంగానే అభిజిత్ దీప్కేను బాధించాయి. మరు రోజే ఆయన కాక్రోచ్ జనతా పార్టీ అని వెల్లువెత్తింది. పార్టీని ప్రకటించడంతో ప్రజలనుండి అభిమానం ట్యాగ్ లైన్‌గా బద్ధకస్థుల, నిరుద్యోగుల గొంతుకగా చెప్పుకున్నాడు. దేశంలో నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న యువతకు కొదవలేదు. వారికి ఈ పార్టీ ఒక వేదికగా తోచింది. ఇబ్బడిముబ్బడిగా మద్దతు తెలిపారు. చాశ్రీంశీ =ముం - మీడియా స్వేచ్ఛపై వేలాడే కత్తి.. రాజ్యం అభిజిత్ అంతటితో ఊరుకోలేదు. తన పార్టీకంటూ కొన్ని సిద్ధాంతాలను, భవిష్యత్తు దృష్ట్యా ఒక మేనిఫెస్టోను కూడా తయారుచేసుకుని ప్రకటించాడు. యువత యొక్క యువత కొరకు యువత చేత నడిపించబడే ఒక రాజకీయ ఫ్రంట్ అని తన పార్టీని అభివర్ణించాడు.

# సంపాదకీయం

## తమిళ రాజకీయాల్లో విజయ్ ఎత్తులు !

తమిళనాడు రాజకీయాలు రసవత్తర మలుపులు తిరుగుతున్నాయి. మద్దతుల ఇచ్చిన అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు మళ్లీ పళనిస్వామి చెంతకు చేరారు. మేమంతా మీ వెంటే అని ప్రకటించారు. ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం మనలేదని డిఎంకె నేత స్టాలిన్ ఇప్పటికే శాపనార్థాలు పెట్టారు. ఈ స్థితిలో కాంగ్రెస, లెఫ్, ముస్లిం పార్టీల మద్దతు బొటాబొటీగా ఉంది. దీంతో మరో ఐదేళ్లపాటు లాక్కురావడం అంత సులభం కాదు. ఎందుకంటే ఐదారు సీట్ల మద్దతుతో వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడం సిఎం విజయ్‌కు తలనొప్పిగా పరిణమించవచ్చు. ఈ క్రమంలో సొంతగా బలం కోసం టివికె అధినేత, సిఎం కొత్త ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ద్రవిడ పార్టీలకు చెక్ పెట్టడంతో పాటు తమిళనాట పాతుకు పోయేందుకు రాజకీయంగా ఎత్తులు వేస్తున్నట్లు పరిస్థితులు తెలియచేస్తున్నాయి. చిల్లర పార్టీలతో కలిసి నడిచేకంటే సొంతగా బలం సమకూర్చుకోవడం ఉత్తమమని ఆయన భావనలో ఉన్నారు. అందుకే ఇటీవల అన్నాడిఎంకెకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి విజయ్ పంచన చేరారు. వారు ఉప ఎన్నికల్లో టివికె పార్టీ పక్షాన గెలిస్తే సొంతబలం పెరగవచ్చు. ఇలా సొంత బలం కోసం అవసరమైన ఇతర పార్టీల్లోని ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలన్న ఎత్తుగడలో సిఎం విజయ ఉన్నట్లు సమాచారం. ఓవైపు ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో అభిమానం పెంచుకోవడంతో పాటు, పార్టీ బలాన్ని పెంచుకునేలా టివికె చీఫ్ ఎత్తుడగులు సాగుతున్నాయి. అధికారంలో ఉంది మన ప్రభుత్వమే అని డీఎంకె అధినేత ఎం.కె.స్టాలిన్ పార్టీ కార్యకర్తలతో అన్నట్లు విస్తృత ప్రచారంలో ఉంది. మరో సందర్భంలో విజయ్ ప్రభుత్వం కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని ఆయనే వెల్లడించారు. ఈ మాటల్ని అనుసరించి.. టీవీకే ప్రభుత్వాన్ని తాను నియంత్రించేస్థాయిలో ఉన్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది టీవీకేకు మింగుడు పడటంలేదు. మరోవైపు అన్నాడీఎంకే చీలికల కారణంగా మద్దతుగా నిలిచిన 25 మందిలో కొందరు మంత్రి పదవుల్ని ఆశించినట్లు ప్రచారంలో ఉంది. మంత్రివర్గ విస్తరణలో వారికెలాంటి స్థానం లేకపోవడం, కాంగ్రెస్ లో ఇద్దరికి దక్కడంతో పాటు డీఎంకే కూటమిలోని ఐయూఎంఎల్, వీసీకేకు చెరొక మంత్రిపదవి ఇవ్వడంతో అన్నాడీఎంకే చీలిక శ్రేణులు అసంతృప్తిగా ఉన్నట్లు తేలింది. డీఎంకే అధిపత్యం తగ్గించే వ్యూహంలో.. అన్నాడీఎంకే చీలిక ఎమ్మెల్యేలు తమవైపు ఉండటాన్ని లాభంగా మలచుకోవాలని టీవీకే చూస్తోంది. తమ పార్టీలోకి రావాలంటే రాజీనామాలు చేయాలనే షరతు విధించినట్లు విశ్వసనీయంగా చెబుతున్నారు. ఇందులో భాగంగానే నలుగురు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. రాజీనామాలు చేసేందుకు మరికొందరు అన్నాడీఎంకే చీలికవర్గం ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. టీవీకేకు అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో.. ఆ పార్టీకి మద్దతిచ్చే ప్రక్రియలో రెండు ప్రధాన కూటములు ఎవరి ఆట వారు ఆడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు విజయ్ కొత్త ఆట మొదలుపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి విజిల్ గుర్తుపై బరిలోకి పంపి.. వారిని గెలిపించి.. ఇతర పార్టీల మద్దతు లేని సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో జరిగిన బల ప్రదర్శనలో టీవీకే ప్రభుత్వం అనూహ్య మద్దతు కూడగట్టుకుంది. ఏకంగా 144 ఎమ్మెల్యేల బలాన్ని అందుకుంది. ఈ సంఖ్యలోనే అనేక వ్యూహాలు కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీవీకేపై ఆధిపత్యం కోసం ఇటు డీఎంకే కూటమి, అటు అన్నాడీఎంకే ఓ వర్గం అంతర్గత వ్యూహాల్ని రచించినట్లు తెలుస్తోందంటున్నారు. అంతర్గత నిర్ణయాల కారణంగా తమ కూటమిలోని వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన 8 సీట్లను టీవీకే మద్దతుగా ఇచ్చారు. మరోవైపు టీవీకేతో జట్టుకట్టిన కాంగ్రెస్‌కు 5 సీట్లు, ఏఎంఎంకే నుంచి బయటికి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా మద్దతిచ్చిన కామరాజ్ ఓటు కలిపి.. టీవీకేకు 119 సీట్ల వచ్చింది. కోర్టు ఆంక్షలతో తిరపత్తూర్ ఎమ్మెల్యే ఓటింగ్‌కు పాల్గొనలేదు, తిరుచ్చి తూర్పుస్థానం ఖాళీగా ఉండటం, స్పీకర్ ఓటు లెక్కలోకి లేకపోవడంతో టీవీకే బలం 105గా ఉంది. ఇతరుల మద్దతుతో ఓటింగ్‌కు ముందే మ్యాజిక్ ఫిగర్ దాటినట్లు అంచనాలు వచ్చాయి. ఇక అసెంబ్లీలో ఓటింగ్ జరుగుతున్న క్రమంలో అన్నాడీఎంకే చీలికవర్గం నుంచి అనూహ్యంగా మరో 25 ఓట్లు దక్కాయి. దీంతో బలం 144కు చేరింది. రెండు కూటముల నుంచి టీవీకేకు బలం అందడంతో వచ్చే 6నెలలదాకా ప్రభుత్వం కూలడానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిన్లటైంది. మద్దతు పార్టీల సంగతి అటుంచితే.. ఇప్పటికిప్పుడు టీవీకే నెమ్మదిగా బలపడుతోంది. సొంతంగా 107 స్థానాలు దగ్గరున్నాయి. 5 కాంగ్రెస్, ఒక స్వతంత్రతో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న 5 అసెంబ్లీ స్థానాల్లో గెలిస్తే.. 118 స్థానాల బలమొస్తుంది. అన్నాడీఎంకే చీలిక వర్గంలోని మరికొందరు రాజీనామాలకు సిద్ధపడి టీవీకే గుర్తుపై పోటీ చేసే అవకాశమొస్తే మ్యాజిక్ ఫిగర్ 118ని దాటి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ సాగుతోంది. తిరుచ్చి ఈస్ట్‌లో విజయ్‌కు 91,381 ఓట్లు వచ్చాయి. ఈయన డీఎంకేపై 27,416 ఓట్లతో గెలిచారు. ఇక్కడ అన్నాడీఎంకే చీలికవర్గ బలం తోడైతే అవలీలగా లక్ష ఓట్లు దాటొచ్చనేది అంచనా. రాజీనామాలు చేసిన స్థానాల్లో.. చెంగల్పట్టు జిల్లా మదురాంతకం(ఎస్సీ), తిరునెల్వేలి జిల్లా అంబాసముద్రం కలుపుకుని ఇప్పుడు తొలి 3 స్థానాల పార్టీలు టీవీకేవైపు ఉండటంతో ఇక్కడ లక్షన్నర ఓట్లకు తగ్గని బలముంది. 4 రాజీనామా స్థానాల్లో తిరిగి టీవీకే అభ్యర్థి గెలిచే అవకాశాలు సమృద్ధిగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇలా మరిన్ని స్థానాలు విజయ్‌కి తోడై అవలీలగా, ఒంటరిగా టీవీకే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, తద్వారా డీఎంకే ప్రభావాన్ని లేకుండా చేయడంతో పాటు స్వేచ్ఛగా పాలన అందించే దిశగా అడుగులు వేసే అవకాశాన్ని టీవీకే పరిశీలిస్తోంది. ఈ సమీకరణాలతో విజయ్ రాష్ట్రంలో మరింత బలపడాలని చూస్తున్నారు. అదే జరిగితే ద్రవిడ పార్టీలకు మనుగడ కష్టమే.

# పెట్రో ధరలతో సామాన్యులపై భారం



### రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి లెఫ్ట్ సిద్ధం

#### జూన్1 నుంచి 7 వరకు ప్రజాచైతన్య కార్యక్రమం

విజయవాడ,మే28 : క్రమంగా పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్, సీఎన్‌జీ ధరలు.. సామాన్యులకు భారంగా మారుతున్నాయి.. దీనితో అన్ని వస్తువులపై వీటి ప్రభావం పడుతోంది.. విజయవాడలో వామపక్ష పార్టీలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి. సామాన్య ప్రజలపై పెరుగుతున్న ఇంధన భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ పలు దశల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. లెఫ్ట్ పార్టీల ప్రెస్ మీట్‌లో మీడియాతో మాట్లాడిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు.. రోజురోజుకీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరుగుతుం డటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న అధిక పన్నుల వల్లే ఇంధన ధరలు భారీగా పెరుగుతున్నాయని విమర్శించారు. ఇంధన ధరల పెరుగుదలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూన్ 1 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వామపక్ష నేతలు వెల్లడించారు. అనంతరం జూన్ 9న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంగా పాసర్లపూడిలోని కేజీ బేసిన్ ప్రాంతాన్ని కూడా సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు రోజూ పెట్టుబడులు, కంపెనీలు, ఉద్యోగాల పేరుతో ప్రకటనలు చేస్తూ హడావిడి చేస్తున్నారని, కానీ ధరల పెరుగుదల వల్ల ఎంత మంది ఉపాధి కోల్పోయారో లెక్కలు చెప్పాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ధరలు తగ్గించకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకు పొదుపు చర్యల పేరుతో ప్రభుత్వం ప్రచారం చేస్తోందని ఆరోపించారు. పొదుపు చర్యలను ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబులే పాటించడం లేదని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేసిన వామపక్ష నేతలు, ఇప్పుడు ఎందుకు ఆ హామీలను అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శించిన టీడీపీ నేతలు, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు తగ్గించకపోవడం ఏమిటని నిలదీశారు. అంతే కాదు.. పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నులను తక్షణమే తగ్గించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. అలాగే మహానాడులోనే ఇంధన ధరల తగ్గింపుపై తీర్మానం చేయాలని కోరాయి.. కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే వనరుల్లో 50 శాతం రాష్ట్ర ప్రజల అవసరాలకు వినియోగించేలా ప్రకటన చేయాలని డిమాండ్ చేశాయి. అలాగే కమర్షియల్ గ్యాస్ ధరలను పాత ధరలకే అందించాలని ప్రభుత్వాన్ని కోరాయి. ఇంధన ధరల పెరుగుదలతో సామాన్యులు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని, వెంటనే కేంద్రం మరియు రాష్ట్రం ప్రజలకు ఊరట కలిగించే చర్యలు తీసుకోవాలని వామపక్ష పార్టీలు స్పష్టం చేశాయి.

# ఉక్రెయిన్‌తో ఎడతెగని రష్యా యుద్ధం

### భారీగా సైనిక సంపదను కోల్పోయిన రష్యా

### 5లక్షల మంది సైన్యం మరణించినట్లు వార్తలు

మాస్కో : రష్యా–ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతోన్న యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2022 నుంచి జరుగుతోన్న ఈ ఘర్షణల్లో రష్యాకు సైనిక పరంగా భారీ నష్టం వాటిల్లినట్లు కనిపిస్తోంది. ఈ పోరులో 5 లక్షల మంది మాస్కో సైనికులు ప్రాణాలు కోల్పోయారని బ్రిటన్ నిఘా వర్గాలు అంచనావేశాయి. మరోవైపు, యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి తాము 55వేలమంది సైనికులను కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ఫిబ్రవరిలో వెల్లడించారు. ఇరువైపులా ప్రాణనష్టం భారీగానే ఉన్నా.. రెండు దేశాలు వాస్తవ లెక్కలను వెల్లడించట్లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా డాన్‌బాస్ ప్రాంతంలోని ఉక్రెయిన్ స్థావరాలపై దాడుల కోసం రష్యా తన సైనికులను దశలవారీగా మోహరించింది. కొత్తగా చేరిన సైనికులు, జైళ్ల నుంచి నియమించుకున్నవారు ఈ ఘర్షణల్లో పాల్గొన్నారు. వారికి సరైన శిక్షణ లేకపోవడం.. యుద్ధరంగంలో భారీగా ప్రాణనష్టానికి దారితీస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు, అమెరికా, దాని మిత్రదేశాలు సరఫరా చేసే క్షిపణి వ్యవస్థలు, ఫిరంగి, అధునాతన డ్రోన్లను ఉక్రెయిన్ ఉపయోగిస్తోంది. కమాండ్ పోస్టులు, సైనిక సమూహాలు లక్ష్యంగా జెలెన్‌స్కీ సైన్యం దాడులు చేస్తోంది. దాంతో ఈ నష్టం మరింత పెరిగిందనే అంచనాలున్నాయి. ఈ దాడులను ఎదుర్కొనేలా రష్యా సుశిక్షితులైన సైనికులను నియమించుకోలేక పోతుందని, విధుల్లో ఉన్నవారిని కాపాడుకునేలా ఎలాంటి రక్షణకవచాలను సమీకరించలేకపోతుందని యూకే నిఘా వర్గాలు అంచనా వేశాయి. ఈ కారణాలే రష్యాను దెబ్బతీస్తున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఆర్మీలో యువతను చేర్చుకునేందుకు రష్యా ప్రభుత్వం వారికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా రక్షణశాఖతో ఒప్పందం కుదుర్చుకునే వారికి, వారి కుటుంబాలకు ఉండే రుణాల్లో 10 మిలియన్ రూబుల్స్ (సుమారు రూ.1.33కోట్లు) వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. కొత్తగా సైన్యంలో చేరాలనుకునే వారు కనీసం ఏడాది పాటు కొనసాగుతానని హామీ ఇవ్వాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన నిర్ణయంపై అధ్యక్షుడు పుతిన్ సంతకం చేసినట్లు వార్తలు వచ్చాయి.

# జడ్చర్ల వద్ద అర్ధరాత్రి రెండు బస్సుల ఢీ

### ప్రమాదంలో ఒకరు మృతి: 14మందికి గాయాలు

మహబూబ్‌నగర్,మే28 : మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సును.. బెంగళూరు వైపు వెళ్తున్న మరో ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో 14 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తిని తిరుపతి రిటైర్డ్ డీఎస్పీ సాంబశివారెడ్డి కుమారుడు అశోక్ రెడ్డిగా గుర్తించారు. అశోక్‌రెడ్డి మృతి వార్తతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ ప్రమాదానికి అధిక వేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం కారణంగా కాసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా, పోలీసులు వాహనాలను మళ్లించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇటీవల జాతీయ రహదారులపై వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా అర్ధరాత్రి సమయంలో డ్రైవర్లు అలసట, అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల ఇలాంటి ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రయాణ భద్రతపై మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్తతలు

### అమెరికా దాడులకు ప్రతీకార దాడులు

టెహ్రాన్ : పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు శాంతి ఒప్పందంపై చర్చలు కొనసాగుతుండగానే.. అమెరికా– ఇరాన్ మధ్య భీకర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. హర్మూజ్ సమీపంలో అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించింది. అగ్రరాజ్య సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టింది. హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఇది జరిగిన కాసేపటికే బందర్ అబ్బాస్ పోర్టు వద్ద కూడా పలుమార్లు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఈ దాడులను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ దురాక్రమణ చర్యగా అభివర్ణించింది. అమెరికా పదే పదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుందని ఇరాన్ ఆరోపించింది. ఇలాంటి దురాక్రమణలు కొనసాగితే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అంతేగాక, తాజా దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా బేస్‌లను తాము లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. కానీ, అది ఎక్కడి స్థావరం అనే విషయాన్ని వెల్లడించలేదు. అయితే తమ గగనతలంపైకి క్షిపణులు, డ్రోన్‌లు దూసుకొచ్చాయని కువైట్ దళాలు పేర్కొన్నాయి. వాటిని సమర్థవంతంగా అడ్డుకున్నట్లు వెల్లడించాయి.


# ఎన్టీఆర్‌ది చెరిగిపోని సంతకం

### ఎక్స్ వేదికగా చిరంజీవి నివాళి

హైదరాబాద్ : ఎన్ని తరాలు మారినా మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు ప్రభావం చరిత్రలో ఎప్పటికీ చెరిగిపోదని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా చిరంజీవి ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ఎన్ని తరాలు మారినా ఆ తారక రాముని ప్రభావం చరిత్రలో ఎప్పటికీ చెరిగిపోదు'.. తెరపై అనేక పాత్రలను సజీవంగా ఆవిష్కరించిన మహానటుడిగా.. ప్రజా జీవితంలో తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా.. అందరి హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించిన నందమూరి తారక రామారావు చిరస్మరణీయులు. ఇటీవల ఎన్టీఆర్ జాతీయ పురస్కారం నాకు లభించడం కూడా ఎంతో ప్రత్యేకమైన గౌరవంగా భావిస్తున్నాను.

# జ్ఞానంతోనే ప్రతిభ ఇనుమడిస్తుంది !

తిరుమల : వీలైనంత వరకు జ్ఞానాన్ని సముపార్జించాలి. అది మనవరకే కాకుండా నలుగురితో పంచుకోవాలి. మన జ్ఞానం అందరికీ ఉపయోగ పడాలి. అప్పుడే మన ప్రతిభ ఇనుమడిస్తుంది. ఎందుకంటే మనం సాధించాలనుకొన్న కార్యంలో సన్నిహితులు మనకు సహాయం చేస్తారు. అప్పుడు మన సాధన సులువవుతుంది. నువ్వు ఈ కార్యం సాధించగలవు అంటూ హితులు, మిత్రులు, సహచరులు ధైర్యం చెబితేనే హనుమ సముద్రం దాటి లంకకు చేరి కార్యం సాధించుకొని వచ్చి 'చూశాను సీతను' అనగలిగాడు. మనం ఏదైనా గొప్ప కార్యాన్ని తలపెట్టి పూర్తి చేయాలనుకొంటే మనకో మంచి స్నేహితుడు ఉండాలి. అతడు విమర్శకుడు, మార్గదర్శకుడైతే ఎన్నో మంచి మాటలను ఉపదేశిస్తాడు. అప్పుడు మనం అనుకొన్న సాధన సఫలమై తీరుతుంది. మనందరిలో ప్రత్యేకత ఉంది. కానీ, దాన్ని కనిపెట్టే తీరిక ఓపిక ఉంటే ఏది సాధించడంలోనైనా మనలో ప్రాజ్ఞత వికసిస్తుంది. సూర్యవంశానికి చెందిన భగీరథుడు సగరుడి వారసులకు ఉత్తమ గతులను కలగజేసేందుకు దివిజ గంగను భువికి తెచ్చే మహా ప్రయత్నం చేశాడు. ఈ సాధననే భగీరథ సాధన అన్నారు. ప్రతి మనిషీ అద్భుతంగా జీవించాలని ఆదిశంకరాచార్యులు తరచూ అనేవారట. అలా బతికితే ప్రతి రోజూ సాధనకు మనసు ఉరకలు వేస్తుంది. రాబోయే రోజులన్నీ ఆశాజ్యోతుల వుతాయి. ఆదిశంకరులు దేశాన్ని మొత్తం కాలినడకన పర్యటించి తాను తలపెట్టినట్లు నాలుగు పీఠాలను నెలకొల్పగలిగారు. పాశ్చాత్య పురాణాల్లోని నాయకులు కండబలం కలవారు. మన భారతీయ ఇతిహాసాల్లో ధీరులు నైతికంగా ధార్మికంగా బలవంతులు. కండబలం కంటే గుండెబలం మనోబలం శక్తిమంతమైనవి. ఇలాంటి సాధకులే రామాయణ మహాభారత వీర గాథలకు కారకులు.



ఆధ్యాత్మికం

# మహిళల ఆర్థిక స్వావలంబనకు సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు ఆదర్శం...

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు
- మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు
- పంట అవశేషాలను కాల్చితే చట్టప్రకారం చర్యలు





**మధిర ప్రతినిధి మే 27(ది క్రైమ్ న్యూస్):** మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం నాడు మధిర నియోజక వర్గం ఎర్రుపాలెం మండలం వెంకటాపురం గ్రామంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సీఎస్ దాన కిషోర్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, సెర్ఫ్ సీఈఓ దివ్యా దేవరాజన్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పర్యటించిన డిప్యూటీ సీఎం వెంకటాపురంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో 2 కోట్ల 84 లక్షలతో ఏర్పాటు చేసిన 1 మెగా వాట్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభించి, కోటి 30 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూలి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. గతంలో వైఎస్సార్ హయాంలో ప్రవేశపెట్టిన పావలా వడ్డీ, వడ్డీ లేని రుణాల పథకాలను తిరిగి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాలకు రూ.5 లక్షల వరకు ఉన్న వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఇందిరమ్మ క్యాంటీన్లు, ఆర్టీసీకి అద్దె బస్సులు, టర్మరిక్ యూనిట్లు వంటి పెద్ద వ్యాపారాల్లో మహిళా సంఘా లను భాగస్వామ్యం చేస్తున్నామని పేర్కొన్నారు. ఐదేళ్లలో మహిళా సంఘాలకు లక్ష కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తామని ప్రకటించగా, తొలి రెండున్నరేళ్లలోనే రూ.66 వేల కోట్ల రుణాలు పంపిణీ చేశామని తెలిపారు. మహిళా సంఘాలకు తక్కువ ధరకు భూములు కేటాయించి, సాంకేతిక సహకారం అందిస్తూ సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేపడుతున్నామని, ఉత్పత్తి అయ్యే విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినా ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. గతంలో 15 వేల మెగావాట్లుగా ఉన్న పీక్ డిమాండ్ ప్రస్తుతం 18,480 మెగావాట్లకు చేరిందన్నారు. బోనకల్ మండలంలోని అన్ని గ్రామాలకు పైలట్ ప్రాజెక్టు క్రింద సోలార్ విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రైతులు పంట అవశేషాలను కాల్చవద్దని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల అగ్ని ప్రమాదాలు, కాలుష్యం పెరుగుతాయని, భవిష్యత్తులో ఎవరైనా కాల్చితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూలి చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కావడం స్ఫూర్తిదాయకమన్నారు. మహిళల అభివృద్ధే తెలంగాణ ప్రగతికి పునాది అని పేర్కొన్నారు. మహిళలకు నాణ్యమైన ఇందిరమ్మ చీరల పంపిణీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందన్నారు. పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సీఎస్ దాన కిషోర్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేస్తోందని, సోలార్ విద్యుత్ పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. మహిళా సంఘాలను ధాన్యం కొనుగోలు, రైస్ మిల్లులు, లాజిస్టిక్ పార్కుల నిర్వహణలో భాగస్వామ్యం చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. సెర్ఫ్ సీఈఓ దివ్యా దేవరాజన్ మాట్లాడుతూలి మహిళా సంఘాలు భారీ సోలార్ ప్రాజెక్టులను నిర్వహించడం సంతోషకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రెడ్‌కో సిఎండి అనిల మాట్లాడుతూ వెంకటాపురం గ్రామంలో రెండు మహిళా సంఘాలు కలిసి ఏర్పాటు చేసిన ఈ 1మెగా వాట్ సోలార్ ప్లాంట్ ద్వారా నెలకు సుమారు రూ.4.5 లక్షల ఆదాయం మహిళా సంఘాలకు లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి మహిళా సంఘాల ద్వారా రూ.3 కోట్ల విలువైన ఈ భారీ ప్రాజెక్టు విజయవంతంగా ఏర్పాటు చేశామని తెలిపారు. సోలార్ ప్లాంట్ నిర్వహణపై మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని, ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని మరిన్ని ఉపాధి అవకాశాల సృష్టికి వినియోగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం టర్మరిక్ బాయిలర్ యూనిట్‌లను, ఎర్రుపాలెం మండలంలోని అంగన్వాడీ కేంద్రాల నిర్వాహకులకు ఇండక్షన్ స్టవ్‌లు పంపిణీ చేసి, చైతన్య మండల సమాఖ్య సభ్యులకు 10 కోట్ల 45 చెక్కును డిప్యూటీ సీఎం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.





# పెద్దపల్లి మార్కెట్ యార్డ్‌లో అన్నదాతల అరిగోస ....

- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తీవ్ర ధ్వజం



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఆరుగాలం కష్టపడి పంట పండించిన అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అడుగడుగునా అన్యాయమే జరుగుతోందని పెద్దపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్‌ను సందర్శించి, అక్కడ మొక్కజొన్న, వరి ధాన్యం కుప్పలపై నెల రోజులుగా పడిగాపులు కాస్తున్న రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటను మార్కెట్‌కు తీసుకొచ్చి నెలకు పైగా అవుతున్నా, ఇప్పటివరకు కేవలం 50 శాతం మాత్రమే తూకాలు వేశారని, మిగతా సగం మార్కెట్లోనే మూలుగుతోందని మండిపడ్డారు. అకాల వర్షానికి మొక్కజొన్నలు తడిసిపోయి వాసన వస్తున్నాయని, వరి ధాన్యం కుప్ప కింద తడిసి మొలకెత్తే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు సమయంలో యూరియా, మందు బస్తాలు ఇవ్వకుండా, పెట్టుబడి సహాయం (రైతుబంధు) అందించడంలో పూర్తిగా విఫలమైన ఈ ప్రభుత్వం, తీరా పంట చేతికొచ్చాక బార్దాన్ (సంచులు), సుతిలి కూడా రైతే కొనుక్కునే పరిస్థితి తెచ్చిందని, బస్తాలు కూడా రైతులే నింపుకోవాల్సి రావడం అత్యంత దారుణమన్నారు. చేతగాని తనంతో రోజుల తరబడి కాంటాలు ఆలస్యం చేస్తూ రైతులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు.

**మిల్లర్ల తరుగు దోపిడీపై ప్రభుత్వం చర్యలు శూన్యం:** మార్కెట్లో చిరిగిన బస్తాలు ఇచ్చి, ఒక్కో బస్తాలో 35 నుండి 39 కిలోలు మాత్రమే తూకం వేస్తూ మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై రైతులను వదిలేశారని దాసరి మనోహర్ రెడ్డి ధ్వజమెత్తారు. నిబంధనల ప్రకారం ఒక బస్తాకు 40 కిలోల 600 గ్రాములు తూకం వేయాల్సి ఉండగా, కొన్నిచోట్ల 41 కిలోల 600 గ్రాములు తూకం వేస్తూ, తరుగు పేరిట మళ్లీ కిలోకు పైగా అదనంగా గుంజుకుంటూ క్వింటాలుకు 5 నుండి 6 కిలోల వరకు రైతుకు నష్టం చేస్తున్నారని ఆరోపించారు. మిల్లర్లు తమ ట్రక్ షీట్లలో కూడా మార్పులు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నా, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. మార్కెట్ యార్డ్‌కు వచ్చిన మొక్కజొన్న, వరి ధాన్యాన్ని ఎలాంటి కాలయాపన చేయకుండా వెంటనే వేగవంతంగా కొనుగోలు చేయాలని, అకాల వర్షానికి తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం 40 కిలోల 600 గ్రాములు మాత్రమే తూకం వేసేలా చూడాలని, దోపిడీకి పాల్పడుతున్న మిల్లర్లపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే రెండు మూడు రోజుల్లో మళ్లీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున, యుద్ధప్రాతిపదికన కొనుగోళ్లు పూర్తి చేయాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజకుమార్, మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, కౌన్సిలర్ వెన్నం రవీందర్ - సుజాత, ఉప సర్పంచ్ కుమార్, బిఆర్ఎస్ నాయకులు సలేంద్ర రాములు యాదవ్,తీగల సదయ్య,ముత్యాల రాజయ్య, అంజయ్య,పెంచల శ్రీధర్, కారుపాక సంపత్, సరేష్ బాబు,స్వామి, ధర్మపురి, వైద్య శ్రీనివాస్, వేణు గోపాల్, బొడ్డుపల్లి రమేష్,పల్లె మధు, జుబేర్, కుక్క మనోజ్, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.




## బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు ఘన సన్మానం..



**జమ్మికుంట, మే 27 (ది క్రైమ్ న్యూస్):** బదిలీపై వెళ్తున్న జమ్మికుంట తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన కాలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శక పరిపాలన అందించారని పలువురు కొనియాడారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించి ప్రజల ప్రశంసలు పొందారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ గడ్డం శంకరయ్య తోపాటు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ద

## త్యాగానికి, దైవ భక్తికి ప్రతీక బక్రీద్ పండుగ

**అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలి... - ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** త్యాగానికి, దైవ భక్తికి ప్రతీక బక్రీద్ పండుగని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు ముగించుకొని బయటికి వస్తున్న ముస్లిం సోదరులకు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆలాయ్ భళాయి చేస్తూ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, త్యాగానికి, దైవ భక్తికి ప్రతీక అయిన బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని పేర్కొన్నారు. సమాజంలో ప్రేమ, సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందించే పండుగలలో బక్రీద్ ఒక ముఖ్యమైన పండుగ అని అన్నారు.అల్లా యొక్క ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని,పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మత సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజకుమార్, బి ఆర్ ఎస్ నాయకులు మోబిన్, సరేష్, నూగిళ్ల వీరేశం, మహమ్మద్ ఖాదర్, అతిక్, షరీఫ్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా బక్రీద్ పండుగ వేడుకలు...

**- ఈద్గాలు, మసీదుల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**
**- ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన రామగుండం సీపీ**






**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, కరుణ, శాంతికి ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్-ఉల్-అధా) పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారని తెలిపారు. బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఈద్గాలు, మసీదుల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ప్రార్థనల సమయంలో ఎలాంటి అంతరాయం కలగకుండా ఈద్గాల వద్ద ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు అమలు చేశామన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, బక్రీద్ పండుగ త్యాగానికి, ప్రేమకు, మానవత్వానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. ప్రజలంతా పరస్పరం మతాలను గౌరవించుకుంటూ సోదరభావంతో పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకున్నారన్నారు. పండుగ సందర్భంగా కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తరపున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈద్గాలు, మసీదులు, ప్రార్థనా స్థలాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు.

## కేశవపట్నంలో ఘనంగా పోచమ్మ బోనాలు....



**కేశవపట్నం, మే28(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలకేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక యెల్లమ్మ పట్నాలు గురువారం పోచమ్మ బోనాలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. గౌడ మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని డప్పుచప్పుల్లు, శివసత్తుల పూనకాలు, బైండ్ల పూజారుల విన్యాసాలతో ఊరిగింపు నిర్వహించారు. పోచమ్మకు నైవేద్యం సమర్పించి పిల్లాపాపలను సల్లగ చూసి, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని కోరుకుంటూ మహిళలు మొక్కులు చెల్లించుకోగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ తిరుపతి గౌడ్, స్థానిక గౌడ సంఘం అధ్యక్షుడు గుట్టం శ్రీనివాస్ గౌడ్, సంఘ సభ్యులు, నాయకులు, ప్రజలు, తదితరులు బోనాల వేడుకలో పాల్గొన్నారు.

# కాళేశ్వర పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక కాంతులతో కలకలలాడుతోంది





**భూపాలపల్లి జిల్లా మే 28, (ది క్రైమ్ న్యూస్):** భూపాలపల్లి జిల్లా అంతర్వాహిని సరస్వతి పుష్కరాలతో కాళేశ్వరం సరికొత్త కాంతులీనుతోంది. కనీవిని ఎరగని స్థాయిలో భక్త జనం త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. శతాబ్దాలుగా సరస్వతి నదికి పుష్కరాలు జరుపుకునే ఆనవాయితీ కొనసాగుతున్నా అధికారికంగా మాత్రం ఇదే తొలిసారి కావడం విశేషం. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ సరస్వతి అంత్య పుష్కరాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఘనంగా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసింది. ఉత్తరాదిన ఉన్న ప్రయాగరాజ్ వద్ద మాత్రమే పుష్కరాలు నిర్వహించుకునే సాంప్రదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది కాళేశ్వరంలో మొదలుపెట్టింది. దీంతో దేశంలో రెండో చోట సరస్వతి నది పుష్కరాలు నిర్వహించుకునే సాంప్రదాయానికి కాళేశ్వరం త్రివేణి సంగమంలో శ్రీకారం చుట్టారు. కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాల్లో పవిత్ర పుణ్య స్నానాలు చేసేందుకు దేశం నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్నారు. పుష్కర స్నానాలకు రోజు రోజుకు భక్తుల సంఖ్య రెట్టింపు అవుతోంది. దీంతో కాళేశ్వరం త్రివేణి సంగమ తీరం అంతా భక్తులతో కిక్కిరిసిపోతోంది. వేకువ జాము నుండి మొదలు రాత్రి వరకూ నదీ తీరం సరికొత్త శోభను సంతరించుకుంది. ఓ వైపున కుటుంబ సభ్యులతో కలిసి పుణ్య స్నానాలు, మరో వైపున త్రివేణి సంగమానికి చీరె, సారె సమర్పించడం, నీటి పక్కన సైకత లింగాలకు పూజలు, వేద పండితుల మంత్రోచ్ఛారణలతో కాళేశ్వరం అంతా ఆధ్యాత్మికత శోభ ఉట్టిపడుతోంది. నది తీరంలో పూర్వీకులను స్మరించుకుంటూ పితృ తర్పణాలు చేసేందుకు భక్తులు మొగ్గు చూపుతున్నారు. సాధారణంగా తమ కుంటుంబ సభ్యులు చనిపోయిన రోజున అమశ్రాద్ధం నిర్వహించే తంతు కొనసాగిస్తుంటారు, కానీ పుష్కర నది తీరంలో తీర్థవిధి నిర్వహించు కునేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటుంది భారతీయ సాంప్రాదాయం. ఏటా తమ కుటుంబ సభ్యులకు తిథి కార్యం చేసినప్పుడు మూడు తరాలను తమ గోత్రీకులతో పాటు, చనిపోయిన బంధువులు, స్నేహితులను కూడా స్మరిస్తూ వారి పేరిట పిండ ప్రధానం చేయడం అత్యంత శ్రేయస్కరంగా భావిస్తుంటారు. ఇలాంటి ప్రతి అంశానికి ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి, సాంప్రాదాయలను పాటించేందుకు త్రివేణి సంగమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తుతున్నారు. మే 21వ తేదీన ప్రారంభమైన సరస్వతి మత్య పుష్కరాలు జూన్ 1వ తేదీతో సరస్వతి అంత్య పుష్కరాల 12 రోజుల కార్యక్రమం ముగియ నున్నందున 8వ రోజున కాళేశ్వరానికి భక్తుల సంఖ్య మరింత ఎక్కువగా పెరిగింది. ఇకపోతే సరస్వతి పుష్కరాలకు కాళేశ్వరంలో అత్యంత హైలెట్ గా నిలుస్తోంది త్రివేణి సంగమంలో నిర్వహించే సరస్వతి నవరత్న మాలా హారతి హారతి కార్యక్రమం నిర్వహించేందుకు కాశీ నుండి పండితులను రప్పించారు. ప్రతి రోజు రాత్రి త్రివేణి సంగమ తీరాన విద్యుత్తు వెలుగుల మధ్య నిర్వహిస్తున్న హారతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రతి రోజు జరిగే సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. ఈ హారతి కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించలేని భక్తులు ఇంటి నుండే టీవీలు ద్వారా, సెల్ ఫోన్స్ ద్వారా ప్రత్యక్షంగా తిలకించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రతి రోజు ప్రముఖులతో పాటు సాధారణ భక్తులు కూడా హారతిని వీక్షించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజు రాత్రి 45 నిమిషాలకు పైగా నిర్వహించే హారతి కార్యక్రమాన్ని వీక్షించి హారతి అనంతరం స్వస్థలాలకు తిరుగు ప్రయాణం అవుతున్నారంటే హారతి కార్యక్రమానికి ఎంతో ఆదరణ లభిస్తోంది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషముగా ఆకట్టుకుంటున్నాయి. యముడు, శివుడు ప్రతి రోజు కాళేశ్వరం త్రివేణి సంగమంలో నిర్వహించే హారతి కార్యక్రమాన్ని గురువారం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సన్నిధిలో కాశీ పండితులు కర్పూర హారతి కార్యక్రమం నిర్వహించారు. గర్భాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంతో కాళేశ్వరం ఆలయ ప్రాంగణమంతా హర హర మహాదేవ శంభో శంకర అంటూ స్వామి స్మరణ నినాదాలతో మారు మోగింది. స్వామి దర్శనానికి క్యూ లైన్లలో ఉన్న భక్తులు వీక్షించే అవకాశం కల్పించడంతో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో వీక్షించి మంత్రముగ్ధులయ్యారు.

# రాష్ట్రస్థాయిలో మోడల్ మధిర నియోజకవర్గంగా తీర్చిదిద్దటమే లక్ష్యం

- మారుమూలన గ్రామాలకు అనుసంధానికి ప్రాధాన్యత ఇస్తున్న డిప్యూటీ సీఎం
- ప్రతి గ్రామానికి అత్యంత మౌలిక సదుపాయాలు
- కోట్లాది రూపాయలు బీటీ రోడ్ల శంకుస్థాపన







**మధిర (ది క్రైమ్ న్యూస్) మే 27:** మధిర నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభివృద్ధి పనుల పరంపరను కొనసాగిస్తున్నారు. గురువారం నాడు ఎర్రుపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రహదారులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఆలయ పునర్నిర్మాణ పనులకు వరుస శంకుస్థాపనలు చేశారు. సుమారు 30 కోట్ల రూపాయలకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పనులతో మండల రూపురేఖలు మారనున్నాయి. ప్రధాన రహదారులతో పాటు మారుమూల గ్రామాల అనుసంధానానికి ప్రాధాన్యతనిస్తూ డిప్యూటీ సీఎం పలు బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. తక్కెళ్లపాడు - ఎర్రుపాలెం: మధిర మీదుగా రూ. 4.50 కోట్లతో బీటీ రోడ్డు పనులు. ఇనగాలి నుంచి సైదిల్లిపురం వరకు రూ. 6.75 కోట్లు, ఇనగాలి నుంచి సిద్దినేనిగూడెం వరకు రూ. 3.75 కోట్లతో రహదారుల నిర్మాణం. ములుగుమాడు రోడ్లు ములుగుమాడు నుంచి నాగవరప్పాడు వరకు (రూ. 3.75 కోట్లు), ములుగుమాడు ను చి సైదుల్లిపురం వరకు (రూ. 3.75 కోట్లు) బీటీ రహదారుల నిర్మాణం.గోసవీడు (రామన్నపాలెం): రామకృష్ణాపురం వరకు (రూ. 2.80 కోట్లు), గోసవీడు (రామన్నపాలెం) నుంచి కట్లేరు నది వరకు (రూ. 2 కోట్లు) బీటీ రోడ్లకు శంకుస్థాపన ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతులు: మండలంలోని పలు గ్రామాలలోని ఎస్సీ కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్ల కోసం ఉప ముఖ్యమంత్రి భారీగా నిధులు కేటాయించారు: తక్కెళ్లపాడు: రూ. 69 లక్షలు. ములుగుమాడు: రూ. 63 లక్షలు. గోసవీడు: రూ. 35 లక్షలు. ఇనగాలి: రూ. 31 లక్షలు. వెలుగుల బాటలో సబ్‌స్టేషన్లు: మండలంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు రెండు భారీ సబ్‌స్టేషన్లకు భట్టి విక్రమార్క పునాది వేశారు: పెద్దగోపవరం: రూ. 9.45 కోట్ల అంచనాతో 132/33 కేవీ సబ్‌స్టేషన్. జమలాపురం: రూ. 1.92 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్. ఈ సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో స్థానిక రైతులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆధ్యాత్మికం.. అభివృద్ధి: ములుగుమాడు గ్రామంలోని శ్రీ రామాలయ ప్రాంగణంలో రూ. 90 లక్షల అంచనాలతో చేపట్టనున్న భక్తాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. నిధుల కొరత లేకుండా పనులు వేగంగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, డిసిసి వైస్ ప్రెసిడెంట్ వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి నరసింహారావు, మధిర మండలం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, తక్కెళ్ళపాడు సర్పంచ్ ముక్కెర రామకృష్ణారెడ్డి పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బిజేపి శిక్షణా తరగతులను విజయవంతం చేయాలి: గంగాడి కృష్ణా రెడ్డి



**తిమ్మాపూర్, మే28 (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 30,31న నిర్వహించే బిజేపి శ్రేణుల శిక్షణా తరగతులకై సన్నాహక సమావేశాన్ని నాయకులు గురువారం ఏర్పాటు చేశారు.బిజేపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ....పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ సిద్ధాంతాలపై అవగాహన కల్పించి పార్టీ సంస్థా గత నిర్మాణానికై కార్యకర్తలకు శిక్షణా తరగతులను దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.తరగతుల ప్రారంభోత్సవానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ముగింపు కు కేంద్ర మంత్రి బండి సంజయ్ లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని కావున జిల్లాలోని పార్టీ శ్రేణులు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.నాయకులు మాడ వెంకట్ రెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, గుజ్జ శ్రీనివాస్, కళ్యెం వాసుదేవ రెడ్డి, ఇనకొండ నాగేశ్వర్ రెడ్డి,చింతం శ్రీనివాస్ ,సుగుర్తి జగదీశ్వర చారి,కనుమల్ల గణపతి, దండు కొమురయ్య,రంగు భాస్కరాచారి,మహిళా నాయకులు గుర్రాల నిర్మలారెడ్డి, చొప్పరి జయ శ్రీ , ఆవుల కీర్తి, చింతం వరలక్ష్మి నాయకులు అధిక సంఖ్యలో సమావేశంలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే



**బెజ్జంకి, మే28(ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారంలోని ఐకేపీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గురువారం సందర్శించారు. అనంతరం రసమయి మాట్లాడుతూ.... కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వడ్లు పేరుకుపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందుతూ రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా తరలించాలని ఎమ్మార్వోకు చరవాణి ద్వారా సూచించి వర్షాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ఐకేపీ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.పార్టీ మండలాధ్యక్షుడు పాకాల మైపాల్ రెడ్డి, సర్పంచ్ భీమయ్య, నాయకులు అంజయ్య, లింగారెడ్డి, శేఖర్ బాబు, బోడబట్ల తిరుపతి, నరేష్, బీరయ్య,బాబు, బోడబట్ల తదితరులు రసమయి వెంట సందర్శనలో పాల్గొన్నారు.

# మానకొండూర్లో ఘనంగా బక్రీద్ వేడుకలు పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి



**మానకొండూర్, మే28(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని దర్గాలో గురువారం బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు.ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ... అన్ని మతాల పండుగలు దేశ సంస్కృతిలో ఐక్యతకు ప్రతిబింబంకాగా అందరూ పరస్పర గౌరవ భావనతో మెలగాలని సూచించారు. విద్య, ఉపాధి రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేలా ముస్లీం యువత భవిష్యత్తు కోసం కృషి చేయాలని సూచిస్తూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారం, ఐక్యతతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.బక్రీద్ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షిస్తూ ముస్లీం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.డిసిసి ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, మార్కెట్ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి,పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి,మండల నాయకులు ఇర్ఫాన్, మడుపు ప్రేమ్ కుమార్,బుర్ర శ్రీధర్ గౌడ్, కనకం అశోక్, సహదేవ్ ముస్లీం పెద్దలు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో బక్రీద్ వెడుకల్లో పాల్గొన్నారు.

# ఇల్లంతకుంట మార్కెట్ యార్డును సందర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**ఇల్లంతకుంట, మే28(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని మార్కెట్ యార్డును ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం సందర్శించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, సన్‌ఫ్లవర్ సాగు పురోగతిపై రైతులతో చర్చించి ధాన్యం నిల్వలు,తూకం, కొనుగోలు కేంద్రాల నిర్వహణను పరిశీలించి నాణ్యత, కొనుగోలు విధానంపై ఆరా తీశారు. ధాన్యం విక్రయంలో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.రైతులు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని, పంటలకు గిట్టుబాటు ధర అందేలా చూస్తూ రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నాయకులు ఐరెడ్డి చైతన్య మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య, ఉట్కూరి రమణ రెడ్డి, మార్కెట్ యార్డు ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, రైతులు ఎమ్మెల్యే వెంట సందర్శనలో పాల్గొన్నారు.

# శ్రీ ఆంజనేయ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా జాప దేవేందర్ రెడ్డి



**తిమ్మాపూర్, మే28(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరులో గల శ్రీ ఆంజనేయ పురుషుల పొదుపు సహకార సంఘం కార్యాలయంలో సంఘ15వ వార్షిక మహాసభను చౌదరి పరిశరాములు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పాలకవర్గంలో ఖాళీగా ఉన్న నాలుగు స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా జాప దేవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అగునూరి నరేష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.సమితి అధ్యక్షుడు మాదన వీరయ్య, గుంటి వెంకటేశ్వర్లు, ఒడ్నాల నారాయణ, కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎల్లాల ఏకానందం, నాగపురి శ్రీనివాస్, పైడిపల్లి మల్లేశం, ఆకుల తిరుమలరావు, చింతం శ్రీనివాస్, కొలిపాక సారయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు చౌదరి దేవేంద్ర, సంఘ పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

# బక్రీద్ మత సామరస్యానికి ప్రతీక ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఈద్గా వద్ద జరిగిన సామూహిక ప్రార్థనల్లో పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ బక్రీద్ కేవలం పండుగ మాత్రమే కాదని, దైవ భక్తి, నిస్వార్థ త్యాగానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పర్వదినమని అన్నారు.ప్రవక్త ఇబ్రహీం అల్లాపై చూపిన అచంచల విశ్వాసాన్ని స్మరించుకుంటూ ముస్లింలు ఈ పండుగను జరుపుకుంటారని పేర్కొన్నారు. మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, సమస్త మానవాళికి శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరులు కుటుంబ సభ్యులతో ఆనందంగా, ప్రశాంత వాతావరణంలో బక్రీద్ వేడుకలు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకూ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తాం

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- వర్షాలకు తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతోనే కొనుగోలు...
- ఇసుక రవాణా వాహనాలను ధాన్యం కొనుగోలుకు వినియోగించాలి
- డిఫాల్ట్ రైస్ మిల్లులు బకాయిలు చెల్లిస్తే ధాన్యం కేటాయింపు
- మే నెలాఖరులోగా యాసంగి కొనుగోళ్లు పూర్తి చేయాలి
- ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన మంత్రి ఉత్తమ్







**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు.గురువారం పెద్దపల్లి ఐడిఓసీలో నిర్వహించిన యాసంగి ధాన్యం కొనుగోళ్ల సమీక్ష సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు గత ప్రభుత్వంతో పోలిస్తే 25 నుంచి 30 శాతం అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, 8 లక్షల మంది రైతులకు రూ.11 వేల కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. 15 నుంచి 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ఎలాంటి కోతలు లేకుండా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు చేసి బాయిలర్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు. మిల్లర్లకు ఏవైనా నష్టాలు వచ్చినా ప్రభుత్వం భరిస్తుందని, రైతులకు మాత్రం నష్టం జరగనివ్వమన్నారు. రైతుల చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. గతంలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులు బకాయిలు, వడ్డీలు చెల్లిస్తే తిరిగి ధాన్యం కేటాయింపులు ఇస్తామని తెలిపారు. రాబోయే 4 నుంచి 5 రోజుల పాటు ఇసుక రవాణా నిలిపివేసి వాహనాలను పూర్తిగా ధాన్యం రవాణాకు వినియోగించాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సుమారు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండగా, ఎఫ్‌సీఐ కేవలం 51 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితమైందన్నారు. ఎఫ్‌సీఐ కేటాయింపులకు మించి అదనంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు.డిసెంబర్ 2023 తర్వాత కనీస మద్దతు ధర విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తూ రైతులకు ఇప్పటివరకు అదనంగా రూ.16,479 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాల కారణంగా కేవలం 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే తడిసిందని, ఆ ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. **ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు:** ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. అవసరమైతే అదనపు గోదాములు అద్దెకు తీసుకుంటామని చెప్పారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదు సార్లు ధాన్యం కొనుగోళ్లు జరిగినప్పటికీ ఎక్కడా ఒక్క కిలో ధాన్యానికి కూడా తరుగు పేరుతో కోత విధించలేదన్నారు.జిల్లాలో ఎక్కడైనా రైతుల నుంచి ఒక్క కేజీ ధాన్యం తరుగు తీసినట్లు తెలిసినా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా మిల్లర్ల చేత రైతులకు పరిహారం ఇప్పిస్తామని హెచ్చరించారు. **ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు:** ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున ధాన్యం పెద్దపల్లికి వస్తోందని, అందుకు అనుగుణంగా రైస్ కేటాయింపులు పెంచాలని కోరారు. రైతులను ఇబ్బంది పెట్టే మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. **పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష:** జిల్లాలో యాసంగిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు రూ.788 కోట్ల విలువైన 3.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. జూన్ 5 నాటికి 100 శాతం కొనుగోళ్లు పూర్తి చేస్తామని వెల్లడించారు. ఆన్‌లైన్ ఎంట్రీలు, ట్రక్ షీట్ జనరేషన్, రైతుల చెల్లింపుల్లో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. జిల్లాలో 6.9 లక్షల మెట్రిక్ టన్నుల మిల్లింగ్ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 5.7 లక్షల మెట్రిక్ టన్నులు వినియోగంలో ఉన్నాయని, ఇంకా 1.2 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం అందుబాటులో ఉందన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లు కూడా సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు 22 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసి అవసరమైన నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. **భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ :** యాసంగి సీజన్‌లో లక్షా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 185 కోనుగోలు కేంద్రాల ద్వారా 65 వేలు మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భూపాలపల్లి జిల్లాకు సంబంధించి పెద్ద పల్లిలో 20 వేల వరంగల్ లో 20 వేల మెట్రిక్ టన్నుల, హన్మకొండ లో 10 వేల మెట్రిక్ టన్నులు మిల్లింగ్ కొరకు పౌరసరఫరాల శాఖ అలాట్మెంట్ చేసిందని తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో హర్వెస్టింగ్ కొన్ని ప్రాంతాలలో ఆలస్యంగా జరుగుతుందని, చాలా మండలాలో ఇంకా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావాల్సి ఉందని అన్నారు. మంత్రి ఆదేశాల మేరకు 100 మట్టి, ఇసుక రవాణా వాహనాలను కూడా ధాన్యం కొనుగోళ్ల కోసం వినియోగిస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో స్టోరేజీ ప్లేస్ తక్కువగా ఉన్నందున ఇతర జిల్లాల మిల్లులకు కూడా ట్యాగ్ చేయాలని కోరారు. అంతకుముందు పెద్ద కాల్వల ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి గంగయ్య సురేష్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్ జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని కాలిందిని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి సంబంధిత అధికారులు రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# రజకుల ఆత్మ గౌరవంపై ఎమ్మెల్యే పేరుతో దాడి

- స్వార్థ కుల రాజకీయ ప్రయత్నాలు మానుకోవాలి
- మన రజక సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి రమేష్




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లా కేంద్రంలో రజకుల భూమి వద్ద ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును కీర్తిస్తూ విజ్జన్ననగర్ బోర్డును ఏర్పాటు చేయడం యావత్ రజక సమాజాన్ని అవమానించడమేనని మన రజక సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి రమేష్ అన్నారు. తెలంగాణ పోరాట యోధురాలు, వీర వనిత చిట్యాల ఐలమ్మ పేరు పెట్టాల్సింది పోయి, రాజకీయ నాయకుల పేర్లతో బోర్డులు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రజకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, కొందరు చోటమోటా నేతలు తమ స్వలాభాల కోసం రజక కులాన్ని మంటగలిపే విధంగా దృశ్చర్యాలకు పాల్పడుతున్నారని రమేష్ మండిపడ్డారు. ఎమ్మెల్యే మెప్పుకోసం కాంగ్రెస్ ముసుగులో ఉన్న రజక సంఘం నాయకుడు, తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం రజక జాతిని వాడుకోవడం సిగ్గుచేటని బొడ్డుపల్లి రమేష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే భజన చేయాలనుకుంటే ఇతర మార్గాలను ఎన్నుకోవచ్చునని, కానీ రజక జాతి పేరును వాడుకునే హక్కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో రజకులకు 100ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, దోబీ ఘాట్ నిర్మిస్తామని గొప్పలు చెప్పిన ఎమ్మెల్యే, అధికారంలోకి వచ్చాక రజకులను పట్టించుకున్న దాఖలాలు లేవని రమేష్ ఆరోపించారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, ఇప్పుడు రజకుల భూమిపై బోర్డులు వేస్తూ రాజకీయ డ్రామాలు చేయడం మానుకోవాలని ఆగ్రహించారు. పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహరరెడ్డి రజక సంఘం నిర్వహించే బోనాల జాతరలకు వెండి కిరీటాలు, ఆభరణాలు సమర్పించడం ద్వారా ఆయన సంఘం పట్ల తన భక్తిని, గౌరవాన్ని చాటుకున్నాని, పేద రజకులకు పుస్తె-మట్టెలు అందించడం, బియ్యం, రవాణా సౌకర్యాలు కల్పించడం వంటి సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు.తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మపై గౌరవంతో, ఆమె విగ్రహ ఏర్పాటు చేశారని, నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు కూడా ఆయన సుముఖంగా ఉన్నట్లు రమేష్ వివరించారు. రజక సమాజాన్ని తక్కువ అంచనా వేసి, కబళించాలని చూస్తే ఊరుకునేది లేదని, ఎమ్మెల్యే పేరుతో ఉన్న అనధికారిక బోర్డులను వెంటనే తొలగించి, వీర వనిత చిట్యాల ఐలమ్మ పేరుతో నామకరణం చేయాలని రమేష్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, రజక సంఘం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్త ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రకటనలో హెచ్చరించారు.

# అలుగునూరును ధూళి రహిత డివిజన్‌గా మారుస్తా: కార్పోరేటర్ కాల్వ మల్లేశం



**తిమ్మాపూర్, మే28(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరులో స్థానిక కార్పోరేటర్ కాల్వ మల్లేశం కోరిక మేరకు డివిజనుకు రోడ్లను శుభ్రపరిచే వాహనాన్ని నగర మున్సిపల్ కమిషనర్ ఏర్పాటు చేయగా స్థానిక నాయకులతో కలిసి కాల్వ మల్లేశం వాహనాన్ని గురువారం ప్రారంభించారు.డివిజన్ పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యంపై దృష్టిపెట్టి అలుగునూరును ధూళి రహిత డివిజన్ గా మార్చే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని కాల్వ మల్లేశం తెలిపారు. పోరండ్ల సింగిల్ విండో చైర్మన్ సింగిరెడ్డి స్వామి రెడ్డి,బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సల్ల మహేందర్, పార్టీ యూత్ అధ్యకుడు దీపక్, సీనియర్ నాయకులు దాసం కమలాకర్, శిల్లా పరశు రాం,తొర్తి ప్రశాంత్, ముత్తమల్ల నిఖిల్, లంక రవి, దాసం జితేందర్, దాసం సుధాకర్, తిరుపతి మున్సిపల్ సిబ్బంది తదితరులు వాహన ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగ శాంతి, సోదరభావానికి నిదర్శనం: ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బక్రీద్ పండుగ శాంతి, సోదరభావానికి నిదర్శనమని ఆరెకపూడి గాంధీ అన్నారు. గురువారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని హఫీజ్‌పేట్ డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకుడు షేక్ జమీర్ లీమ్రా నివాసంలో నిర్వహించిన బక్రీద్ వేడుకల్లో పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ప్రవక్త ఇబ్రహీం అల్లాపై చూపిన అచంచల విశ్వాసాన్ని స్మరించుకుంటూ ముస్లింలు ఈ పండుగను జరుపుకుంటారని పేర్కొన్నారు. మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, సమస్త మానవాళికి శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరులు కుటుంబ సభ్యులతో ఆనందంగా, ప్రశాంత వాతావరణంలో బక్రీద్ వేడుకలు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఉరిటీ వెంకట్ రావు, వెంకటేష్ గౌడ్, మల్లేష్ గౌడ్, ముస్లిం మత పెద్దలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఆశయాలే ప్రజాసేవకు స్ఫూర్తి : మల్లంపాటి రాహుల్





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను గురువారం మదీనాగూడ దీప్తిశ్రీనగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. మల్లంపాటి రాహుల్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లంపాటి రాహుల్ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు జాతి గర్వకారణమని, ప్రజా సేవకు కొత్త దారులు చూపించిన మహానేతగా చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. యువత ఎన్టీఆర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ప్రజల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేతగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. తదనంతరం రాహుల్ మిత్ర మండలి ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, ప్రజలు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యుగపురుషుడు ఎన్టీఆర్ తెలుగుజాతి గర్వకారణం: ఉప్పలపాటి శ్రీకాంత్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** యుగపురుషుడు ఎన్టీఆర్ తెలుగుజాతి గర్వకారణమని తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. గురువారం తెలుగుజాతి గర్వకారణం, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా. నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని జయప్రకాష్ నారాయణ్ నగర్ కాలనీలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ స్థానికులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత అని అన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే భావనతో ప్రజా సంక్షేమానికి కొత్త అర్థం చెప్పిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. రాజకీయాలకు కొత్త నిర్వచనం ఇచ్చి కోట్లాది ప్రజల జీవితాల్లో వెలుగు నింపిన మహానుభావుడిగా ఆయన నిలిచిపోయారని పేర్కొన్నారు. తెలుగువాడి కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహోన్నత వ్యక్తిత్వం ఎన్టీఆర్ సొంతమని, ఆయన ఎన్నో తరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు, కాట్రగడ్డ సత్యనారాయణ, మోహన్ రావు, వెంకటేశ్వరరావు, బలరాం, బసవేశ్వరావు, శ్రీనివాస్, రాము, కిరణ్, శివ, బాలు చౌదరి, ప్రసన్న రెడ్డి, శ్రీనివాసరావు, జంగం మల్లేష్, నందమూరి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# నెలాఖరులోగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



**నల్గొండ, ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ పట్టణంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక ఎమ్మెల్యే తో కలిసి శ్రీనివాస్ నగర్ గుమస్తాల కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించారు. జూన్ 2 నాటికి లబ్ధిదారులకు ఇండ్లు పంపిణీ చేయనున్న నేపథ్యంలో సీసీ రోడ్లు, వాటర్ ట్యాంకులు, తాగునీటి ట్యాపులు, విద్యుత్ సౌకర్యాలు, కిటికీల గ్లాసులు, బాత్రూములు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్ట్రీట్ లైట్లు తదితర అన్ని పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను కోరారు. అనంతరం మిర్యాలగూడ ఆర్‌డీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీలోగా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. పార్కులు, వాటర్ ప్లాంట్లు, గదుల శుభ్రత, సానిటేషన్, మరుగుదొడ్లు, మొక్కల నాటడం, మిషన్ భగీరథ నీటి సరఫరా, ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీలు, పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి నీటి ట్యాపులు, ఎలక్ట్రికల్ లైన్లు, పంప్ హౌస్‌లు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అలాగే గుంతల రోడ్ల మరమ్మతులు మూడు రోజుల్లో పూర్తి చేయాలని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి లైన్లు పూర్తిచేయాలని, తాగునీటి ట్యాంకులను పూర్తిగా శుభ్రం చేయించాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కరెంట్, ఫ్యాన్లు, బోర్డుల పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో రమణారెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, హౌసింగ్ డీఈ శ్రీనివాస్, పంచాయతీ డీఈ వెంకటేశ్వర్లు, ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పండిత్ దీన్ దయాళ్ ప్రశిక్షణా మహా అభియాన్

## జిల్లా బిజెపి శ్రేణుల శిక్షణ తరగతులు

● శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, ముగింపుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ రాక శిక్షణా తరగతులను విజయవంతం చేయాలి ● బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**కరీంనగర్ టౌన్, మే28(ది క్రైమ్ న్యూస్):** పండిత్ దీన్ దయాళ్ ప్రశిక్షణా మహా అభియాన్ కరీంనగర్ జిల్లా బిజెపి శ్రేణుల శిక్షణ తరగతులు ఈనెల 30, 31 న నిర్వహించనున్నారు. తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల వేదికగా రెండు రోజులపాటు శిక్షణ తరగతులను ఘనంగా నిర్వహించడానికి , నిర్వహణ నిమిత్తం వివిధ విభాగాలకు సంబంధించి కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు గురువారం రోజున శిక్షణ తరగతుల వేదిక ప్రాంగణం వద్ద బిజెపి జిల్లా అధ్యక్షుడి గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య నేతలతో, శిక్షణా తరగతుల కు సంబంధించి వివిధ విభాగాల బాధ్యులతో సన్నాక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ . భారతీయ జనతా పార్టీ సంస్థా గత నిర్మాణాన్ని బలోపేతం చేయడానికి, పార్టీ శ్రేణులకు నాయకులకు కార్యకర్తలకు సిద్ధాంతపరమైన అవగాహన కల్పించేందుకు పండిత్ దీన్ దయాళ్ ప్రశిక్షణా మహా అభియాన్(శిక్షణ కార్యక్రమం) దేశవ్యాప్తంగా జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన సమగ్ర మానవతావాదం, అంత్యోదయ (చిట్ట చివరి వ్యక్తికి సంక్షేమం ) సిద్ధాంతాలపై అవగాహన కల్పించడం, పార్టీ కార్యకర్తలకు బూత్ నిర్వహణ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం, సోషల్ మీడియా, సంస్థాగత బాధ్యతలపై శిక్షణ అందించడంతోపాటు కార్యకర్తల్లో క్రమశిక్షణ దేశభక్తి సేవా భావాన్ని పెంపొందించే దిశలో, పార్టీ విస్తరణ కోసం కరీంనగర్ జిల్లాలో ఈనెల 30,31 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, ముగింపు ( సమారోప్) కు కేంద్ర మంత్రి బండి సంజయ్ లు ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి జిల్లాలోని పార్టీ అపేక్షితులు తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని గంగాడి కృష్ణారెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రశిక్షణ కన్వీనర్ మాడ వెంకట్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, సంచలన సమితి ప్రముఖ్ గుజ్జ శ్రీనివాస్, కార్యక్రమ ప్రముఖ్ కళ్ళెం వాసుదేవ రెడ్డి వ్యవస్థ ప్రముఖ్ ఇనకొండ నాగేశ్వర్ రెడ్డి, సహ ప్రముక్ చింతం శ్రీనివాస్ వివిధ విభాగాలకు సంబంధించిన ప్రముక్ లు, ప్రబంధకులు బోంతల కళ్యాణ్ చంద్ర , సుగుర్తి జగదీశ్వర చారి, కనుమల్ల గణపతి, దండు కొమురయ్య, రంగు భాస్కరాచారి, పుష్పాల రఘు, అడిచేర్ల రాజు, బండ రమణ రెడ్డి , గుంజేటి శివకుమార్ , పైడిపల్లి శ్రీనివాస్ , రామిడి మహేందర్ రెడ్డి ,బుట్ల శ్రీనివాస్, మావురపు సంపత్, వేల్పుల ఓదెలు, గడ్డం అరుణ్ గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, కన్నం సాయి, అలివేలు సమ్మిరెడ్డి , దాసరి రమణారెడ్డి, కనుగంటి మధుకర్ రెడ్డి దూలం కిరణ్ , గుర్రాల వెంకటరెడ్డి, బోనాల మోహన్ , తనకు సాయి, అన్నాజీ వినీత్ కుమార్ , ప్రఫుల్ , జి వినోద్ , కడార్ల విమల్ కుమార్ , జయంత్ , కాల్వ శ్రీనివాస్, వి. ప్రవీణ్, రాపాక ప్రవీణ్ , కొట్టాల శ్రీనివాస్, జక్కోజు అనిల్ కుమార్ , బూడిద అశోక్ , రమేష్, అందేశేఖర్, దుర్శెట్టి అజయ్, దురిశెట్టి రమేష్ , ఎర్రోజు లక్ష్మణ్ , సంఘ నరేష్, చల్లూరి శ్రీధర్ , బుర్ర శ్రీనివాస్ , జాడి రాజు , ప్రదీప్ రెడ్డి, రవీందర్ యాదవ్, ఆకుల అనిల్, జంగ సునీల్ రెడ్డి , పి .కృష్ణ కిషోర్, కొయ్యడ శ్రీనివాస్ , గొల్లపల్లి మల్లేశం, పబ్బ తిరుపతి, కసాడి సంపత్ , సుగుణాకర్, సంతోష్ లతోపాటు మహిళా విభాగానికి సంబంధించి గుర్రాల నిర్మలారెడ్డి, చొప్పరి జయ శ్రీ , ఆవుల కీర్తి, చింతం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

● మసీదులు ఈద్గాల అభివృద్ధికి రూ.7 కోట్లు కేటాయించాం ● ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి అడ్లూరి





**ధర్మపురి, మే 28, (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా జగిత్యాల జిల్లా ధర్మపురి లోని ఈద్గా నిర్వహించి ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి అడ్లూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ముస్లింల సంక్షేమం కొరకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ. 7కోట్లు కేటాయించినట్లు మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా నిరుద్యోగ యువతి, యువకులు స్వయం ఉపాధి పొందడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. ధర్మపురి నియోజకవర్గంలో 10వ తరగతి, ఇంటర్ పూర్తి అయిన యువతి, యువకుల స్వయం ఉపాధి కోసం రూ. 2 లక్షల రుణాలు బ్యాంకు ద్వారా ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఆసక్తి కలిగి న యువతి, యువకులు రుణాలు పొంది స్వయం ఉపాధి పొందాలని మంత్రి అడ్లూరి కోరారు. మంత్రి వెంట ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ఆశయాలు అందరికీ ఆదర్శం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**నల్గొండ, మే 28 (ది క్రైమ్ న్యూస్):** తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు ఆశయాలు అందరికీ ఆదర్శమని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకల సందర్భంగా గురువారం మిర్యాలగూడ పట్టణంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఎన్టీఆర్ భౌతికంగా మన మధ్య లేకపోయినా తెలుగు ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారు. సినిమా రంగంలోనే కాకుండా రాజకీయాల్లోనూ ఆయన సృష్టించిన కొత్త ఒరవడి చరిత్రలో నిలిచిపోతుంది" అని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం రూ.2 కే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పక్కా గృహాల వంటి పథకాలను ప్రవేశపెట్టి సంక్షేమ పాలనకు ఎన్టీఆర్ గారు నిజమైన నిర్వచనం ఇచ్చారని కొనియాడారు. "సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు" అనే నినాదంతో ప్రజాసేవ చేసిన మహానేతగా ఆయన చిరస్మరణీయులని తెలిపారు. ఎన్టీఆర్ కేవలం ఒక పార్టీ నాయకుడు మాత్రమే కాకుండా యావత్ తెలుగు జాతి గర్వకారణమని, రాజకీయాలు వేరైనా ఆయన ఆశయాలు, స్ఫూర్తిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎన్టీఆర్ అభిమాన సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని నివాళులర్పించారు.

## మెయింటెనెన్స్ పనుల కారణంగా విద్యుత్ సరఫరా అంతరాయం

**నల్గొండ, మే 28 (ది క్రైమ్ న్యూస్):** 33/11 కెవి ఆర్సీ గూడెం సబ్‌స్టేషన్‌లో నేడు మెయింటెనెన్స్ పనులు నిర్వహించనున్న నేపథ్యంలో, 33/11ఖఎ ఆర్సీ గూడెం పరిధిలోని ఫీడర్లకు ఉదయం 7:00 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పి మహేష్ ఏఈ మిర్యాలగూడ వన్ టౌన్ తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయం రామచంద్రగూడెం, తల్లగడ్డ, చైతన్య నగర్, చేదరి కాలనీ తదితర పరిసర ప్రాంతాలకు వర్తించనుంది. ప్రజలు, వాణిజ్య సంస్థలు మరియు పరిశ్రమల వినియోగదారులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## వివోఏల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి : సిపిఎం



**నల్గొండ, మే 28(ది క్రైమ్ న్యూస్):** వివోఏలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా నిడమనూరు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సమ్మెకు సిపిఎం మండల కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ప్రభుత్వం వెంటనే వివోఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం వివోఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గ్రామాల్లో వివోఏలతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటోందని, చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని, రాజకీయ ఒత్తిడులను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. పని భారం అధికంగా ఉన్నప్పటికీ కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. వివోఏలు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలని, ప్రభుత్వం సమస్యల పరిష్కారం చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. గతంలో అసంఘటిత రంగ కార్మికులు పోరాటాల ద్వారానే తమ సమస్యలను పరిష్కరించుకున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కోమండ్ల గురువయ్య, వివోఏలు చిలుముల జయమ్మ, సఫియా, పెద్దమ్మ, లలిత, సునీత, రాధా, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ శుభాకాంక్షలు ముస్లిం సోదరులకు తెలిపిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంథని రఘు



**మంథని మే 28 (ది క్రైమ్ న్యూస్):** పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా కమాన్‌పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంథని రఘు ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బక్రీద్ పండుగ త్యాగానికి, నిష్కల్మషమైన భక్తికి ప్రతీకగా నిలిచే పవిత్ర పర్వదినమని పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి కుటుంబంలో ప్రేమ, శాంతి, సౌభాగ్యం, ఆనందాలను నింపాలని ఆకాంక్షించారు. సమాజంలో సోదరభావం, పరస్పర గౌరవం, కరుణ వంటి మానవీయ విలువలు మరింత బలపడాలని కోరుకున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ ప్రేమాభిమానాలతో జీవిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ధర్మపురి, మే 28, (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలోని ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు ఆశ వర్కర్లు గురువారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ఆశ వర్కర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖంగా ఉన్నారని మంత్రి తెలిపారు. దశలవారీగా ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని ఈ సందర్భంగా మంత్రి ఆశ వర్కర్లకు హామీ ఇచ్చారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు స్థల పరిశీలన





**నల్గొండ మే 28 (ది క్రైమ్ న్యూస్):** విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. గురువారం మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో ప్రతిపాదిత యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో ఒకే ప్రాంగణంలో సుమారు 2600 మంది విద్యార్థులు విద్యనభ్యసించే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. విశాలమైన మైదానం, ఆధునిక తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, డైనింగ్ హాల్ తదితర వసతులు ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా ఉండే స్థలాన్ని ఎంపిక చేస్తున్నామని చెప్పారు. అన్ని వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి తగిన స్థలాన్ని ఖరారు చేసి త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఆర్డిఓ, తహసిల్దార్, ఆర్ఐతదితర అధికారులు పాల్గొన్నారు.

## వరికొయ్యల మంటల్లో చిక్కుకుని రైతు మృతి



**ఇల్లంతకుంట, మే28(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లిలో వరి కొయ్యలను తగలబెతుండగా ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకుని ఓ రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.....గ్రామానికి చెందిన ఎల్లక నారాయణ (60) అనే రైతు గురువారం తన భూమిలో వరి కొయ్యలకు నిప్పు పెట్టాడు.కాగా గాలికి బారీగా మంటలు చెలరేగడంతో పొలమంతా దట్టమైన పొగ వ్యాపించగా ఊపిరాడక నారాయణ మంటల్లో చిక్కుకుని అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు, గ్రామస్థుల సహాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా అప్పటికే నారాయణ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు సేవలు మరువలేనివి

● ఘనంగా ఎన్టీ రామారావు జయంతి వేడుకలు







మధిర (ది క్రైమ్ న్యూస్) ప్రతినిధి మే 28: ప్రపంచంలో తెలుగువారికి విశేష ప్రాముఖ్యత కల్పించి, తెలుగు ప్రజల సత్తాను నలవైపులా చాటిన యుగపురుషుడు మాజీ ముఖ్యమంత్రి, నందమూరి, తారక రామారావు ని, టిడిపి రాష్ట్ర నాయకులు చేకూరి శేఖర్ బాబు పేర్కొన్నారు. స్వర్గీయ యన్.టి.ఆర్. 103వ జయంతి సందర్భంగా మధిర పట్టణంలోని గురువారం నాడు యన్ టిఆర్ విగ్రహానికి, అంబేద్కర్ సెంటర్ లో వున్న విగ్రహానికి, శేఖర్ బాబు, తెలుగుదేశం నాయకులు పూల మాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. స్వతంత్ర భారతంలో తొలిసారిగా పేదలకు రెండురూపాయలకే కేజీ బియ్యం, జనతా వస్త్రాలు, మహిళలకు ప్రత్యేక కోటా ప్రవేశపెట్టిన మహా నేత యన్.టి.ఆర్. నేటికి తెలుగు ప్రజల గుండెల్లో కొలువై వున్నారని శేఖర్ బాబు కొనియాడారు. ఐటిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి వేమూరి సునీల్ మాట్లాడుతూ, యన్.టి.ఆర్. వేసిన పునాదులపైనే, చంద్రబాబు నారా లోకేష్ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేలా, ప్రపంచస్థాయి దిగ్గజ కంపెనీలను ఎపికి రప్పించి, సంపద సృష్టించేందుకు శ్రమిస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమంకోసం చంద్రబాబు పాటుపడుతున్నారని కౌన్సిలర్ ములకలపల్లి వినయ్ అన్నారు. మధిర పట్టణంల పలు అనాధాశ్రమంలో అన్నదాన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లాది హనుమంతరావు, మారేడు పుల్లారావు, గడ్డం రమేష్, చెరుకూరి కృష్ణారావు, మణిగ స్వామి, చింతల కొండలరావు యన్.టి.ఆర్. అభిమానులు పాల్గొన్నారు.

# నానబెట్టిన ఎండుద్రాక్ష నీరే కదా అని పారేస్తున్నారా?
# మీరు పొరపాటు చేస్తున్నట్లే..



నానబెట్టిన బాదం, వాల్ నట్స్ ను ఉదయాన్నే తినే అలవాటు చాలా మందికి ఉంటుంది. ఇందులో ఎండు ద్రాక్ష కూడా ఉంటుంది. నానబెట్టిన ఎండుద్రాక్ష ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. కానీ చాలా సందర్భాలలో నానబెట్టిన ఎండుద్రాక్షను తింటారు. కానీ నీటిని పారేస్తుంటారు. కానీ అసలు పొరపాటు ఇక్కడే చేస్తుంటారు. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం, నానబెట్టిన ఎండు ద్రాక్ష ఎంత పోషకమైనదో.. నీరు కూడా అంతే. ఎండుద్రాక్ష నానబెట్టిన నీరు డిటాక్స్ వాటర్‌గా పనిచేస్తుంది. ఇది శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్ ను బయటకు పంపుతుంది. ఎండుద్రాక్ష నానబెట్టిన నీరు శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. ఈ నీరు జీర్ణక్రియకు కూడా సహాయపడుతుంది. ఎండుద్రాక్షను నీటిలో నానబెట్టి తాగడం వల్ల



కలిగే ప్రయోజనాలను చూడండి. నానబెట్టిన ఎండుద్రాక్షను ఎప్పుడూ పారేయకండి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది ఫ్రీ రాడికల్స్ నుండి శరీరాన్ని రక్షిస్తుంది. ఈ నీటిలో ఉండే విటమిన్లు, మినరల్స్ రోగనిరోధక శక్తిని కూడా మెరుగుపరుస్తాయి. ఎండుద్రాక్ష నానబెట్టిన నీటిని డిటాక్స్ వాటర్‌గా తాగడం వల్ల శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. శారీరక మంట తగ్గుతుంది. కాలేయ పనితీరు మెరుగుపడుతుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే బరువును తగ్గిస్తుంది. మీరు అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్లయితే, మీరు తప్పనిసరిగా నీటిలో నానబెట్టిన ఎండుద్రాక్షను తీసుకోవాలి. ఈ నీటిలో పొటాషియం ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అంతేకాకుండా, ఈ పానీయంలో ఐరన్ ఉంటుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచడంలో సహాయపడుతుంది. మీరు మలబద్ధకంతో బాధపడుతుంటే, నీటిలో నానబెట్టిన ఎండుద్రాక్షను తాగండి. ఈ పానీయంలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థ, ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఎండుద్రాక్ష నానబెట్టిన నీరు శరీరంలో పేరుకుపోయిన అన్ని కాలుష్య కారకాలను బయటకు పంపడానికి సహాయపడుతుంది. 10-15 ఎండుద్రాక్షలను ఒక కప్పు నీటిలో రాత్రంతా నానబెట్టండి. మరుసటి రోజు ఉదయం నానబెట్టిన ఎండుద్రాక్షను తినండి. దానితో ఎండుద్రాక్ష నానబెట్టిన నీటిని తాగండి.

# రాత్రుళ్లు చపాతీలు తినవచ్చా.? ఆరోగ్య ప్రయోజనాలెన్నో తెలిస్తే.!



ఉరుకుల పరుగుల జీవితంలో భాగంగా ప్రజల లైఫ్ స్టైల్ రోజురోజుకూ మారుతూ వస్తోంది. ఇలా మారడం మూలంగా పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం చాలా మందిని పట్టి పీడిస్తున్న సమస్య అధిక బరువు. రెగ్యులర్ డైట్‌లో క్యాలరీలు ఎక్కువ కావడం, శారీరిక శ్రమ లేకపోవడం.. అలాగే టైంకి సరిగ్గా తినకపోవడం.. ఇవి జరుగుతున్నాయ్. ఇక ఇలా ఉంటే మీ ఆరోగ్యానికే ప్రమాదమని అంటున్నారు వైద్య నిపుణులు. ఇదిలా ఉండగా.. చాలామంది రాత్రుళ్లు అన్నం బదులుగా జొన్న రొట్టెలు, రోటీ లేదా చపాతీలు లాంటివి తింటుంటారు. రాత్రిపూట ఎక్కువగా వైట్ రైస్ బదులే.. ఈ చపాతీలు తినడానికే ప్రాధాన్యత ఇస్తారు. ఎందుకంటే.! చపాతీలను తయారు చేసే గోధుమపిండిలో విటమిన్ బీ, ఇ, కాల్షియం, ఐరన్, జింక్, సోడియం, పోటాషియం, మెగ్నిషియం వంటివి పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి కావాల్సినంత శక్తిని ఇస్తాయి. పైగా వైట్ రైస్ కంటే త్వరగా చపాతీలు జీర్ణం అవుతాయి. ఇక చపాతీలను కాల్చేటప్పుడు తక్కువ నూనె వేసి కాల్చితే.. అన్నంతో పోలిస్తే క్యాలరీలు కూడా తక్కువ ఉంటాయి. రెండు లేదా మూడు చపాతీలు తింటేనే మనకు కడుపు నిండిన ఫీలింగ్ ఉంటుంది. దీని వల్ల మన బరువు కూడా కంట్రోల్‌లో ఉంటుంది. అయితే రాత్రిపూట అప్పుడే చేసుకుని చపాతీలు తినడం కంటే.. నిల్వ ఉన్న చపాతీలు తినడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. మిగిలిపోయిన చపాతీలు తినడం వల్ల బ్లడ్ ప్రెషర్ లెవెల్స్ సమతుల్యంగా ఉండటమే కాకుండా కడుపునొప్పి సమస్య కూడా ఉండదని అంటున్నారు. గ్యాస్, కాన్స్టిపేషన్, ఎసిడిటీ వంటి సమస్యలు దూరం అవుతాయట. డయాబెటిస్ కంట్రోల్‌లో ఉంటుందట. పాలల్లో నానబెట్టుకుని తీసుకునే చపాతీలతో కూడా ఇన్నే ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు. కాగా, మీరు ఏదైనా డైట్ ఫాలో అయ్యే ముందు కచ్చితంగా మీ డాక్టర్‌ను సంప్రదించండి.. పై వార్త కేవలం పలు అధ్యయనాలు ఆధారంగా ప్రచురితం చేసింది మాత్రమే.

# వీటిని మీ డైట్‌లో చేర్చుకుంటే.. ఖచ్చితంగా బరువు తగ్గుతారు..

భారతీయ వంటకాల్లో ఉపయోగించే మసాలాలు చాలా ఫేమస్. వీటిని కేవలం వంటలకు మాత్రమే కాకుండా..ఇతరఆరోగ్యప్రయోజనాలుకూడాఉన్నాయి. పూర్వం మందులు సరిగ్గా లేనప్పుడు..వీటినే చికిత్సకు ఉపయోగించేవారు. ఈమసాలాల్లో లవంగాలు కూడా ఒకటి. లవంగాలను పలు రకాల ఆహార పదార్థాల్లో ఉపయోగిస్తూ ఉంటారు. లవంగాల్లో ఎన్నో ఆరోగ్య కరమైన పోషకాలు ఉన్నాయి. వీటితో అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చు. లవంగాల్లో పలు రకాల యాంటీ ఆక్సిడెంట్లు కూడా లభ్యమవుతాయి. లవంగాలు తీసుకోవడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి అనేది పెరుగుతుంది. దీని వల్ల పలు రకాల సీజనల్ వ్యాధులతో పోరాడే శక్తి లభిస్తుంది. లవంగాలతో నోటి ఆరోగ్యాన్ని కూడా మెరుగు పరచుకోవచ్చు. దంతాలు, చిగుళ్ల సమస్యలు, నోటి దుర్వాసన తగ్గించుకోవచ్చు.లవంగాల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలతో... శరీరంలోని ఫ్రీ రాడికల్స్ సమస్యను తగ్గించుకోవచ్చు. వీటితో క్యాన్సర్, గుండె జబ్బులు, డయాబెటీస్ వంటి వాటిని కంట్రోల్ చేయవచ్చు.లవంగాలతో ముఖ్యంగా బరువు కూడా తగ్గొచ్చు. వెయిట్ లాస్ అయ్యేందుకు చాలా రకాలుగా లవంగాలను యూజ్ చేయవచ్చు. రాత్రి పడుకునే ముందు గ్లాస్ నీటిలో రెండే లేదా మూడు లవంగాలను వేసి.. ఉదయం తాగాలి. అదే విధంగా లవంగాలను పొడిలా చేసుకుని.. గోరు వెచ్చని నీటిలో కలిపి అయినా తీసుకోవచ్చు. లవంగాలతోటీకూడా తయారు చేసుకుని తాగవచ్చు. ఇలా ఎలా తీసుకున్నా వెయిట్ లాస్ అవుతారు.



# రక్తంలో కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచే యోగాసనాలు..
## క్రమంతప్పకుండా చేస్తే గుండె జబ్బులు పరార్

నేటికాలంలో చాలామంది మధుమేహం, కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడుతున్నారు. దీనికి గతితప్పిన జీవనశైలి, తప్పుడు ఆహారం ప్రధాన కారణం. కొలెస్ట్రాల్‌ను మొదటి నుండి నియంత్రించకపోతే, గుండెపోటు వచ్చే ప్రమాదం మరింత పెరుగుతుంది. రక్తంలో కొలెస్ట్రాల్ ప్రధానంగా రెండు రకాలు. మంచి కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్. మంచి కొలెస్ట్రాల్ స్థాయి తగ్గడం, చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరగడం వల్ల సిరలు - ధమనులలో రక్త ప్రసరణను దెబ్బతీస్తుంది. పలితంగా రక్త నాళాలలో రక్తం గడ్డకట్టడానికి కారణమవుతుంది. ఫలితంగా గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి మరీ పెరిగితే వైద్యుల సలహాతో మందులు వాడాల్సి ఉంటుంది. కానీ తినడం ద్వారా మాత్రమే కాకుండా కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో యోగా కూడా కీలక పాత్ర పోషిస్తుంది. యోగా వంటి వ్యాయామాలు అజీర్ణం, మధుమేహం, ఎముకల సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. ధనురాసనం, భుజంగాసనం, పశ్చిమోత్తాసనం వంటి కొన్ని యోగాసనాలు రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రించడంలో, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తాయి. భుజంగాసనం.. వెనుకభాగంలో పడుకుని, అరచేతులతో కడుపు నుంచి పైభాగాన్ని ఎత్తాలి. శరీరం భుజంగ ఆకారంలో ఉన్నందున దీనిని భుజంగాసనం అంటారు. ఈ ఆసనాన్ని క్రమం తప్పకుండా చేయడం వల్ల కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీర్ణవ్యవస్థను కూడా చక్కగా ఉంచుకోవచ్చు. ఈ విధంగా రక్తంలో కొలెస్ట్రాల్‌ను నియంత్రించవచ్చు. పశ్చిమోత్తాసనం.. కాళ్లను ముందుకి చాచి కూర్చోవాలి. పై నుండి చేతులను నిటారుగా ఉంచి, నెమ్మదిగా ముందుకు తీసుకొచ్చి కాలి బొటనవేళ్లను పట్టుకోవాలి. తర్వాత మోకాళ్లపై తలను ఉంచి, శరీరం పై భాగాన్ని ముందుకు వంచాలి. మోకాలు వంగకూడదు. ఇది పశ్చిమోత్తాసనం. క్రమం తప్పకుండా చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచవచ్చు. తద్వారా మెరుగైన గుండె ఆరోగ్యానికి దారితీస్తుంది. అయితే అధిక రక్తపోటు ఉన్న రోగులు దీన్ని చేయడానికి ముందు వైద్యుడిని సంప్రదించాలి. ధనురాసనం.. వెనుకవైపు పడుకుని నడుము నుంచి శరీర ముందు భాగాన్ని పైకెత్తి, కాళ్ళను వెనుకకు మడిచి వాటిని పైకి లేపి, రెండు చేతులను వెనుకకు తీసుకుని, కాలి వేళ్లను పట్టుకోవాలి. ఇది సరిగ్గా చేస్తే.. భంగిమ విల్లులా ఉంటుంది. అందుకే దీనికి ధనురాసనం అని పేరు. క్రమం తప్పకుండా చేయడం వల్ల ఛాతీ విస్తరిస్తుంది. కండరాల ఒత్తిడి తగ్గుతుంది. ఊపిరితిత్తులకు ప్రయోజనం చేకూరుతుంది. గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

# డయాబెటిక్ పేషెంట్లకు ఈ బియ్యం వరం.
## శాస్త్రవేత్తల సలహా ఏంటంటే..



సంప్రదాయ విత్తనాలకు భిన్నంగా అధిక దిగుబడుల్చిన వంగడం సాంబ మసూరి.. దక్షిణ భారతదేశంలోని ఎక్కువ ప్రాంతాల్లో రైతులు ఈ రకం వరినే సాగు చేస్తారు. దీని అన్నం తినడానికి రుచిగా ఉంటుంది. అదే సమయంలో పంట తక్కువ రోజుల్లో పండడం వల్ల రైతుకు పెద్దగా ఖర్చు ఉండదు. నేడు ఈ ఈ రకం వరి వంగడాన్ని ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, జార?ండ్, తెలంగాణ వంటి వివిధ రాష్ట్రాల్లో 1.5 లక్షల హెక్టార్లకు పైగా సాగు చేస్తున్నారు. నిర్వహించిన జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. హితేంద్ర పటేల్ సాంబా మన్సూరి బియ్యం గురించి వివరించారు. సాంబా మసూరి బియ్యం బాక్టీరియా ముడత వ్యాధికి నిరోధకతను కలిగి ఉంటుంది. చాలా తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటుంది. ఇది డయాబెటిక్ రోగులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ అనేది కార్బోహైడ్రేట్-రిచ్ ఫుడ్ లేదా డ్రింక్‌ని తినడం లేదా తాగిన తర్వాత రక్తంలో ఎంత గ్లూకోజ్ పెరుగుతుందనే దాని ఆధారంగా ర్యాంక్ చేసే స్కేల్ అని గమనించాలి. తక్కువ ఉన్న బియ్యం మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిదని చెబుతున్నారు.. తక్కువ ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల రక్తప్రవాహంలోకి గ్లూకోజ్ నెమ్మదిగా విడుదలై మధుమేహం దుష్ప్రభావాలను తగ్గిస్తుంది. ఇది మంచి దిగుబడి మరియు చక్కటి ధాన్యం రకాన్ని కూడా చూపింది, దాని మార్కెట్ సామర్థ్యాన్ని మరియు రైతులకు లాభాన్ని పెంచుతుంది. ఇది బాక్టీరియా ముడతకు కూడా నిరోధకతను కలిగి ఉంటుంది.

# పోషకాల దానిమ్మ.. లాభాలతోపాటు నష్టాలు కూడా ఉన్నాయండోయ్..
## ఈ సమస్యలున్న వారు తినకూడదంట..



పండ్లు మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. రెగ్యులర్‌గా పండ్లు తినేవారికి జబ్బులు అంత తేలికగా దరిచేరవు. అందుకే.. వైద్యులు పండ్లను తినాలని సూచిస్తుంటారు. ఎందుకంటే.. పండ్లలో పోషకాలతోపాటు.. వ్యాధులను నివారించే లక్షణాలను కలిగి ఉంటాయి.. అలాంటి పండ్లలో దానిమ్మ ఒకటి.. దానిమ్మ పండు.. చాలా రుచిగా.. తీపిగా ఉంటుంది. ఇది అనేక వ్యాధుల నివారణకు కూడా ఉపయోగపడుతుంది. రక్తహీనత, పలు సమస్యల నివారణకు దానిమ్మపండు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. దానిమ్మ పండులో విటమిన్ సి, బి ఉంటాయి. ఇందులో మెగ్నీషియం, పొటాషియం, ఫాస్పరస్, సెలీనియం, జింక్ పుష్కలంగా ఉన్నాయి. అయితే.. దానిమ్మ పండు తినడం వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు, కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. దానిమ్మ తినడం వల్ల కలిగే లాభాలు, నష్టాలు ఏంటో తెలుసుకోండి.. దానిమ్మలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇతర పండ్ల రసాల కంటే దానిమ్మ రసంలో ఎక్కువ యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది కణాలను దెబ్బతినకుండా కాపాడుతుంది. క్యాన్సర్ రాకుండా ఉండాలంటే దానిమ్మపండు తినాలి. దానిమ్మ రసం క్యాన్సర్‌తో బాధపడేవారికి మేలు చేస్తుంది. ప్రోస్టేట్ క్యాన్సర్ కణాలను నిరోధించడానికి దానిమ్మ రసం తీసుకోవాలి. ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. అల్జీమర్స్ వ్యాధి రాకుండా ఉండాలంటే దానిమ్మపండు తినాలి. దీని విత్తనాలు అల్జీమర్స్ వ్యాధి అభివృద్ధిని నిరోధిస్తాయి. ఇంకా జ్ఞాపకశక్తిని బలపరుస్తాయి. దానిమ్మ రసం పేగు మంటను తగ్గించడం ద్వారా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. విరేచనాల సమస్య ఉంటే, దానిమ్మ రసం తీసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. కీళ్ల నొప్పులు, నొప్పి.. ఇతర రకాల ఆర్థరైటిస్‌లకు దానిమ్మ రసం ప్రయోజనకరంగా ఉంటుంది. దానిమ్మ రసం గుండె జబ్బులకు కూడా మేలు చేస్తుంది. రక్తపోటు రోగులకు కూడా దానిమ్మ రసం ప్రయోజనకరంగా ఉంటుంది. మధుమేహం ఉన్న వారు సైతం దానిమ్మ రసాన్ని తాగొచ్చు.. దానిమ్మ ఇన్సులిన్, రక్తంలో చక్కెరను తగ్గించడంలో సహాయపడుతుంది. దానిమ్మ తినడం వల్ల కలిగే నష్టాలు తక్కువ రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్న వారు దానిమ్మ రసాన్ని తక్కువ మోతాదులో తీసుకోవాలి. విరేచనాలు అయ్యే సమయంలో కూడా దానిమ్మ రసం తాగకూడదు. చర్మానికి దానిమ్మ రసాన్ని రాసుకుంటే చాలా మందికి దురద, వాపు లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది. దానిమ్మ ఎక్కువగా తీసుకుంటే.. మీ జీర్ణశయాంతర ప్రేగులను చికాకుపెడుతుంది.. ఇది జీర్ణవ్యవస్థను అడ్డుకుంటుంది. దానిమ్మను ఎక్కువగా తీసుకోవడం వల్ల కొన్ని సందర్భాల్లో వికారం, వాంతులు, కడుపు నొప్పి, మలబద్ధకం లేదా విరేచనాలు సంభవించవచ్చు.

# విశ్వజి



## ఇలా కాపాడుకోండి

సాధారణంగానే మహిళల్లో పోషకాహర లోపం ఎక్కువగా కనిపిస్తుంది. అది ఎప్పుడూ వివిధరకాల సమస్యలకు కారణమవుతూనే ఉంటుంది. పోషకాల్లో ఒక్కో విటమిన్ ఒక్కో అవయవానికి మేలు చేస్తుంది. అందువల్ల అన్ని పోషకాలు మనిషికి అవసరమే. దాంట్లో విటమిన్-డి అనేది ఎముకల ఆరోగ్యానికి చాలా ముఖ్యం. విటమిన్-డి లోపిస్తే ఎముకలు బలహీనపడి 'ఆస్టియోమలాషియా' సమస్య వస్తుంది. అంతేకాదు, ఇది ఇలాగే కొనసాగితే దీర్ఘకాలంలో ఆస్టియోపొరోసిస్ సమస్యకు దారితీసి.. ఎముకలు గుల్లబారుతాయి. చిన్న గాయం కావడంతోనే విరిగిపోతుంటాయి. ఈ సమస్యలు పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం, విటమిన్-డి లోపం వల్ల మహిళల్లో తీవ్రమైన సమస్యలు వస్తాయట. నడి వయసు దాటిన మహిళల్లో మెనోపాజ్ తర్వాత ఈస్ట్రోజన్ హార్మోన్ తక్కువగా ఉంటుంది. ఫలితంగా ఎముకలు పటుత్వం కోల్పోతూ ఉంటాయి. ఇదే కాకుండా జీవనశైలిలో మార్పుల వల్ల కూడా మహిళల్లో విటమిన్-డి లోపిస్తుంది. ఫలితంగా అలసట, కండరాల బలహీనత, ఎముకల్లో నొప్పి (ముఖ్యంగా నడుము, కాళ్లు), డిప్రెషన్, రోగనిరోధక శక్తి తగ్గి తరచూ జలుబు, జ్వరం రావడం, జుట్టు రాలడం, గాయాలు త్వరగా తగ్గకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. విటమిన్-డి లోపించకూడదు అంటే.. ప్రతిరోజూ ఉదయం కొంతసేపు శరీరానికి సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. రోజూ కాకపోయినా రెండు రోజులకు ఒకసారి 15-30 నిమిషాలు సూర్యోదయం వేళ ఎండలో కూర్చుంటే మంచిది. అలాగే తినే ఆహారంలో విటమిన్-డి ఉండే ఫ్యాటీ ఫిష్ (సాల్మన్), గుడ్డు పచ్చసొన, ఫోర్టిఫైడ్ పాలు, పప్పు ధాన్యాలు తీసుకోవాలి. యూవీ కిరణాలు పడేచోట సాగు చేసిన పుట్టగొడుగుల్లో కూడా విటమిన్-డి ఉంటుంది. వీటితో పాటు 50 ఏళ్లు దాటిన మహిళలు వైద్యులను సంప్రదించి విటమిన్ సప్లిమెంట్లు తీసుకోవాలి. వీటితో పాటు క్యాల్షియం పుష్కలంగా ఉండే ఆహారం తీసుకుంటూ, బరువులతో కూడిన వ్యాయామం చేయడం ద్వారా విటమిన్-డి లోపాన్ని ఎదుర్కోవచ్చు.




## ఈ ఆసనాలతో డయాబెటిస్ ముప్పు దూరం - ఎన్నో ఫలితాలు..!!

యోగా. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతకు తోడ్పడుతుంది. దీర్ఘ కాలిక రోగాలకు పరిష్కారం చూపుతోంది. నిత్యం యోగా చేయటం ద్వారా షుగరు వంటి సమస్యలు నియంత్రణలో ఉంటాయి. డయాబెటీస్ ఒకసారి వచ్చిందంటే నయమయ్యేది కాదు. డయాబెటీస్ కు యోగా ఎంతగానో తోడ్పడుతున్నట్లు రిసెర్చ్ లు వెల్లడించాయి. యోగాలోని ఆసనాలతో షుగరు తో పాటుగా ఆనారోగ్య సమస్యలు ఎన్నో దూరం అవుతాయి. డయాబెటీస్ రావటానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో మానసిక ఒత్తిడీ ప్రధాన కారణంగా ఉంది దీంతో సింపథెటిక్ నాడీ వ్యవస్థ, అడ్రినల్ గ్రంథి ఉత్తేజితమై రక్తంలోకి గ్లూకోజు ఎక్కువగా విడుదలవుతుందని, కణాల్లోకి గ్లూకోజు వెళ్లేలా చేసే ఇన్సులిన్ హార్మోన్ పనితీరు అస్తవ్యస్తం గా మారుతుంది. ఈ క్రమంలో క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతకు తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆసనాలతో కండరాలకు రక్త సరఫరా పెరుగుతుందని, అంతేకాకుండా ఇన్సులిన్ గ్రాహకాల వ్యక్తీకరణ ఇనుమడించటం వల్ల గ్లూకోజును బాగా స్వీకరిస్తాయి. ప్రాణాయామం, ధ్యానం వంటి వాటితో మానసిక ప్రశాంతత చేకూరుతుంది. యోగాలో ధ్యానంతో పాటుగా ఎన్నో రకాల ఆసనాలు శరీరానికి మేలు చేస్తాయి. యోగాలో వేసే త్రికోణాసనం షుగరు వ్యాధి గ్రస్తులకు ప్రయోజన కరంగా ఉంటుంది. అదే విధంగా చక్రాసనం ఆరు సార్లు చేయటం ద్వారా మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. పది నిమిషాల పాటు శవాసనం అవసరం. ఇందులో ప్రశాంతంగా వెల్లకిలా పడుకోవాలి. కళ్లు మూసుకొని పాదాల దగ్గర నుంచి తల వరకూ ఒక్కో అవయవం మీద దృష్టి సారిస్తూ అవన్నీ బాగా విశ్రాంతి పొందుతున్నట్లు భావించాలి. ఇక.. సూర్య నమస్కారాలు 12 దశల్లో చేయాలి. సూర్య నమస్కారాల్లో ప్రణామ, హస్తోత్థావ,





హస్తపాద, అశ్వసంచాలన, దండ, అష్టాంగ నమస్కార, భుజంగ, అదోముఖస్వాన, అశ్వ సంచాలన, హస్తపాద, హస్తోత్థావ, ప్రణామ ఆసనాలను ఒక క్రమపద్ధతిలో చేయాలి. అర్ధమత్స్యేంద్రాసనం, పవన ముక్తాసనం, భుజంగాసనం, పాదచక్రాసనం, ధనురాసం వంటివి చేయటం ద్వారా శరీరానికి ఆరోగ్య పరమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఇక 5 సార్లు భస్త్రిక చేయాలి. ఇందులో నాలుగు సార్లు శ్వాసను వీలైనంత వేగంగా తీసుకొని, వదిలిపెట్టాలి. ఆ తర్వాత ఒకసారి గాఢంగా శ్వాస తీసుకొని, నెమ్మదిగా వదలాలి. ఇలా ప్రతీ ఆసనం.. భంగిమ శరీరంలో ఒక్కో అవయవానికి మేలు చేస్తుంది.

### రోజూ అసలు ఎన్ని జామకాయలను తినాలి..?

## వీటి వల్ల కలిగే లాభాలు ఏమిటి..?



జామకాయలు అంటే చాలా మంది ఇష్టంగానే తింటారు. కొందరు జామకాయలను తింటే కొందరు జామ పండ్లను తినేందుకు ఆసక్తిని చూపిస్తారు. జామకాయలు కొద్దిగా దోరగా, పులుపు, తీపి రుచుల కలయికలో ఉంటాయి. జామ పండ్లు తియ్యగా ఉంటాయి. జామ కాయలను లేదా పండ్లను వేటిని తిన్నా ఆరోగ్యకరమైన ప్రయోజనాలే కలుగుతాయి. జామకాయలను తినడం వల్ల లాభాలు కలుగుతాయని చాలా మందికి తెలుసు. కానీ రోజుకు ఎంత మోతాదులో వీటిని తినాలి.. అని చాలా మంది సందేహిస్తుంటారు. అయితే ఇందుకు పోషకాహార నిపుణులు ఏమని సమాధానం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. 100 గ్రాముల జామ కాయలు లేదా పండ్లను రోజూ తినవచ్చు. అంతకు మించితే జీర్ణ సమస్యలు వస్తాయి. ఇక జామకాయలను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. అనేక పోషకాలు మన శరీరానికి లభిస్తాయి. డయాబెటిస్ ఉన్నవారికి.. జామకాయలు లేదా పండ్లను పోషకాలకు నెలవుగా చెప్పవచ్చు. వీటిల్లో మన శరీరానికి కావల్సిన అనేక విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల వీటిని తింటే పోషకాహార లోపం తగ్గుతుంది. ఈ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను తగ్గేలా చేస్తుంది. రోగాలు రాకుండా చూస్తుంది. జామ పండ్లను తినడం వల్ల ఫైబర్ అధికంగా లభిస్తుంది. దీని వల్ల పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. దీంతో మలబద్దకం తగ్గుతుంది. షుగర్ ఉన్నవారికి జామ కాయలు ఎంతో మేలు చేస్తాయి. వీటిని తింటే షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. ఈ కాయల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగవు. పైగా ఈ కాయల్లో ఉండే ఫైబర్, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. అందువల్ల జామకాయలను తరచూ తింటుంటే డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. గుండె ఆరోగ్యానికి.. జామకాయల్లో పొటాషియం, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి బీపీని నియంత్రిస్తాయి. రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. ఈ కాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న కారణంగా వీటిని తింటే చర్మం సంరక్షించబడుతుంది. సూర్యకాంతి నుంచి చర్మం సురక్షితంగా ఉంటుంది. ఆక్సీకిరణ ఒత్తిడి తగ్గిపోతుంది. ఫలితంగా వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మం యవ్వనంగా మారి కాంతివంతంగా కనిపిస్తుంది. జామకాయల్లో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ కాయలను తింటే గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. పేగుల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. రోగ నిరోధక వ్యవస్థకు.. జామకాయలను తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. జామకాయలను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. జామ కాయల్లో తెలుపు, పింక్ రంగులో ఉండే కాయలు ఉంటాయి. అయితే పింక్ రంగులో ఉండే కాయలను తింటే విటమిన్ ఎ అధికంగా లభిస్తుంది. ఇది కంటి చూపును మెరుగు పరచడంతోపాటు రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇలా జామ కాయలు లేదా పండ్లను రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# మార్కెట్

## బ్యాంకులకు ఆ స్వేచ్ఛ ఉన్నది

### కనీస నగదు నిల్వల పెంపుపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

గోజారియా(గుజరాత్) : బ్యాంకు ఖాతాల్లో కనీస నగదు నిల్వలపై రిజర్వు బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. మినిమమ్ బ్యాలెన్స్ ఎంత ఉండాలనేది పూర్తిగా బ్యాంకుల నిర్ణయమని, దీనిపై రిజర్వు బ్యాంక్ నియంత్రణ ఏదీ ఉండదని స్పష్టంచేశారు. కనీస బ్యాలెన్స్ పరిమితిని ఐసీఐసీఐ బ్యాంక్ గరిష్ఠంగా రూ.50 వేల వరకు పెంచిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్న ప్రస్తుత తరుణంలో ఆయన పై విధంగా స్పందించారు. కనీస బ్యాలెన్స్ ఎంత ఉండాలనే నిర్ణయం ఆర్బీఐ బ్యాంకులకే వదిలేసింది. కొన్ని బ్యాంకులు రూ.10 వేలు, మరికొన్ని బ్యాంకులు రూ.2 వేలుగా నిర్ణయిస్తుంటాయి. ఇటీవల ఐసీఐసీఐ బ్యాంక్ తన పొదుపు ఖాతాల్లో నగదు నిల్వలను ఐదింతలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో రూ.10 వేలుగా ఉన్న కనీస నగదు నిల్వలను రూ.50 వేలకు పెంచింది. కానీ, కొన్ని ప్రభుత్వరంగ బ్యాంకులు కనీస నగదు నిల్వలపై పరిమితులను ఎత్తివేశాయి. యువతకు డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత చాలా కీలకమన్నారు. మునుపు చదువుకోకపోతే అభివృద్ధి చెందరని చెప్పేవారు.. కానీ నేటి యుగంలో డిజిటల్ అక్షరాస్యత విషయంలోనూ ఇదే పరిస్థితి అన్నారు.




## అమెరికా-చైనా మధ్య ట్రేడ్ డీల్‌కు మరో 90 రోజులు విరామం




రష్యా చమురు కొనుగోలును కారణంగా చూపి భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీస్థాయిలో ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే. న్యూఢిల్లీపై ఏకంగా 50 శాతం సుంకాలు విధించారు. ప్రస్తుతం 25 శాతం టారిఫ్ అమల్లోకి వచ్చింది. ఆగస్టు 27 నుంచి మిగతా 25 శాతం టారిఫ్ అమలులోకి రానుంది. అయితే, రష్యా చమురు కొనుగోలు చేస్తున్న చైనా విషయంలో మాత్రం ట్రంప్ భిన్నవైఖరితో ముందుకెళ్తున్నారు. డ్రాగన్‌పై ఎలాంటి టారిఫ్‌లు బాదడం లేదు. తొలుత చైనాపై భారీగా టారిఫ్‌ల బాంబ్ పేల్చిన ట్రంప్.. ఆ తర్వాత వెనక్కి తగ్గారు. ఇప్పుడు చైనాతో వాణిజ్య ఒప్పందానికి మరో 90 రోజుల విరామం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. వాణిజ్య ఒప్పందం చర్చల గడువును పొడిగించినట్లు చైనా కూడా తన అధికారిక మీడియాలో పేర్కొంది. రెండు దేశాలూ ఇటీవలే పోటాపోటీగా సుంకాలు విధించుకున్న విషయం తెలిసిందే. చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై 145 శాతం టారిఫ్‌లు విధించనున్నట్లు ట్రంప్ ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించారు. ఇక చైనా సైతం అమెరికాపై 125 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ ఏడాది మేలో అమెరికా, చైనా మధ్య కీలక ట్రేడ్ డీల్ కుదిరింది. ఇరుదేశాలు సుంకాలను భారీగా తగ్గించేందుకు ఓ అంగీకారానికి వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం.. అమెరికా దిగుమతులపై చైనా సుంకాలను 125 నుంచి 10 శాతానికి తగ్గించింది. మరోవైపు చైనా దిగుమతులపై అమెరికా సుంకాలను 145 నుంచి 30 శాతానికి తగ్గించింది. ఈ తగ్గింపు 90 రోజులు మాత్రమే అమల్లో ఉండేలా ఇరు దేశాలూ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆ ఒప్పందం మంగళవారం అర్ధరాత్రితో ముగియనుంది. దీంతో ట్రంప్ తాజాగా డ్రాగన్‌తో వాణిజ్య ఒప్పందానికి మరో 90 రోజుల విరామం ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనాపై ప్రతీకార సుంకాలు విధించాలా? వద్దా? అనే అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్? పేర్కొన్నారు. ఎందుకంటే, రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంతో సంబంధం లేని, అనేక అంశాలు అమెరికా-చైనా సంబంధాలను ప్రభావితం చేస్తాయని ఆయన అన్నారు.

## భారీగా తగ్గిన పుత్తడి.. రూ.900 దిగిన తులం ధర



న్యూఢిల్లీ, ఆగస్టు 11 : రికార్డు స్థాయికి చేరుకున్న బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు భారీగా పడిపోవడంతో దేశీయంగా తులం ధర రూ.900 దిగొచ్చింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల ధర రూ.1,02,520కి దిగొచ్చింది. రాజకీయ అనిశ్చిత పరిస్థితులు తగ్గుముఖం పట్టడం, స్టాకిస్టులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో ధరలు తగ్గుముఖం పట్టాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన తులం ధర రూ.900 తగ్గి రూ.1,02,100గా నమోదైంది. గడిచిన ఐదు సెషన్లలో పుత్తడి ధర రూ.5,800 ఎగబాకిన విషయం తెలిసిందే. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ కలిగిన తులం బంగారం ధర రూ.760 తగ్గి రూ.1,02,280కి పరిమితమైంది. అంతకుముందు ఇది రూ.1,03,040గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర కూడా రూ.700 దిగొచ్చి రూ.1,02,280గా నమోదైంది. రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంపై ఒక కొలిక్కి వచ్చే అవకాశాలుండటంతో గ్లోబల్ మార్కెట్లో పుత్తడి ధరలు భారీగా తగ్గాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. పసిడితోపాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. కిలో వెండి రూ.1,000 తగ్గి రూ.1,14,000గా నమోదయ్యాయి.

# ఆంధ్రప్రదేశ్

## సాగునీటి ప్రాజెక్టులకు టిడిపి పెద్దపీట

**ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు సాగునీటికి ప్రాధాన్యం**

**నదుల అనుసంధానంపై మహానాడులో నిమ్మల వెల్లడి**

అమరావతి,మే28 : సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు దూరదృష్టి అమోఘమని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. నీటిపారుదల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వాలే పునాది వేశాయని పేర్కొన్నారు. జలం ఉన్న చోటే నాగరికత అభివృద్ధి చెందిందని తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన మహానాడులో 'నీటిపారుదల అభివృద్ధి – నదుల అనుసంధానం'పై మంత్రి నిమ్మల మాట్లాడారు. పల్లెల నుంచి పట్టణాల నుంచి.. మహానగరాలుగా అభివృద్ధి చెందిన పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. ఈ సత్యాన్ని గ్రహించే.. అనాడు మాజీ సీఎం ఎన్టీఆర్ దగ్గర నుంచి.. నేటి చంద్రబాబు వరకు సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ గురించి మాట్లాడాల్సి వస్తే.. తెలుగుదేశం పార్టీకి ముందు.. ఆ తర్వాత అనే విధంగా ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. జగన్ హయాంలో ఇరిగేషన్ శాఖను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. రూ.18 వేల కోట్ల అప్పులు మిగిల్చారని మండిపడ్డారు. హంద్రీనీవా రాయలసీమ జీవనాడి అని.. అలాంటి హంద్రీనీవా గత ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదని అన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫేజ్?1ను పూర్తి చేసి.. 727 కిలోమీటర్లకు సీఎం చంద్రబాబు కృష్ణ జలాలను తీసుకువెళ్లారని ప్రస్తావించారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్లు ప్రమాదభరితంగా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తే.. గొడ్డలిపార్టీ కనీసం పట్టించుకోలేదని మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. 2024లో తుంగభద్ర ప్రాజెక్టులోని 19వ గేటు కొట్టుకుపోతే కర్ణాటక ప్రభుత్వం కూడా ఏం చేయలేక పోయిందని చెప్పారు. సీఎం చంద్రబాబు అప్పటికప్పుడు జలాశయాల ఇంజినీరింగ్ నిపుణుడు కన్నయ్యనాయుడుకి ఫోన్ చేశారని వివరించారు. వరద కొనసాగుతుండగానే గేటు పునర్నిర్మాణం చేసి 80 టీసీఎంల నీటిని సముద్రం పాలు కాకుండా చూశారని అన్నారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకుంటున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అదే రాయలసీమకు ఎందుకు గొడ్డలి పోటు వేశారో సమాధానం చెప్పాలని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు.

## ఢిల్లీలో మండుతున్న ఎండలు..

**సోలార్ హట్స్ ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం**

దేశ రాజధాని ఢిల్లీలో ఎండలు మండుతున్నాయి. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఎండలకు తాళలేకపోతున్నారు. మరోవైపు ఎండలో బయటకు వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రజలకు ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ నగరంలో సోలార్ హట్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. స్థానిక షాలిమార్ బాగ్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద వీటిని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయబోతున్నారు. దీని గురించి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లదనాన్ని అందించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి అన్నివైపులా గడ్డిని ఏర్పాటు చేస్తారు. స్ప్రింక్లర్ సిస్టమ్ కూడా ఉండటం వల్ల లోపల అంతా చల్లదనాన్ని పరుచుకుంటుంది. ప్రజలకు దీనివల్ల నీడతోపాటు చల్లదనం లభిస్తుంది. ఇది సోలార్ శక్తి మీద నడుస్తుంది. ఈ హట్స్‌లో ప్రజలు ఎండ సమయంలో విశ్రాంతి తీసుకోవచ్చు. పౌరులు లోపల కూర్చోవడానికి సీటింగ్ ఏర్పాట్లు ఉంటాయి. అలాగే, చల్లటి మంచి నీరు అందుబాటులో ఉంటుంది. ఫోన్ ఛార్జింగ్ సౌకర్యం కూడా కల్పిస్తారు. ఈ హట్స్ పైన సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయడం వల్ల దీన్నుంచే విద్యుత్ సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం ఈ హట్ నిర్మాణ దశలో ఉంది. రెండు, మూడు రోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీన్ని సీఎం రేఖా గుప్తా ప్రారంభిస్తారు. ఢిల్లీ వ్యాప్తంగా మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కలిగించేందుకు కూలింగ్ జోన్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా కూలీలు, పాదచారులు, ప్రయాణికులకు దీనివల్ల ప్రయోజనం ఉంటుందని ప్రభుత్వ ఆలోచన. ప్రస్తుతం దీనికి ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చి, మంచి ఫలితం ఉంటే నగరవ్యాప్తంగా వీటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆలోచన.

## రైతుగా మారిన టెక్కీ

**పిడుగుపాటుకు గురై హఠాన్మరణం**

బెంగళూరు,మే28 : సాఫ్ట్‌వేర్ జాబ్‌ను వదిలి వ్యవసాయ రంగంలోకి దిగిన ఒక వ్యక్తి పొలంలో పిడుగుపాటుకు గురై మరణించాడు. ఈ విషాద ఘటన బుధవారం కర్ణాటకలో చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, మడికేరి టౌన్‌కు చెందిన రోషన్ బాలకృష్ణ ఇటీవలే సాఫ్ట్‌వేర్ జాబ్‌కు రాజీనామా చేసి వ్యవసాయ రంగంలోకి దిగారు. తన స్నేహితుడితో కలిసి పనిచేస్తున్నారు. వ్యవసాయ యంత్రాల మార్కెటింగ్ కూడా చేస్తున్నారు. ఈ క్రమంలో తన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు నిర్ణయించిన ఆయన మైసూరులోని ఒక పొలాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. ఆయన వెంట భార్య, కొడుకు కూడా వెళ్లారు. ఈ క్రమంలో పొలం సమీపంలోని చెట్టు నుంచి మామిడి పండును ఆయన కోసేందుకు ప్రయత్నిస్తుండగా పిడుగు పడింది. దీంతో, కుప్పకూలిన రోషన్ ఘటనా స్థలంలోనే మరణించారు. ఈ ఘటనలో మరో వ్యక్తి కూడా స్వలంగా గాయపడ్డారు. బాధిత కుటుంబానికి జిల్లా విపత్తు నిర్వహణ విభాగం రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించింది. ఇందులో రూ.4 లక్షలు రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధి నుంచి, మిగతా మొత్తం కేంద్ర ప్రభుత్వ నిధి నుంచి బాలకృష్ణ కుటుంబానికి అందజేయనున్నారు.

## నాలుగు రాష్ట్రాలకు బిజెపి అధ్యక్షుల నియామకం

న్యూఢిల్లీ,మే28 : భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. ఈ మేరకు గురువారం పంజాబ్, హరియాణా, ఢిల్లీ, త్రిపుర రాష్ట్ర విభాగాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ వివరాలు వెల్లడించింది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి హర్ష్ మల్హోత్రాను నియమించింది. పంజాబ్ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు కేవల్ సింగ్ ధిల్లాన్ పేరును ప్రకటించింది. హరియాణా అధ్యక్షురాలిగా అర్చనా గుప్తాను, త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా అభిషేక్ దేబ్‌రాయ్‌ను నియమించింది. తొలిసారి ఎంపీ అయిన హర్ష్ మల్హోత్రాకి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేంద్ర మంత్రి పదవి ఇచ్చింది. ప్రస్తుతం ఆయన కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రిగా పని చేస్తున్నారు. తూర్పు ఢిల్లీ నియోజకవర్గానికి హర్ష్ మల్హోత్రా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దేశ రాజధానిలో బీజేపీని క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసేందుకు మల్హోత్రాను అధ్యక్షుడిగా ప్రకటించారు.

# రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సహకారం తప్పనిసరి

**ఇది గుర్తించి అడుగులు వేసిన నేత చంద్రబాబు**

**కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరంకు మహర్దశ**

**కేంద్ర సాయంపై మహానాడులో కేంద్రమంత్రి పెమ్మసాని**



అమరావతి,మే28 : రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందాలంటే కేంద్రం సహకారం తప్పనిసరి అని నమ్మిన నాయకుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతి కోసం రూ.15,000 కోట్లు కేంద్ర బ్జడెట్‌లో కేటాయించిందని వివరించారు. చరిత్రలో ఎవరూ కదిలించలేని విధంగా రాజధాని అమరావతికి చట్టబద్ధత తీసుకొచ్చామని గుర్తు చేశారు. గురువారం టీడీపీ మహానాడులో రాష్ట్రానికి కేంద్ర సహాయం అనే తీర్మానంపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. రెండేళ్లలో రూ.20,000 కోట్ల రైల్వే ప్రాజెక్టులు రాష్ట్రానికి తీసుకొచ్చామని పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు. 316 ఆర్వోబీ పాంట్లు,16 వందే భారత్ రైళ్లు, 73 అమృత్ భారత్ స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.2,500 కోట్లతో అమరావతిలో రైల్వే ప్రాజెక్టు, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ సాధించామని చెప్పారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఆ ఐదేళ్లలో భోగాపురం ఎయిర్ పోర్టు కోసం కేవలం రూ.600 కోట్లు ఖర్చు చేస్తే... కూటమి ప్రభుత్వం రూ.4,000 కోట్లు ఖర్చు చేసి ప్రారంభానికి సిద్ధం చేసిందని వివరించారు. పూర్వోదయ పథకం కింద రాయలసీమలో రూ.40 వేల కోట్లతో హార్టీకల్చర్ హబ్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. గూగుల్ నుంచి గ్రీన్ హైడ్రోజన్ వరకు ఆంధప్రదేశ్ ప్రత్యేక ముద్ర వేసిందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు కోసం కేంద్రం రూ.11,400 కోట్లు సాయం చేసిందని వివరించారు. ఉక్కును కరిగించవచ్చు కానీ.. ఆంధ్రుల సంకల్పాన్ని వైఎస్ జగన్ కరిగించలేదన్నారు. సంకెళ్లతో అమరావతిని గొడ్డలి పార్టీ బంధిస్తే.. సంకల్పంతో అమరావతిని సాధించామని స్పష్టం చేశారు. గోదావరి నీళ్లు సముద్రంలో కాకుండా రైతు జీవితాల్లో కలవాలనే లక్ష్యంతో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తున్నామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. 2014–19లోనే పోలవరం పనులు 70 శాతం పూర్తి చేశామని.. కానీ గత వైసీపీ ప్రభుత్వం కేవలం 5 శాతం పనులు మాత్రమే చేసిందని సోదాహరణంగా ఆయన వివరించారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి 30 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు.నాడు పంచాయతీ రాజ్ శాఖమంత్రిగా నారా లోకేశ్.. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయడానికి ఎంతో కృషి చేశారని పెమ్మసాని చంద్రశేఖర్ గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం పథకాలు సద్వినియోగ పరుచుకోవడంలో విఫలమయిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ హయాంలో రూ.12,000 కోట్లు చెల్లించి సుమారు 82 కేంద్ర పథకాలను పునరుద్ధరిం చామని వివరించారు. అమృత్ స్కీమ్ కింద కొత్తగా 2 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లు ఇచ్చామన్నారు. నీళ్లు అందించడం సంక్షేమం కాదని.. ప్రభుత్వాల బాధ్యత అని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గుర్తించలేక పోయారని పేర్కొన్నారు.

## మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు, బూతునాడు

**టీడీపీని చెప్పల పార్టీ, వెన్నుపోటు పార్టీ, దొంగల పార్టీ**

**తల్లి, చెల్లి, గొడ్డలి అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు**

**తెలుగుదేశంపై మాజీమంత్రి రోజా ఘాటు విమర్శలు**

తిరుపతి,మే28 : తెలుగుదేశం పార్టీ, మహానాడుపై మాజీ మంత్రి, వైసీపీ నేత ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు .. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆమె.. టీడీపీ, సీఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.. టీడీపీ నిర్వహిస్తున్న మహానాడును లక్ష్యంగా చేసుకుని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. టీడీపీ ఒక 'బోగస్ పార్టీ' అంటూ వ్యాఖ్యానించిన రోజా, ఆ పార్టీకి కోటి మంది సభ్యులు ఉన్నారని చెప్పుకుంటున్నప్పటికీ మహానాడును చూస్తే రాష్ట్రంలో ఎక్కడా ఉత్సాహం కనిపించడం లేదన్నారు. మహానాడు అట్టర్ ఫ్లాప్ అయ్యింది. అందుకే రికార్డ్ డ్యాన్సులు వేసి పార్టీ క్యాడర్‌ను కూర్చోబెడుతున్నారని అంటూ ఎద్దేవా చేశారు. మహానాడును ఉద్దేశించి 'ఇది మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు, భూతునాడు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సూపర్ సిక్స్ హామీల గురించి ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పకుండా తల్లి, చెల్లి, గొడ్డలి అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇక, చంద్రబాబు.. హెరిటేజ్ ఆస్తుల్లో తన తల్లి, చెల్లికి ఎంత ఆస్తులు ఇచ్చారో చెప్పగలరా అని రోజా ప్రశ్నించారు. వాళ్లు ఎక్కడ ఉన్నారో కూడా ప్రజలకు తెలియదు. తల్లికి, చెల్లికి సహాయం చేసినట్టు ఒక్క ఫోటో అయినా చూపించగలరా అని విమర్శించారు. ఈ దేశంలో జగన్ తన చెల్లికి ఇచ్చినంత ఆస్తులు మరెవ్వరూ ఇవ్వలేదని రోజా వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసుపై కూడా రోజా స్పందించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే వివేకా హత్య జరిగిందని గుర్తుచేస్తూ, అప్పట్లో నిందితులను ఎందుకు పట్టుకోలేకపోయారని ప్రశ్నించారు. వివేకా కేసులో నిందితుడైన దస్తగిరికి టీడీపీ మద్దతు ఇస్తోందని ఆరోపించారు. చంద్రబాబు కేసులు వాదించే లాయరే ప్రస్తుతం దస్తగిరికి లాయర్‌గా ఉన్నారని పేర్కొన్నారు. టీడీపీని చెప్పుల పార్టీ, వెన్నుపోటు పార్టీ, దొంగల పార్టీ అంటూ రోజా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించారని, వెన్నుపోటు పొడిచారని, ఆయన పార్టీని దొంగతనంగా లాక్కున్నారని ఆరోపించారు. పెద్ద ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు. చిన్న ఎన్టీఆర్‌కు లోకేష్ వెన్నుపోటు పొడవలేదా? అంటూ ప్రశ్నించారు. అలాగే పవన్ కల్యాణ్ తల్లిని తిట్టించింది కూడా లోకేష్ కాదా అని ప్రశ్నించారు. మరోవైపు.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తామని లోకేష్ చెబుతున్నారని, అయితే అది కేవలం డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమేనని రోజా విమర్శించారు. టీడీపీకి నిజంగా దమ్ముంటే మహానాడులో 33 శాతం మహిళా రిజర్వేషన్‌పై తీర్మానం చేయాలి. బీజేపీ మహిళా బిల్లును అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని కూలదోస్తామని చెప్పగలరా?' అని ఆమె సవాల్ విసిరారు. జగన్ ఇప్పటికే 2023 అసెంబ్లీలో మహిళా బిల్లుపై తీర్మానం చేశారని, స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఎప్పుడో ప్రకటించారని రోజా తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి టీడీపీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని రోజా ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరలను చంద్రబాబు అడ్డదిడ్డంగా పెంచుతున్నారని విమర్శించారు. పేదలు ఎక్కువ మంది పిల్లలను కనాలని చెప్పే చంద్రబాబు, తన కుటుంబంలో మాత్రం ఒక్కో పిల్లవాడినే కనారని ఎద్దేవా చేశారు. లోకేష్‌పై కూడా రోజా తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, 'జూమ్ మీటింగ్‌లో కొడాలి నాని, వల్లభనేని వంశీ వస్తే భయపడి పారిపోయిన వ్యక్తి లోకేష్' అని విమర్శించారు. అలాగే జగన్ పీఏ కేఎన్‌ఆర్‌ను విచారణ పేరుతో వేధిస్తున్నారని ఆరోపిస్తూ, వైసీపీ నేతలపై కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయని రోజా మండిపడ్డారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**గొల్లపూడిలో ఎన్టీఆర్ విహానికి దేవినేని నివాళి**

**ఆత్మగౌరవాన్ని పరిచయం చేసిన మహానేత అని అంజలి**

విజయవాడ,మే28 : మాజీ సీఎం నందమూరి తారక రామారావు 103వ జయంతిని గొల్లపూడిలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొని నివాళులు అర్పించారు. ఎన్టీఆర్‌కు పూలమాలవేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దేవినేని ఉమ మాట్లాడారు. ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు ఎన్టీఆర్ అని కీర్తించారు. రాముడుగా, కృష్ణుడుగా చెరగని ముద్ర వేసి రాజకీయ రంగంలో ధ్రువతారగా వెలిగారని ప్రశంసించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ 'ఆత్మగౌరవాన్ని' పరిచయం చేసిన ధీరుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కేవలం పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడని ఉద్ఘాటించారు. టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయకత్వంలో పార్టీని కాపాడి.. 44 ఏళ్లుగా బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నారని దేవినేని ఉమ వ్యాఖ్యానించారు. 1994లో ఎన్టీఆర్ నాయకత్వంలో టీడీపీ ఘన విజయం సాధించడంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. 'మీకోసం వస్తున్నా' పాదయాత్రతో చంద్రబాబు ప్రజల్లోకి వెళ్లి 2014లో టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చారని ప్రస్తావించారు. అసత్య ప్రచారాలతో వచ్చిన వైసీపీని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని విమర్శించారు. గుడివాడ వైసీపీ నేతలు ఇప్పటికీ అడ్డూ అదుపూ లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మహిళలను అవమానించిన, దుర్భాషలాడిన వైసీపీ నేతలకు ప్రజలే గట్టి బుద్ధి చెప్పారని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందని ఉద్ఘాటించారు. కూటమి ప్రభుత్వం 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి.. 23 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు వెళ్తోందని దేవినేని ఉమ తెలిపారు. ఎన్టీఆర్ ఆత్మగౌరవ నినాదాన్ని, చంద్రబాబు ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచవ్యాప్తంగా తెలుగు జాతికి చాటారని వెల్లడించారు. యువగళం ద్వారా లోకేశ్ మూడోతరం నాయకత్వాన్ని నిరూపించుకుని పార్టీని విజయపథంలో నడిపిస్తున్నారని చెప్పారు. నందమూరి బాలకృష్ణ హిందూపురంలో అభివృద్ధి పనులు, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా మరిన్ని సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. నారా భువనేశ్వరి ఆధ్వర్యంలోని ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్య, ఆరోగ్యం, బ్లడ్ బ్యాంక్, సంజీవని వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సమన్వయంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తోందని దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

## మధుబని రైల్వే స్టేషన్‌లో ప్రమాదం

పాట్నా,మే28 : బీహార్ మధుబని రైల్వే స్టేషన్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. జయనగర్–ఉద్నా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రైలు అగ్నిప్రమాదానికి గురైంది. ఓ ఖాళీ బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే బోగీ మొత్తం మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ప్లాట్‌ఫామ్ నంబర్–3పై షంటింగ్ పనుల నిమిత్తం రైలు నిలిచి ఉన్న సమయంలో ప్రమాదం జరిగింది. దీంతో అధికారులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మధుబని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో భయాందోళనలు నెలకొన్నాయి. రైల్వే సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సుమారు పది అగ్నిమాపక వాహనాలు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాయి. గంటపాటు శ్రమించి వారు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంపై సమస్తిపూర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ జ్యోతి ప్రకాశ్ మిశ్రా స్పందించారు. రైల్వే యంత్రాంగం ప్లాట్‌ఫామ్ ప్రాంతాన్ని ఖాళీ చేయించి విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో అసాంఘిక శక్తుల ప్రమేయంపైనా ఆరా తీస్తున్నట్లు జ్యోతి ప్రకాశ్ మిశ్రా చెప్పారు. ఇదిలా ఉండగా.. 2022లో అదే ఎ÷–లాట్‌ఫామ్‌పై నిలిచి ఉన్న స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురై ఐదు కోచ్‌లు దహనమయ్యాయి.

## ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి

**నివాళి అర్పించిన టిడిపినేతలు, కుటుంబ సభ్యులు**

హైదరాబాద్,మే28 : దివంగత మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, తెలుగు ప్రజల ఆరాధ్య నాయకుడు, సినీ దిగ్గజం నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్ సమీపంలోని ఎన్టీఆర్ ఈరోజు (గురువారం) ఆయనకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు, సినీ ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. కటుఉంబ సభ్యులు పలుఉవరు వచ్చి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ ఉదయం సుమారు 6 గంటల ప్రాంతంలో ఎన్టీఆర్ గార్డెన్‌కు చేరుకుని, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి వినమ్రంగా నమస్కరించారు. జూనియర్ ఎన్టీఆర్ రాకతో అక్కడ ఒక్కసారిగా అభిమానుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. తెల్లవారుజామునే భారీ సంఖ్యలో అభిమానులు ఎన్టీఆర్ గా÷–డ్గ÷న్ వద్దకు చేరుకొని తమ అభిమాన నటుడిని చూసేందుకు పోటీ పడ్డారు. 'జై ఎన్టీఆర్ అంటూ అభిమానుల నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు అభివాదం చేస్తూ కాసేపు అక్కడ గడిపారు. ఆయన రాకతో ఎన్టీఆర్ జయంతి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడింది. జూనియర్ ఎన్టీఆర్ రావడంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అభిమానుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ట్యాంక్ బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేశారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత అని టీడీపీ నేతలు కొనియాడారు. సినీరంగంలో ఎన్నో చారిత్రక పాత్రలు పోషించి కోట్లాది అభిమానులను సంపాదించు కున్నారని కీర్తించారు. రాజకీయాల్లో కూడా తనదైన ముద్ర వేశారని ప్రశంసించారు. తెలుగుదేశం పార్టీ స్థాపించి ప్రజలకు సంక్షేమ పాలన అందించిన నాయకుడిగా ఎన్టీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందని వ్యాఖ్యానించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏడాది జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని టీడీపీ నేతలు తెలిపారు. ఏడాది 103వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌తో పాటు ఆంధప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నామని చెప్పారు. పేదలకు అన్నదానాలు, రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేశామని టీడీపీ నేతలు వివరించారు. ఈ సందర్భంగా అభిమానులు ఎన్టీఆర్ సేవలను, జ్ఞాపకాలను పంచుకుంటున్నారు. నివాళి అర్పించన వారిలో నారా భువనేశ్వరి, నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు ఒకప్పటి టిడిపి నేతలు నాగం జనార్ధన్ రెడ్డి,మోత్కుపల్లి నర్సింహులు, పెద్దిరెడ్డి, మండవ వెంకటేశ్వర రావు తదితరులు నివాళి అర్పించారు.

## పూర్తి కావచ్చిన కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్

ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ఇక్కడే: అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ,మే28 : కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని చెప్పారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై అశ్వినీ వైష్ణవ్ కీలక సమీక్ష నిర్వహించారు. రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్ 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేస్తుందన్నారు. వీటిని దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు రైల్వే మంత్రి తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇంటర్ సిటీ రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్‌తో రూపొందుతాయి. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఉంటాయి. వీటిలో సురక్షితమైన కోచ్ డిజైన్, ఆధునిక సౌకర్యాలు అమర్చుతాం. ఈ రైళ్లు గంటకు 130 కి.మీ వేగంతో ప్రయాణించేలా రూపొందిస్తాం. వీటిలో రీజనరేటివ్ బ్రేకింగ్ కూడా ఉంటుంది. రైలు బ్రేకులు వేసినప్పుడు అది విద్యుత్ జనరేటర్‌గా మారి, పునరుత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే అధునాతన పరిజ్ఞానంతో తయారు చేస్తున్నాం అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.



# సందీప్ సినిమాల్లో హీరోయిన్లది భావోద్వేగ పాత్ర

## స్పిరిట్‌లోనూ అదే కనిపిస్తుందనన్న దర్శకుడు హేమంత్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'స్పిరిట్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండటంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. అయితే తాజాగా ప్రముఖ దర్శకుడు హేమంత్ మధుకర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో హీరోయిన్ పాత్రల గురించి మాట్లాడిన హేమంత్ మధుకర్.. ఆయన సినిమాల్లో కనిపించే రొమాంటిక్ సన్నివేశాలను చూసి హీరోయిన్లకు కేవలం గ్లామర్ పాత్రలే ఉంటాయని అనుకోవడం తప్పని అన్నారు. సందీప్ తన కథల్లో మహిళా పాత్రలను చాలా బలంగా, భావోద్వేగాలకు దగ్గరగా రాస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'అర్జున్ రెడ్డి'లో శాలినీ పాండే పోషించిన ప్రీతి పాత్రను, అలాగే 'యానిమల్'లో రష్మిక మందన్న చేసిన గీతాంజలి పాత్రను ఉదాహరణగా చెప్పారు. ఆ పాత్రలు కేవలం హీరోకు జోడీగా మాత్రమే కాకుండా కథలో కీలకమైన భావోద్వేగ బలాన్ని ఇచ్చాయని అన్నారు. త్రిప్తి దిమ్రి ఎంపికపై కూడా హేమంత్ స్పందించారు. నటీనటుల మధ్య పోలికలు పెట్టడం సరికాదని, ప్రతి పాత్రకు తగిన నటుడిని లేదా నటిని దర్శకుడు ఎంపిక చేస్తాడని చెప్పారు. 'స్పిరిట్'లోని పాత్రకు త్రిప్తి దిమ్రి పూర్తిగా సూట్ అవుతుందని భావించి సందీప్ ఆమెను ఎంపిక చేశారని వెల్లడించారు. అంతేకాదు, ఈ సినిమాలో త్రిప్తి నటన ప్రేక్షకుల అంచనాలను మించేలా ఉంటుందని హేమంత్ మధుకర్ ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే 'యానిమల్' సినిమాతో త్రిప్తి దిమ్రికి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పుడు ప్రభాస్ సరసన 'స్పిరిట్'లో నటించడం ఆమె కెరీర్‌లో మరో కీలక మలుపుగా మారనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక 'స్పిరిట్' సినిమా విషయానికి వస్తే.. ఇది పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ప్రభాస్ ఓ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సందీప్ రెడ్డి వంగా స్టైల్‌లో యాక్షన్, ఎమోషన్, ఇంటెన్స్ డ్రామాతో ఈ సినిమా రూపొందనుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం.





# నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చేసిన ధనుష్ కర

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన లేటెస్ట్ హీస్ట్ థ్రిల్లర్ మూవీ 'కర' తాజాగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లలో విడుదలైనప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రేక్షకాదరణ పొందలేకపోయింది. మంచి అంచనాల మధ్య రిలీజ్ అయిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మాత్రం పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది. ఇప్పుడు ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ నెట్‌ఫ్లిక్స్‌లో డిజిటల్ స్ట్రీమింగ్ జరుపుకుంటుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. అలాగే ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో కూడా స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో ఈ సినిమాను వీక్షించే అవకాశం దక్కింది. 'కర' సినిమాలో ధనుష్ తనదైన స్టైల్‌లో ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. హీస్ట్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో సస్పెన్స్, యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌ను మిళితం చేస్తూ దర్శకుడు విఘ్నేష్ రాజా కథను రూపొందించారు. అయితే కథనం నెమ్మదిగా సాగడం, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను పూర్తిగా ఎంగేజ్ చేయలేకపోవడం వంటి కారణాలతో థియేటర్లలో ఈ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ చిత్రంలో 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజు హీరోయిన్‌గా నటించింది. ధనుష్‌తో ఆమె కెమిస్ట్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే ప్రముఖ నటులు సూరజ్ వెంజరాముడు, కేఎస్ రవికుమార్, జయరామ్ కీలక పాత్రల్లో కనిపించారు. వీరి నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. ముఖ్యంగా థ్రిల్లింగ్ సన్నివేశాల్లో ఆయన సంగీతం సినిమాకు మరింత ఉత్కంఠను తీసుకువచ్చింది.




# సింగిల్ మదర్‌గా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా

## మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్

24 ఏళ్ల వయసులో పెద్ద కుమార్తె రెనీని దత్తత తీసుకున్నప్పుడు ఎదుర్కొన్న విమర్శలను, ఇబ్బందులను బాలీవుడ్ నటి, మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్ తాజాగా గుర్తుచేసుకుంది. ఒక సింగిల్ మదర్‌గా తల్లి కావాలనే తన నిర్ణయం వల్ల కెరీర్ ముగిసిపోతుందని అందరూ భావించారని, చివరికి తన మేనేజర్ కూడా తనను వదిలేసి వెళ్లిపోయాడని ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సుస్మితా సేన్ మాట్లాడుతూ.. 'నేను రెనీని దత్తత తీసుకున్నప్పుడు నా మేనేజర్ నన్ను వదిలి పారిపోయాడు. 'నీకు కెరీర్ పట్ల సీరియస్ నెస్ లేదు.. 24 ఏళ్లకే తల్లి అయిన వ్యక్తికి నేను మేనేజర్‌గా ఉండలేను' అని చెప్పాడు. అంతేకాదు, ఇకపై నాకు హీరోయిన్‌గా అవకాశాలు రావని, కేవలం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానే మిగిలిపోతానని చాలామంది హెచ్చరించారు అని సుస్మితా చెప్పుకొచ్చింది. అయితే తనకు పరిశ్రమ నుంచి ఎలాంటి మద్దతు లభించనప్పటికీ, మాతృత్వమే తనను మరింత బలోపేతం చేసిందని సుస్మితా చెప్పారు. కూతురు వచ్చిన తర్వాతే నా కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్ సినిమాలు ఇచ్చాను. రెనీని దత్తత తీసుకున్న తర్వాత 'ఆంఖే', 'మై హూ నా', 'మైనే ప్యార్ క్యూ కియా' వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించాను. ఇటీవలి కాలంలో 'ఆర్య' వెబ్ సిరీస్, 'తాలి' బయోపిక్‌లతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కూడా తన నటనతో అలరించాను అంటూ సుస్మితా చెప్పుకొచ్చింది. ఇక సుస్మితా సేన్ జీవితంలో మాతృత్వానికి ఎప్పుడూ మొదటి స్థానమే ఉంటుంది. 2010లో ఆమె 'అలీషా' అనే మరో అమ్మాయిని కూడా దత్తత తీసుకున్నారు. వీరిద్దరితో కలిసి తనదైన ఒక అందమైన ప్రపంచాన్ని నిర్మించుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. సుస్మితా పెద్ద కుమార్తె రెనీ కూడా ప్రస్తుతం యాక్టింగ్ రంగంలోకి అడుగుపెట్టారు. భయం లేకుండా, ఒదిగి ఉండటాన్ని తన తల్లి నుంచే నేర్చుకున్నానని రెనీ పలు సందర్భాల్లో చెప్పారు. 1994లో మిస్ యూనివర్స్ కిరీటాన్ని గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించిన సుస్మితా సేన్, ఆ తర్వాత తన వ్యక్తిగత నిర్ణయాలపై వచ్చిన విమర్శలను ఏమాత్రం లెక్కచేయకుండా, అనుకున్నది సాధించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు.

# కరుప్పు..మొదటి హీరో విజయే

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రాజకీయాల్లోకి వెళ్లేముందు ఆయన చివరి చిత్రంగా 'కరుప్పు' సినిమాను చేయాల్సిందని.. కానీ కొన్ని కారణాల వల్ల ఆయన ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకోవడంతో, ఈ అవకాశం హీరో సూర్యను వరించిందని దర్శకుడు ఆర్జే బాలాజీ తెలిపాడు. విజయ్ రాజకీయాల్లోకి వచ్చే ముందు ఎలాంటి సినిమా చేయాలనే దానిపై తాము రెండు మూడు సార్లు సమావేశమై చర్చించామని బాలాజీ చెప్పారు. అయితే విజయ్ ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నా, ఆయన చెప్పిన కారణాలు సమంజసంగానే ఉన్నాయని, ఆయన నిర్ణయాన్ని తాను గౌరవించానని తెలిపారు. అంతేకాదు, కథా చర్చల సమయంలో విజయ్ అడిగిన సరైన ప్రశ్నలే స్క్రిప్ట్‌ను మరింత మెరుగు పరచడానికి సహాయపడ్డాయని, అందుకే సినిమా ప్రారంభ క్రెడిట్స్‌లో విజయ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపానని బాలాజీ పేర్కొన్నారు. ఆ తర్వాత నిర్మాతల కోరిక మేరకు ఈ కథను సూర్యకు వినిపించగా, ఆయనకు బాగా నచ్చి కొన్ని మార్పులు సూచించారు. అలా సూర్య హీరోగా 'కరుప్పు' సినిమా పట్టాలెక్కింది. తమిళ గ్రామదేవుడు 'కరుప్పసామి'.. అవినీతిపై పోరాడేందుకు ఒక లాయర్ అవతారంలోకి మారే ఫాంటసీ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కింది. సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం మే 15, 2026న థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. సినిమా చూసిన తర్వాత ముఖ్యమంత్రి విజయ్ స్వయంగా చిత్రబృందాన్ని ఫోన్ చేసి అభినందించడం విశేషం.



# చిన్న నిర్మాతలను పట్టించుకోవడం లేదు

## నిర్మాత ధీరజ్ మొగిలినేని ఆసక్తికర వ్యాఖ్యలు

టాలీవుడ్‌లో ఇటీవల నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య కొనసాగుతున్న 'పర్సంటేజ్ విధానం' వివాదం పెద్ద చర్చగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు స్టార్ నిర్మాతలు కలిసి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాజమండ్రిలో కలవడం ఇండస్ట్రీలో ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ భేటీపై ఇప్పుడు నిర్మాత ధీరజ్ మొగిలినేని ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నాగవంశీ, ఫైన్ స్క్రీన్స్ సాహు గారపాటి, వృద్ధి సినిమాస్ వెంకట్ సతీశ్ కిలారు, ఎస్ఎల్వీ సినిమాస్ చెరుకూరి సుధాకర్ తదితర ప్రముఖ నిర్మాతలు పవన్ కళ్యాణ్‌తో సమావేశమయ్యారు. చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలు, ముఖ్యంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లలో 'పర్సంటేజ్ విధానం' అంశంపై చర్చించినట్లు సమాచారం. అయితే ఈ భేటీలో చిన్న, మీడియం రేంజ్ నిర్మాతలకు ప్రాతినిధ్యం లభించలేదని నిర్మాత ధీరజ్ మొగిలినేని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో జరిగిన 'సమ్మర్ హాలిడేస్' సినిమా టీజర్ లాంచ్ కార్యక్రమంలో ఆయన ఈ విషయంపై స్పందించారు.'మాకు కూడా చాలా సమస్యలు ఉన్నాయి. రూ.100 కోట్లకు పైగా బడ్జెట్‌తో సినిమాలు తీసే పెద్ద నిర్మాతల సమస్యలు వేరు. చిన్న, మీడియం రేంజ్ సినిమాలు నిర్మించే నిర్మాతల సమస్యలు మరోలా ఉంటాయి. పవన్ కళ్యాణ్ గారిని కలిసేందుకు వెళ్లినప్పుడు మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. మమ్మల్ని ఎవర్నీ పిలవలేదు. కేవలం వాళ్లే వెళ్లారు' అంటూ ధీరజ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన అభిప్రాయాన్ని వివరించేందుకు ఆయన ఆసక్తికర ఉదాహరణ కూడా చెప్పారు. 'జూబ్లీహిల్స్‌లో 1000 గజాల ప్లాట్‌లో రూ.10 కోట్లతో ఇల్లు కట్టుకునేవారి సమస్యలు ఒకలా ఉంటాయి. మణికొండలో 250 గజాల ప్లాట్‌లో ఇల్లు కట్టుకునేవాడి సమస్యలు మరోలా ఉంటాయి. ఇద్దరూ ఇళ్లే కడుతున్నారు కానీ పరిస్థితులు, అవసరాలు వేరు. అలానే పెద్ద సినిమాలు తీసేవారి సమస్యలు వేరు.. చిన్న నిర్మాతల సమస్యలు వేరు' అని వ్యాఖ్యానించారు. ఇక ప్రస్తుతం జరుగుతున్న పర్సంటేజ్ వివాదంలో చిన్న నిర్మాతల ఇబ్బందులను ఎవరూ సరిగా అర్థం చేసుకోవడం లేదని ధీరజ్ అన్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com

# క్రిస్ గేల్ వరల్డ్ రికార్డు బద్దలు కొట్టిన వైభవ్

# స్పోర్ట్స్

ఐపీఎల్ 2026 ఎలిమినేటర్ మ్యాచ్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పై రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్, 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత బ్యాటింగ్ తో హిస్టరీ క్రియేట్ చేశారు. ఈ మ్యాచ్ లో కేవలం 29 బంతుల్లోనే 12 సిక్సర్లు, 5 ఫోర్ల సాయంతో 97 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. ఈ ఇన్నింగ్స్ తో ఒకే ఐపీఎల్ సీజన్ లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ప్లేయర్‌గా వెస్టిండీస్ లెజెండ్ క్రిస్ గేల్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు. గేల్ 2012 సీజన్ లో 59 సిక్సర్లు కొట్టగా, సూర్యవంశీ ఆ మార్కును ఈజీగా దాటేశాడు. స్టేడియం స్క్రీన్ పై ఆయనను "యూనివర్స్ బేబీ బాస్" అని సంబోధించడం విశేషం. ఈ మ్యాచ్ లో సూర్యవంశీ కేవలం 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఐపీఎల్ నాకౌట్ లేదా ప్లేఆఫ్స్ హిస్టరీలో సురేష్ రైనా పేరిట ఉన్న ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డును ఆయన సమం చేశాడు. కేవలం ఒకే ఒక్క బంతి తేడాతో క్రిస్ గేల్ పేరిట ఉన్న ఐపీఎల్ ఫాస్టెస్ట్ సెంచరీ (30 బంతుల్లో) రికార్డును మిస్ చేసుకున్నాడు. 20 లోపు బంతుల్లో అత్యధిక సార్లు యాభై పరుగులు చేసిన జాబితాలో 5 సార్లతో నికోలస్ పూరన్ సరసన నిలిచాడు. అలాగే పవర్‌ప్లే లోనే అత్యధిక సిక్సర్లు (8 సిక్సర్లు) బాదిన సరికొత్త రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ 15 ఏళ్ల వండర్ కిడ్ అసాధారణ పర్ఫార్మెన్స్ చూసి ఆయనను సీనియర్ ఇండియన్ మెన్స్ టీమ్‌లోకి సెలెక్ట్ చేయాలనే డిమాండ్ క్రికెట్ వర్గాల్లో గట్టిగా




వినిపిస్తోంది. ఐపీఎల్ డెబ్యూ చేసిన ఏడాది లోపే ఈ రేంజ్ లో ఆడటంతో ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. వచ్చే నెలలోనే తిలక్ వర్మ కెప్టెన్సీలోని ఇండియా-ఎ టీమ్ తరఫున శ్రీలంకలో జరిగే ట్రై-సిరీస్ లో సూర్యవంశీ బరిలోకి దిగనున్నాడు. సూర్యవంశీ ఫ్యూచర్ పై ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ స్పందిస్తూ ఆయనను ఒక 'స్పెషల్ టాలెంట్' గా అభివర్ణించారు. భవిష్యత్తులో సూర్యవంశీ లాంటి ప్లేయర్లను బీసీసీఐ, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలు సరైన దారిలో గైడ్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేవలం ఫిజికల్ స్కిల్స్ మాత్రమే కాకుండా మెంటల్ టఫ్నెస్ కూడా స్పోర్ట్స్ లో చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ అద్భుతమైన టాలెంట్ రాబోయే రోజుల్లో టీమిండియా తరఫున ఎన్నో ఏళ్ల పాటు సేవలు అందించేలా తాము పూర్తి సపోర్ట్ అందిస్తామని ధుమాల్ కన్ఫర్మ్ చేశారు.




## క్వాలిఫైయర్ 2లో ఆరెంజ్ క్యాప్ కోసం పోటీ

ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంది. కేవలం రెండు మ్యాచ్‌ల ఫలితాలతో ఈ 19వ ఐపీఎల్ సీజన్ విజేత ఎవరో తేలిపోనుంది. ఒకవైపు డిఫెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి కప్పు కొట్టాలని చూస్తుంటే.. మరోవైపు రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ జట్లు ఫైనల్ చేరడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. టీమ్స్ మధ్య టైటిల్ ఫైట్ ఎలా ఉన్నా.. వ్యక్తిగతంగా ఆటగాళ్ల మధ్య అత్యధిక పరుగులు చేసిన వారికి ఇచ్చే ఆరెంజ్ క్యాప్ కోసం మాత్రం ఊహించని రేంజ్‌లో రసవత్తర పోరు సాగుతోంది. తాజా గణాంకాల ప్రకారం.. ఐపీఎల్ 2026 లో అత్యధిక పరుగుల వేటలో రాజస్థాన్ రాయల్స్ )కు చెందిన 15 ఏళ్ల సంచలన ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అందరినీ వెనక్కి నెట్టి మొదటి స్థానానికి దూసుకెళ్లాడు. గుజరాత్ టైటాన్స్ రన్ మెషిన్ సాయి సుదర్శన్‌ను వెనక్కి నెట్టి మరీ ఈ చిన్నోడు నెంబర్ వన్ సింహాసనాన్ని కైవసం చేసుకున్నాడు. మే 27న సన్‌రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌కు ముందు వైభవ్ సూర్యవంశీ ఆరెంజ్ క్యాప్ రేస్‌లో ఐదో స్థానంలో ఉన్నాడు. కానీ ఆ మ్యాచ్‌లో హైదరాబాద్ బౌలర్లను ఉతికి ఆరబెడుతూ కేవలం 29 బంతుల్లోనే 97 పరుగుల రికార్డు ఇన్నింగ్స్ ఆడాడు. ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆరెంజ్ క్యాప్ రేస్‌లో ఏకంగా ఒకేసారి పెద్ద జంప్ చేసి మొదటి స్థానాన్ని చేరుకున్నాడు. ఈ మ్యాచ్ కంటే ముందు అతని ఖాతాలో 583 పరుగులు ఉండగా.. ప్రస్తుతం 15 ఇన్నింగ్స్‌ల తర్వాత వైభవ్ సూర్యవంశీ మొత్తం 680 పరుగులతో టాప్‌లో నిలిచాడు. దీనితో ప్రస్తుతానికి ఆరెంజ్ క్యాప్‌ను తన తలపైనే ఉంచుకుని కింగ్‌లా నిలబడ్డాడు. వైభవ్ సూర్యవంశీ మొదటి స్థానంలో ఉన్నప్పటికీ ఆరెంజ్ క్యాప్ పోరు ఇంకా ముగిసిపోలేదు. గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్ 652 పరుగులతో వైభవ్‌కు అత్యంత సమీపంలో రెండో స్థానంలో ఉన్నాడు. కేవలం 28 పరుగుల తేడాతో వైభవ్ వెనుక ఉన్నాడు. హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ వంటి ఆటగాళ్లకు పెద్ద ఇన్నింగ్స్ ఆడి ఈ రేసులో నిలిచే అవకాశం ఉన్నప్పటికీ వారు ఫ్లాప్ అయ్యారు. దాంతో హైదరాబాద్ టోర్నీ నుండి నిష్క్రమించగా.. సాయి సుదర్శన్‌కు మాత్రం క్వాలిఫైయర్ 2 లో వైభవ్‌ను దాటేసే సువర్ణావకాశం లభించింది. సాయి సుదర్శన్ గత ఐపీఎల్ 2025 సీజన్లో కూడా ఆరెంజ్ క్యాప్ విన్నర్‌గా నిలిచాడనే విషయం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. 2025 లో అతను 15 ఇన్నింగ్స్‌లలో ఏకంగా 759 పరుగులు చేసి టోర్నమెంట్‌లో అత్యుత్తమ బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పుడు మళ్లీ ఐపీఎల్ 2026 లోనూ అదే మ్యాజిక్‌ను రిపీట్ చేస్తూ వరుసగా రెండోసారి ఆరెంజ్ క్యాప్ అందుకోవాలని సాయి సుదర్శన్ కసిగా ఉన్నాడు. మే 29న జరగబోయే క్వాలిఫైయర్ 2 మ్యాచ్‌లో రాజస్థాన్, గుజరాత్ జట్లు తలపడనున్న నేపథ్యంలో.. ఈ మ్యాచ్‌లోనే సాయి సుదర్శన్ వర్సెస్ వైభవ్ సూర్యవంశీ ఆరెంజ్ క్యాప్ క్లాష్ లైవ్‌గా చూడబోతున్నాం. రాజస్థాన్ వర్సెస్ గుజరాత్ మ్యాచ్ కేవలం ఫైనల్ బెర్త్ కోసమే కాదు.. ఆరెంజ్ క్యాప్ విన్నర్ ఎవరో డిసైడ్ చేయడానికి కూడా అత్యంత కీలకంగా మారింది. ఒకవేళ సాయి సుదర్శన్ ఈ మ్యాచ్‌లో 28 కంటే ఎక్కువ పరుగులు చేస్తే వైభవ్‌ను దాటేస్తాడు. అయితే రాజస్థాన్ ఓపెనర్ వైభవ్ కూడా అదే మ్యాచ్‌లో భారీ ఇన్నింగ్స్ ఆడితే సాయి సుదర్శన్‌కు అందనంత ఎత్తులో నిలుస్తాడు. 15 ఏళ్ల వయసులోనే వైభవ్ సూర్యవంశీ ఆరెంజ్ క్యాప్ గెలిచి చరిత్ర సృష్టిస్తాడా, లేక సీనియర్ ప్లేయర్ సాయి సుదర్శన్ తన అనుభవంతో వరుసగా రెండోసారి క్యాప్ కొడతాడా అనేది ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది.



## పరిస్థితులను అంచనా వేయకపోవడంతో భారీ మూల్యం

ఐపీఎల్ 2026 సీజన్‌లో లీగ్ దశ అంతా దూసుకెళ్లిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు.. ప్లేఆఫ్స్‌లో మాత్రం తీవ్ర నిరాశ కలిగించింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో 47 పరుగుల తేడాతో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. సీజన్ మొత్తం దూకుడైన ఆటతో టైటిల్ ఫేవరెట్‌గా గుర్తింపు పొందిన ఆరెంజ్ ఆర్మీ.. కీలక సమయంలో తడబడటం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ముఖ్యంగా జట్టు తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలు, బౌలింగ్ వైఫల్యం, టాప్ ఆర్డర్ కుప్పకూలడం ఈ ఓటమికి ప్రధాన కారణాలుగా కనిపించాయి. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఈ హై టెన్షన్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సన్‌రైజర్స్ కెప్టెన్ పాట్ కమిన్స్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే పిచ్ పరిస్థితులను సరిగా అంచనా వేయకపోవడం జట్టుకు భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. బ్యాటింగ్‌కు అనుకూలంగా మారిన పిచ్‌పై రాజస్థాన్ బ్యాటర్లు హైదరాబాద్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు. ప్రత్యేకంగా 15 ఏళ్ల యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ సంచలన ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులు చేసి హైదరాబాద్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతని ఇన్నింగ్స్‌లో 12 భారీ సిక్సర్లు, 5 ఫోర్లు ఉండటం విశేషం. మరోవైపు ధృవ్ జురెల్ అర్ధశతకంతో జట్టుకు బలమైన మద్దతు ఇచ్చాడు. ఈ ఇద్దరి దూకుడు కారణంగా రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 243 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. హైదరాబాద్ బౌలర్లు మ్యాచ్ మొత్తం లైన్ అండ్ లెంగ్త్ కోల్పోయి పరుగులు ధారాళంగా సమర్పించుకున్నారు. కెప్టెన్ పాట్ కమిన్స్ నాలుగు ఓవర్లలో వికెట్ తీయకుండానే 64 పరుగులు ఇచ్చాడు. సాకిబ్ హుస్సేన్ కూడా భారీగా పరుగులు సమర్పించాడు. ప్రఫుల్ హింగే మూడు వికెట్లు తీసినప్పటికీ అతని ఎకానమీ జట్టుకు నష్టం కలిగించింది. కీలక సమయాల్లో బౌలర్లు ఒత్తిడి సృష్టించలేకపోవడంతో రాజస్థాన్ స్కోరు అదుపుతప్పింది. 244 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్‌కు ఆరంభం నుంచే ఎదురుదెబ్బలు తగిలాయి. రాజస్థాన్ పేసర్ జోఫ్రా ఆర్చర్ పవర్‌ప్లేలోనే హైదరాబాద్ టాప్ ఆర్డర్‌ను కుదేలు చేశాడు. అభిషేక్ శర్మ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరగా, ట్రావిస్ హెడ్ కూడా త్వరగానే అవుటయ్యాడు. ఇషాన్ కిషన్ కొంతసేపు పోరాడినా పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. పవర్‌ప్లే ముగిసే సరికి 57 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోవడంతో హైదరాబాద్ పూర్తిగా ఒత్తిడిలో పడిపోయింది. తర్వాత మిడిల్ ఆర్డర్‌పై ఆశలు పెట్టుకున్న అభిమానులకు కూడా నిరాశే ఎదురైంది. హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి, సలీల్ అరోరా కొంత పోరాటం చేసినప్పటికీ భారీ లక్ష్యాన్ని ఛేధించేందుకు అవసరమైన భాగస్వామ్యాలు నెలకొల్పలేకపోయారు. రాజస్థాన్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ మ్యాచ్‌పై పట్టును మరింత బిగించారు. ఫలితంగా సన్‌రైజర్స్ 19.2 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ ఓటమితో సన్‌రైజర్స్ అభిమానుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. సోషల్ మీడియాలో జట్టుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లీగ్ దశలో అద్భుత ప్రదర్శన చేసిన జట్టు.. నాకౌట్ మ్యాచ్‌లో మాత్రం ఒత్తిడిని తట్టుకోలేకపోయిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. సరైన ప్రణాళిక లేకపోవడం, బౌలింగ్‌లో క్రమశిక్షణ లేకపోవడం, బ్యాటర్లు బాధ్యతగా ఆడకపోవడం కలిసి హైదరాబాద్ జట్టుకు భారీ నష్టాన్ని మిగిల్చాయి.




## సత్తా చాటిన భారత అథ్లెట్లు!

రత మహిళా షూటర్ ఈషా సింగ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. జర్మనీ వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) వరల్డ్?కప్? మ్యూనిచ్?లో ఈషా కొత్త బెంచ్? మార్క్ క్రియేట్ చేసింది. 25 మీటర్ల మహిళల పిస్టల్ ?ఈవెంట్?లో ఈషా 50కిగానూ 43 స్కోర్ చేసింది. ఈ ఈవెంట్?లో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. దీంతో సరికొత్త రికార్డుతోపాటు ఈషా స్వర్ణ పతకం గెలుచుకుంది. రెండో రోజు జరిగిన పోటీలో 21ఏళ్ల ఈషా, జర్మనీకి చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ డోరీన్ వానెకాంప్‌తో పోటీ పడింది. 5 పాయింట్ల తేడాతో ప్రత్యర్థిని ఓడించిన ఈషా గోల్డ్ పట్టేసింది. ఒలింపిక్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఈషా ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించింది. తొలి మూడు సిరీస్‌లలోనూ పర్ఫెక్ట్ స్కోర్లు సాధించి, ప్రత్యర్థులపై భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. ఈ క్రమంలోనే కిమ్ యే-జి (కొరియా) నెలకొల్పిన 42 పాయింట్ల ప్రపంచ రికార్డును ఈషా బద్దలు కొట్టింది. ఇక ఈ పోటీలో మూడో స్థానంలో నిలిచిన మిరోస్లావా (బల్గేరియా) మిన్‌చెవా కాంస్య పతకాన్ని గెలుచుకుంది. స్వర్ణ పతకం గెలిచిన తర్వాత ఇషా సింగ్ మాట్లాడుతూ, "నాకు మ్యూనిచ్ చాలా ముఖ్యమైనది. ఇక్కడ షూటింగ్ పోటీలలో పోటీ చాలా కఠినంగా ఉంటుంది. టాప్-8 లోకి రావడం అంత సులభం కాదు. నేను ఇక్కడికి రావడం ఇది మూడోసారి. అందుకే ఈసారి ఎలాగైనా గెలవాలని కోరుకున్నాను" అని తెలిపింది. అలాగే ఫైనల్ మ్యాచ్? సందర్భంగా ఒత్తిడి గురించి మాట్లాడుతూ, "నేను అస్సలు ప్రశాంతంగా లేను. ఒకానొక సమయంలో నా ఎడమ చేయి వణికింది. చాలా భయం వేసింది. కానీ మన క్రీడలో ఆ ఒత్తిడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. అనుభవం అంటే అదే" అని ఈషా పేర్కొంది. మరోవైపు భారత పారాఅథ్లెట్ సుమిత్ అంటిల్ కూడా రికార్డు సృష్టించాడు. బెంగళూరు వేదికగా జరుగుతున్న 8వ ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో, సుమిత్ క్రీడా ప్రపంచాన్ని నివ్వెరపరిచే అద్భుత ఘనతను అందుకున్నాడు. భారత ఈ స్టార్ జావెలిన్ త్రోయర్ తన కెరీర్‌లో ఏడోసారి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి, చరిత్ర పుటల్లో మరో సువర్ణ అధ్యాయాన్ని లిఖించాడు. బుధవారం శ్రీ కంఠీరవ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఖీ64 విభాగం పోటీలో 27ఏళ్ల సుమిత్ 74.82 మీటర్ల భారీ త్రో విసిరి వరల్డ్ రికార్డ్ నెలకొల్పాడు. పారా అథ్లెట్లలో ఇదే లాంగెస్ట్? త్రో. ఇదివరకు కూడా ఈ విభాగంలో అత్యధిక దూరం బల్లెం విసిరిన రికార్డు కూడా సుమిత్?పైనే ఉంది. 2023 ఆసియా పారా గేమ్స్‌లో అతడు 73.29 మీటర్ల దూరం విసిరి అప్పుడు రికార్డు కొట్టాడు. దీన్ని తాజాగా బ్రేక్ చేశాడు. అయితే 2019 నుంచి అతడు ఈ విభాగంలో వరుసగా ప్రపంచ రికార్డులను నెలకొల్పుతూనే ఉన్నాడు. 2019లో ఇటలీలో జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్‌తో సుమిత్ ప్రస్థానం ప్రారంభమైంది. అక్కడ అతను 61.32 మీటర్ల త్రో తో తొలిసారి ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఆ తర్వాత 2021లో జరిగిన టోక్యో పారాలింపిక్స్?లో స్వర్ణ పతకాన్ని గెలుచుకునే క్రమంలో మూడుసార్లు ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. ఆ పోటీలో సుమిత్ వరుసగా 66.95 మీటర్లు, 68.08 మీటర్లు, 68.55 మీటర్ల త్రోలు విసిరి చరిత్ర సృష్టించాడు. అదే సంవత్సరం ఆఖర్లో ఇండియన్ ఓపెన్‌లో 68.62 మీటర్ల త్రో తో మరో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఆపై 2023 హాంగ్‌జౌ ఆసియా పారా గేమ్స్‌లో 73.29 మీటర్ల త్రో తో సుమిత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. తాజాగా బెంగళూరులో 74.82 మీటర్ల దూరం విసిరి మళ్లీ తన రికార్డును తానే బద్దలు కొట్టాడు.

# ఐపీఎల్‌లో హనీ ట్రాప్ కలకలం..

ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న వేళ.. తెరవెనుక వివాదాలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా మీడియా సమావేశంలో ఉపయోగించిన హనీ-ట్రాప్ అనే పదం క్రికెట్ వర్గాల్లో పెద్ద దుమారానికి కారణమైంది. ఈ వ్యాఖ్యలు బయటకు రాగానే సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు షికారు చేశాయి. కొందరు ఆకతాయిలు ఏకంగా ఐపీఎల్ క్రికెటర్ల భార్యలు, పార్ట్‌నర్లను టార్గెట్ చేస్తూ ట్రోలింగ్, వేధింపులకు దిగడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ వివాదంపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ తాజాగా స్పందిస్తూ కీలక వివరణ ఇచ్చారు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్లో ఎలాంటి హనీ-ట్రాపింగ్ ఉదంతాలు తమ దృష్టికి రాలేదని ఆయన స్పష్టం చేశారు. ఐపీఎల్ అనేది అత్యంత పారదర్శకంగా, స్వచ్ఛంగా సాగుతున్న టోర్నమెంట్ అని, ఇలాంటి లేనిపోని పుకార్లను నమ్మవద్దని ఆయన అభిమానులను కోరారు. అయితే ఈ సీజన్లో ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్, ఫ్రాంచైజీల మేనేజ్‌మెంట్ వైపు నుంచి కొన్ని క్రమశిక్షణా ఉల్లంఘనలు, ప్రోటోకాల్ వివాదాలు జరిగిన మాట నిజమేనని బీసీసీఐ అంగీకరించింది. ఇలాంటి సంఘటనలను ముందే అరికట్టకపోతే టోర్నమెంట్‌తో పాటు బోర్డు ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా 10 ఐపీఎల్ ఫ్రాంచైజీల సీఈఓలకు ఒక సుదీర్ఘమైన హెచ్చరిక లేఖ రాశారు. ఆటగాళ్ల భద్రత, లీగల్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని అపరిచిత వ్యక్తులను హోటల్ గదుల్లోకి రానివ్వకూడదని, యాంటీ కరప్షన్ ప్రోటోకాల్స్ కచ్చితంగా పాటించాలని అందులో ఆదేశించారు. లీగ్ సాఫీగా సాగుతోందని చెబుతూనే, రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్




పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ-సిగరెట్ లేదా వేపింగ్ చేసిన ఉదంతాన్ని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ ప్రస్తావించారు. టీవీ లైవ్ బ్రాడ్‌కాస్ట్‌లో రియాన్ పరాగ్ వేప్ పట్టుకుని కనిపించడంపై దేశవ్యాప్తంగా విమర్శలు వచ్చాయి. ఇలాంటి చిన్నపాటి సంఘటనలను మనం ముందే నివారించాల్సి ఉండాల్సిందని, ఆ ఒక్క వివాదం మినహా ఈ సీజన్లో ఎలాంటి పెద్ద తప్పులు జరగలేదని ఆయన అన్నారు. సెక్రటరీ దేవజిత్ సైకియా చేసిన నిర్దిష్ట వ్యాఖ్యల గురించి తనకు పూర్తి సమాచారం లేదని, దానిపై ఆయనే మాట్లాడాలని ధుమాల్ పేర్కొన్నారు. వివాదాలను పక్కనబెడితే, ఆట పరంగా ఐపీఎల్ 2026 సీజన్ అత్యంత అద్భుతంగా సాగిందని ఐపీఎల్ చైర్మన్ కొనియాడారు. మునుపటి సీజన్ల లాగే, ఈసారి కూడా లీగ్ స్టేజ్ చివరి రోజు వరకు ఏ ఏ నాలుగు జట్లు ప్లే-ఆఫ్స్‌కు క్వాలిఫై అవుతాయో ఎవరికీ అర్థం కాలేదని, అదే ఐపీఎల్ కి ఉన్న అసలైన బ్యూటీ అని ఆయన అన్నారు. మ్యాచ్‌ల క్వాలిటీ, ఆటగాళ్ల ప్రదర్శన ఈసారి నెక్స్ట్ లెవెల్‌లో ఉందంటూ ఆయన హర్షం వ్యక్తం చేశారు.